SUDHAKARA KAVITHA JYOTHSNA – OKA PARISHEELANA

A Dissertation submitted to the UNIVERSITY OF HYDERABAD in partial fulfillment of the Degree of

Master of Philosophy

in

Telugu

by

SHOBHAN BABU. B

Department of Telugu
School of Humanities
University of Hyderabad
June-2014

సుధాకర కవితా జ్యోత్స్న – ఒక పరిశీలన

ఎం.ఫిల్. పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాసం

పరిశోధకుడు

శోభన్ బాబు. బి

పర్యవేక్షణ

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

జూన్ – 2014

CERTIFICATE

This is to certify that the dissertation entitled ***'SUDHAKARA KAVITHA JYOTHSNA – OKA PARISEELANA'***submitted by ***Mr. ShobhanBabu. B***bearing Reg. No. **13HTHL04** in partial fulfillment of the requirements for the award of Master of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance which is a plagiarism free dissertation

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Prof. S. Sarathjyothsna Rani
Research Supervisor

Head
Department of Telugu

Dean
School of Humanities

DECLARATION

I, **Shobhanbabu. B**hereby declare that this Dissertation entitled ***'SUDHAKARA KAVITHA JYOTHSNA – OKA PARISEELANA'***submitted by me under the guidance and supervision of **Prof. S. Sarathjyothsna Rani**is a bonafide research work which is also free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my dissertation can be deposited in Shodganga/INFLIBNET.

SHOBHAN BABU. B
Regd. No. 13HTHL04

Date:

అంకితం

అందగాడు

తొందరగా నడిచేవాడు

ఇసుమంతైనా

ఈర్ష్యాసూయలు లేనివాడు

చిన్నవయసులోనే

ఎందరిచేతనో

వందనాలందుకున్నవాడు

చిత్రలేఖనంలో నేర్పరి

చిత్తశుద్ధిలో గడసరి

శేఖరన్న

దివ్యస్మృతికి.............

మొదటి అధ్యాయం

సుధాకర కవితా జ్యోత్స్న – కవి జీవిత రేఖలు

రెండవఅధ్యాయం

సుధాకర కవితా జ్యోత్స్న – ఆధ్యాత్మికాంశాలు

మూడవఅధ్యాయం

సుధాకర కవితా జ్యోత్స్న – సామాజికాంశాలు

నాల్గవఅధ్యాయం

సుధాకర కవితా జ్యోత్స్న –

కవితా శిల్పం

ఐదవఅధ్యాయం

సుధాకర కవితా జ్యోత్స్న –

భాషా సాహిత్య విశేషాలు

విషయసూచిక

	కృతజ్ఞతలు	iii
	ముందుమాట	iv
	సంకేత పద సూచి	v

అధ్యాయం – 1

1.	సుధాకర కవితా జ్యోత్స్న – కవి జీవితరేఖలు	1 – 15
1.1	కవి పరిచయం	1
1.2	రచనలు	3
1.3	సుధాకర్ వ్యక్తిత్వం	4
1.4	సుధాకర కవితా జ్యోత్స్న – సంగ్రహ పరిచయం	7
1.5	వ్యాస రచయితగా సుధాకర్	10
1.6	పరిశోధకుడిగా సుధాకర్	12

అధ్యాయం – 2

2.	సుధాకర కవితా జ్యోత్స్న – ఆధ్యాత్మికాంశాలు	16 – 26
2.1	నవవిధ భక్తి సమన్వయం	16
2.2	యోగశాస్త్ర విశేషాలు	21
2.3	గీతోక్తులు – ఛాయోక్తులు	23
2.4	అధిక్షేపం	25

అధ్యాయం – 3

3.	సుధాకర కవితా జ్యోత్స్న – సామాజికాంశాలు	27 – 38
3.1	శ్రీ సాయీశ శతకం	27
3.2	శ్రీ తోగు వేంకటేశ శతకం	29
3.3	సరస్వతీ శతకం	31
3.4	రమ్య భావ తరంగాలు	33

అధ్యాయం – 4

4.	సుధాకర కవితా జ్యోత్స్న –కవితా శిల్పం	39 – 76
4.1	అవతారికా విశేషాలు	40
4.2	శ్రీ సాయీశ శతకం	43
4.3	శ్రీ తోగు వేంకటేశ శతకం	52
4.4	సరస్వతీ శతకం	61
4.5	రమ్య భావ తరంగాలు	64
4.6	లయాత్మకత	69

అధ్యాయం –5

5.	సుధాకర కవితా జ్యోత్స్న – భాషా సాహిత్య విశేషాలు	77 – 98
5.1	ఛందస్సు	77
5.2	అలంకారాలు	84
5.3	విమర్శక దృష్టి	89
5.4	సూక్తులు	91
5.5	సామెతలు	93
5.6	భాషా విశేషాలు	94
	ముగింపు	99
	ఉపయుక్త గ్రంథసూచి	100
	అనుబంధం – 1	103
	అనుబంధం – 2	105
	అనుబంధం – 3	107
	అనుబంధం – 4	108
	అనుబంధం – 5	109
	అనుబంధం – 6	110

కృతజ్ఞతలు

నిరంతరం నా కొరకు పరితపించి, నన్ను ఇంతవాన్ని చేసిన నా తల్లిదండ్రులు – బొలుగాని అనసూర్య, పిచ్చయ్యగార్లకు,

ఈ పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు,

ఈ పరిశోధన వ్యాసానికి పర్యవేక్షతవహించి తగిన సలహాలు, సూచనలు అందించిన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి,

యం.ఏ. లో నాకు పరిశోధన రంగంపై ఆసక్తిని కల్గించి, నన్ను ప్రోత్సహించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యాపకులు – ఆచార్య బేతవోలు రాంబ్రహ్మం గారికి, ఆచార్య ఎన్.ఎస్. రాజుగారికి, డా. తుమ్మల రామకృష్ణ గారికి, డా. జి. అరుణకుమారి గారికి, డా. రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి గారికి, డా. పిల్లలమర్రి రాములుగారికి, డా. పమ్మి పవన్ కుమార్ గారికి, డా. దార్ల వెంకటేశ్వర రావు గారికి, డా. దేవారెడ్డి విజయలక్ష్మి గారికి, డా. బాణాల భుజంగరెడ్డి గారికి, డా. డి. విజయకుమారి గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు.

అదేవిధంగా నాకు చేదోడు, వాదోడుగా చేయూత నందించిన తెలుగు శాఖ బోధనేతర సిబ్బంది – భవానీ శంకర్ గారికి, రాంబాబు గారికి, గణేశ్ గారికి, సాయి గారికి కృతజ్ఞతలు.

నా ఉన్నతిని కోరుకునే అన్న వెంకన్నకు, చదివించడంతో పాటు చదవడమెలాగో నేర్పిన అన్న రాములుకు,

'సుధాకర కవితా జ్యోత్స్న' గ్రంథకర్త అగు తిరువరంగం సుధాకర్ గారి జీవిత విశేషాలను గురించి విలువైన సమాచారం అందించిన వారి ధర్మపత్నులు – తిరువరంగం పద్మాలయ, సీత గార్లకు,

అవసరం వచ్చినప్పుడల్లా తమ సహకారాన్ని అందించిన సీనియర్ విద్యార్థులు మరియు నా స్నేహితులు గోపాస్ శ్రీహరి, ధీరావత్ లక్ష్మణ్, పెద్దింటి మల్లికార్జున్, పొడిశెట్టి శ్రీకాంత్,మైబు, ధమ్మపాల్ లకు,

అక్షరాలను అందంగా టైపు చేసిన శ్రీమతి రాధాకుమారి గారికి,

ఇంకా ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన సహృదయ మిత్రులకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

శోభన్ బాబు. బి

ముందుమాట

నాటినుంచి నేటిదాకా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న పద్యప్రక్రియ తెలుగుశతకం. ఎన్నెన్ని కావ్యాలు, నవలలు, నాటకాలు, ఇతరేతర ప్రక్రియలు సమాంతరంగా తెలుగు సాహిత్య రంగంలో వచ్చినా 'చెడనిది శతకం ఒక్కటే' నన్నట్లు కవులు ఈ ప్రక్రియను సాధిస్తూనే ఉన్నారు. అనేకానేక సామాజికాంశాలను తమ శతకాల ద్వారా లోకంలోనికి ప్రవహింపచేస్తూనే ఉన్నారు.

భక్తి శతకమైనా, రక్తి శతకమైనా, ఏ విషయానికి సంబంధించిన శతకమైనా సందర్భాన్ని పురస్కరించుకొని మనిషిని సంస్కరించే ప్రయత్నం చేశాయి. ప్రతి విషయంలోనూ కచ్చితంగా విషయాన్ని బోధించి, విజ్ఞాన పరిధి విస్తృతికి, విలువల ఉన్నతీకరణకు తోడ్పడిన అపురూప ప్రక్రియ శతకం.

మనిషి అంతరంగాన్ని తేటపరచి అతని వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతూ విలువల్ని కాపాడే విధంగా అతని ప్రవర్తనను మలచవలసిన సాహిత్యావసరాన్ని శతకం గుర్తించింది. తెలుగు శతకాలను ఎంత లోతుగా అధ్యయనం చేస్తే అది కాపాడుతున్న విలువల గురించి అంతగా తెలుసుకొనే అవసరం ఉంది. ఈ ఉద్దేశ్యంతోనే నేను 'సుధాకర కవితా జ్యోత్స్న' కవితా సంపుటిని ఎంచుకున్నాను. సుధాకర కవితా జ్యోత్స్నలో శ్రీ సాయి శతకం, శ్రీ తోగు వేంకటేశ శతకం, సరస్వతీ శతకాలున్నాయి.

ఈ కవితా సంపుటిలోనే 'రమ్య భావ తరంగాలు' పేరిట కొన్ని గేయాలు, వచన కవితలున్నాయి. ప్రతిభావంతుడైన కవి తాను పట్టిందల్లా బంగారం చేయగలడు. సుధాకర్ పద్య రచనతో పాటు గేయాన్ని, వచన కవితనూ సమానంగా ఆదరించాడు. వీటిలో సుధాకర్ స్వీయముద్ర చక్కగా కనిపిస్తుంది.

'సుధాకర కవితా జ్యోత్స్న'లో నేటి సమాజాన్ని ప్రతిబింబించే సామాజికాంశాలున్నాయి. భగవంతుని గుణలీలావర్ణనలు, గీతోక్తులకు ఛాయోక్తులనదగిన పద్యాలున్నాయి. అదేవిధంగా యతి స్థానంలో మకుట ప్రయోగం ఉన్న పద్యాలున్నాయి. రగడలను పోలిన గేయాలున్నాయి. వీటిని పరిశీలించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కవితా సంపుటిని నా పరిశోధనాంశంగా ఎంచుకున్నాను.

సంకేతపద సూచి

అప్ప.	అప్పకవీయం	అప్పకవి
కవిరా.	కవిరాజ మనోరంజనం	కనుపర్తి అబ్బయామాత్యుడు
కువ.	కువలయాశ్వచరిత్ర	సవరము చిననారాయణ కవి
చంద్రి.	చంద్రికా పరిణయం	సురభి మాధవ రాయలు
ఛందో.	ఛందో దర్పణం	అనంతామాత్యుడు
తోగు.	శ్రీ తోగు వేంకటేశ శతకం	తిరువరంగం సుధాకర్
ద్వి.నల.	ద్విపద నల చరిత్ర	చక్రపురి రాఘవాచార్యులు
నీలా.	నీలాసుందరి పరిణయము	కూచిమంచి తిమ్మకవి
పండితా.	పండితారాధ్య చరిత్ర	పాల్కురికి సోమన
భాగ.	భాగవతం	బమ్మెర పోతన
భోజ.	భోజరాజీయం	అనంతామాత్యుడు
మను.	మనుచరిత్ర	అల్లసాని పెద్దన
యయా.	యయాతి చరిత్ర	పొన్నిగంటి తెలగన
రమ్య.	రమ్య భావ తరంగాలు	తిరువరంగం సుధాకర్
రసిక.	రసికజనమనోభిరామం	కూచిమంచి తిమ్మకవి
సర.	సరస్వతీ శతకం	తిరువరంగం సుధాకర్
సారంగ.	సారంగధర చరిత్ర	చేమకూర వేంకటకవి
సా.శ.	సాయి శతకం	తిరువరంగం సుధాకర్

1. సుధాకర కవితా జ్యోత్స్న – కవి జీవితరేఖలు

1.1 కవి పరిచయం:

తిరువరంగం సుధాకర్ గారు ఉభయ భాషా ప్రవీణులు. వృత్తిరీత్యా తెలుగు పండితుడు, ప్రవృత్తి రీత్యా కవి. వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో తేది: 13.09.1947న జన్మించాడు. (మడికొండ కాజీపేటకు 3 కి.మీ. దూరంలో ఉంటుంది). వీరి తల్లి దమయంతి, తండ్రి వేంకట నరసింహాచార్యులు. 'కవి శేఖర' వీరి బిరుదు.

సుధాకర్ బాల్యం మాతామహుల ఇంటిలో గడిచింది. 'ఆహిరీ భూపాలు నా స్థాన బుధకవి/అల్లసాని వాని యంతవాడు' గా పేరుపొందిన శ్రీమాన్ వానమామలై లక్ష్మణాచార్యులు గారు వీరి మాతామహులు, గురువులు. సుధాకర్ తన తాతగారి వద్ద సంస్కృతాంధ్రాలు అభ్యసించాడు. సంప్రదాయబద్ధంగా పంచకావ్యాలు అధ్యయనం చేశాడు. వారి తాతగారు 'నేను నేర్చింది నీకు నేర్పాను, అభివృద్ధి పరచుకోవడం నీ వంతు' అని వదిలేశారు. ధర్మపురి చిరునామా ఇచ్చారు. అక్కడ ఉండి చదువుకోమన్నారు. అక్కడ శ్రీ చంద్రశేఖర శాస్త్రి గారి ఇంటికి వెళ్ళి వారాలు చేసుకుంటూ చదువుకుంటుండగా తండ్రి మరణించాడు. ఎలాగోలా కష్టపడి ఆ ఊరి ప్రజల చలవవల్ల హైద్రాబాద్ వెళ్ళి పరీక్ష పాసయ్యాడు. పన్నెండు మంది వెళితే ధర్మపురిలోని వారంతా సుధాకరొక్కడు తప్ప మిగతా వారంతా పాసౌతారన్నారు. ధర్మపురిలోని ఒక బ్రాహ్మణమ్మ చాలా పేదరాలు. ఐనా తాను కూడా సాయం చేయాలనే కోరికతో వారానికి ఒకరోజు సుధాకర్ కి భోజనం పెట్టేది. ఆమె దాచుకున్న డబ్బులో కొంత ఇచ్చేది. ప్రేమగా ఆ గ్రామస్తుల సాయంతో పరీక్షలకు వెళ్ళిన సుధాకర్ దుస్తుల స్థితిని చూసి పరీక్ష హాల్లోకి అనుమతించలేదు – పరీక్ష నిర్వాహకులు. తర్వాత హాల్ టికెట్ చూసి లోనికి పంపారు. అందరి ఆదరాభిమానాలతో చదువు, ఎంట్రన్సు పూర్తి చేశాడు. అందరిలో తనొక్కడే పాసయ్యాడు.[1] కృషి, పట్టుదల ఉంటే పేదరికం అవరోధం కాదనీ, చదువుకోవటానికి అతి సామాన్యులు సైతం సాయపడతారనటానికి ఈ సంఘటన చక్కని ఉదాహరణ.

[1]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

కాలం ఎప్పటికీ ఒకేలా ఉండదు గదా! అభ్యాసం పట్ల మక్కువ ఎక్కువగల సుధాకర్ కు సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. ఇంటికి వెళ్ళి చదివించమని ప్రాధేయపడ్డాడు. మా వల్ల కాదు, ఉద్యోగం వెతుక్కో అన్నారు. ఉద్యోగమంటే మాటలా? సరే, బయల్దేరాడు. ఎంత ప్రయత్నించినా లాభం లేదు. ఒక పక్క ఆకలి, ఇంకో పక్క ఉద్యోగం వేట, మరో పక్క చదువుకోవాలనే ఆకాంక్ష. ఏం లాభం? దైవం అనుకూలించలేదు. త్రోవలో స్పృహ తప్పి పడిపోయాడు. ఒక మార్వాడి సేటు ముఖంపై నీళ్ళు చల్లి లేపి కడుపునిండా భోజనం పెట్టి, బస్సు చార్జీలిచ్చి ఇంటికి వెళ్ళు ఉద్యోగం దొరకదని సూచించారు. నిరాశగా తిరిగి వస్తూ తిరువరంగం సత్యనారాయణాచార్యులు గార్ని కలిసి విషయం వివరించగా, వారు కొంత డబ్బిచ్చి తిరువరంగం హయగ్రీవాచార్యుల గారికి ఇవ్వమని ఒక ఉత్తరం రాసి ఇచ్చారు. వీరిద్దరూ సుధాకర్ కు పెదనాన్నలు అవుతారు. ఆ ఉత్తరం తీసుకొని హైద్రాబాద్ వెళ్ళి హయగ్రీవాచార్యులను కలిశాడు. వారు ఏం చేయాలనుకుంటున్నావని ప్రశ్నిస్తే – తనకేమో చదువుకోవాలని ఉందని, ఇంట్లోనేమో ఉద్యోగం చేయమంటున్నారని చెప్పాడు. అందుకాయన ఇంతకాలం వాళ్ళు బతికినట్టే ఇకముందూ బతుకుతారు, బుద్ధిగా చదువుకొని స్కాలర్ షిప్ తెచ్చుకుంటానంటే ఎంతవరకైనా చదివిస్తానని తనతో తీసుకువెళ్ళి సీతారాంబాగ్ సంస్కృత కళాశాలలో చేర్పించి, బట్టలు, పుస్తకాలు ఇప్పించి, స్కాలర్ షిప్ వచ్చేవరకూ ప్రతినెలా యాభైరూపాయలు ఇంటికి వచ్చి తీసుకువెళ్ళమని చెప్పారు. అలా సాగిన సుధాకర్ చదువుకు హయగ్రీవాచార్యులు గారు ముఖ్యకారకులు.[2]

సుధాకర్ 1966 – 67లో బి.వో.ఎల్ పాసయ్యాడు. 1969లో బి.వో.ఎల్ పరీక్షల ముందు స్వగ్రామమైన మడికొండకు వెళ్ళాడు. అప్పుడు ధర్మసాగర్ లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీ బుర్ర వీరయ్య గారు తన పాఠశాలలో జూనియర్ తెలుగు పండిట్ గా పనిచేయమని కోరగా, వారు ఆ ఉద్యోగంలో చేరారు. ఆ విధంగా ప్రారంభమైంది వీరి ఉపాధ్యాయ జీవితం. అక్కడి నుండి గోవిందరావు పేటకు బదిలీ

[2]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

అయ్యాడు.[3] తర్వాత మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని నేరడ గ్రామంలో, తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామంలో, తిమ్మంపేటలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు.

1.2 రచనలు:

సుధాకర్ చిన్నప్పుడు తాతగారు మరియు ఆదిగురువులైన వానమామలై లక్ష్మణాచార్యుల అనుగ్రహంతో పద్యాలు రాసే శక్తి అలవర్చుకున్నారు. ఆ క్రమంలోనే 'సరస్వతీ' మకుటంతో శతక రచన మొదలుపెట్టి దాదాపుగా పూర్తి చేశాడు. ఉద్యోగరీత్యా బదిలీల పర్వంలో భాగంగా వరంగల్ జిల్లా మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని నేరడ అనే గ్రామానికి బదిలీ అయ్యాడు. అక్కడ ఒక్క సంవత్సరమే పనిచేసినప్పటికీ వారి జీవితంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. మొదటిది తన వృత్తిలో అత్యధిక సంతృప్తి పొందటం. రెండోది తానెంతో శ్రద్ధగా రాసిన సరస్వతీ శతకంలోని చాలా పద్యాలు చెదలు పట్టి లభ్యం కాకుండా పోవడం. ఇది ఒక చేదు జ్ఞాపకం.[4]

సుధాకర్ 1988 లో ప్రథమ శ్రేణి తెలుగు పండిట్ గా పదోన్నతి పొంది తొర్రూరు మండలంలోని చెర్లపాలెం అను గ్రామానికి బదిలీ అయ్యాడు. ఎక్కువ సంవత్సరాలు పనిచేసింది ఇక్కడే. ఆ సమయంలోనే అంటే 1994లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. డిస్టింక్షన్ లో ఉత్తీర్ణత సాధించాడు. పూర్వీకుల నుండి వారసత్వంగా లభించిన జ్ఞానంతో, భాషపై మక్కువతో శ్రీ సాయీశ శతకం, శ్రీ తోగు వేంకటేశ శతకాలు పూర్తి చేశాడు.[5]

1999లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. పూర్తిచేసి, అదే విశ్వ విద్యాలయంలో 'శంఖవరం రాఘవాచార్యుల విశ్వనాథ విజయం – సమగ్ర పరిశీలన' అనే విషయంపై ఆచార్య శలాక రఘునాథ శర్మ గారి నిర్దేశకత్వంలో పరిశోధన పూర్తి చేశాడు. తన శ్రమకు ఫలితంగా 2002 ఫిబ్రవరిలో డాక్టరేట్ పట్టాను పొందాడు.[6] డాక్టరేట్ పట్టా పొందిన తర్వాత కొద్ది కాలవ్యవధిలోనే, అంటే 07.03.2002 తారీఖున పరమపదించారు.

---

[3]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

[4]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

[5]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

[6]పద్మాలయ, గ్రంథకర్త పరిచయం, సుధాకర కవితా జ్యోత్స్న

1.3 సుధాకర్ వ్యక్తిత్వం:

తిరువరంగ సుధాకరాఖ్యుదధీత సంస్కృతుడాంధ్రుడున్
గురు పదాబ్జ పరాగ సంతత గుంజ దద్భుత భృంగమున్
సరస సత్కవితా సతీశ్వర సర్వపండిత దాసుడున్
కరము బూనె సరస్వతీ శతకమ్ము కమ్మన వ్రాయగన్[7]

సుధాకర్ కవి, పండితుడు, గాయకుడు. తన వృత్తిపట్ల అంకితభావం, సేవాదృక్పథం కలవాడు. వీరి హృదయం విశాలం, నిష్కల్మషం. వీలైనంత వరకు తోటివారిని నొప్పించి ఎరుగరు. ఎదుటివారిని ఆదరించడం వీరి నైజం. తల్లిదండ్రుల యెడల, గురువుల పట్ల, పెద్దల విషయంలో భక్తి ప్రపత్తులు గలిగి పూజ్యభావంతో మెలిగేవారు. అసత్యానికి, అధర్మానికి, అన్యాయానికి సాధ్యమైనంత వరకు అవకాశమిచ్చేవారు కాదు. పైన పేర్కొన్న పద్యంలో 'సర్వపండిత దాసుడు' అనే ఒక విశేషణం చాలు, వీరి గుణౌన్నత్యాన్ని దర్శింపచేయటానికి. బాల్యం నుండి ఉద్యోగంలో చేరే వరకు తన చుట్టు పక్కల వాళ్ళు చేయూతనందించారంటే వీరి మంచితనాన్ని అర్థం చేసుకోవచ్చు. సహజంగా మంచితనం లేకపోతే ఎంతబాగా చదివే విద్యార్థికైనా ఎవరూ సాయపడరు గదా ఈ లోకంలో.

వీరికి జ్ఞానకాంక్షే తప్ప కీర్తికాంక్ష ఉన్నట్లు కనిపించదు. ఆ కీర్తి కాంక్షే ఉంటే వారి సరస్వతీ శతకం చెదలపాలు కాకపోవునేమో. అంతేకాదు తన గురువైన ఆచార్య శలాక రఘునాథ శర్మ గారికి తాను కవి అన్న విషయం ఏనాడూ చెప్పలేదని సుధాకర కవితాజ్యోత్స్నలోని 'హృది కదలిక' వల్ల తెలుస్తుంది.

వీరి పట్ల శర్మ గారి అభిప్రాయమిది. ''డా. తిరువరంగం సుధాకర్ ఆరు సంవత్సరాలకు పూర్వం మా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయడానికి బహుదూరపు బాటసారియై వచ్చాడు. స్థూలంగా నేను అతనిని గురించి వేసుకున్న అంచనా పరవాలేదు. కొంచెం ప్రయత్నంతో ఈ పెద్ద మనిషిని దిద్దుకోవచ్చు – అని. నేను నా విద్యా సంబంధమైన జీవితంలో కొందరిని చాలా తక్కువగా అంచనా వేసుకుని తరువాత పశ్చాత్తాప పడవలసిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. అందులో ఇది ఒకటి. డా. సుధాకర్ చాలా అమాయకుడుగా కనిపించేవాడు. చాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అతనికి

---

[7] తిరువరంగం సుధాకర్, సరస్వతీ శతకం అవతారిక, పుట - 1

పద్యరచనలో పాటవం ఉన్నదని కాని, హృదయ సంస్కారం ఉవ్వెత్తుగా ఉబికి కవిత్వాన్ని పండించినదని గాని సుమారు ఆరేళ్ళ పరిచయంలో సూచన మాత్రంగా కూడా నాకు తెలియకపోవడం. ఈ అజ్ఞానంతో నేను ఆయనను ఒక పసివానిగా భావించాను. ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను. నా హృదయపు తప్పిదాన్ని సరిదిద్దుకోవడానికి ఇప్పుడు నాకు సరియైన అవకాశంలేదు. అతడు భౌతికంగా నన్ను, ఆత్మీయులను విడిచి వెళ్ళిపోయాడు. ఆ విధంగా నా పశ్చాతాపానికి నిరవధికమైన స్థితిని కల్పించాడు. ఇవన్నీ (కవితా శక్తి, రచనా పాటవం, గౌరవ ప్రపత్తులు) సమీక్షించి చూస్తే నాకు తెలిసిన సుధాకర్ వేరు. నాకు తెలియని సుధాకర్ విశ్వరూపం వేరు అని ఒప్పుకోక తప్పదు. నేను మనసారా అతని ఔన్నత్యాన్ని ఇప్పుడు అనుశీలించి ఆనందిస్తున్నాను.''[8] అని శర్మగారు అనడం వీరి వ్యక్తిత్వానికి నిదర్శనం.

సుధాకర్ సంగీతంతోను పరిచయం గలవాడు. ''వీణ హార్మణులను వీనుల విందుగ వాయించగల్గిన వాద్యగాడు.''[9] వీరి పద్యాలలోని లయ సంగీతంలో వీరికున్న ప్రవేశాన్ని స్పష్టపరుస్తుంది. ఉదాహరణకు

బిరబిర వచ్చినమ్మి మరి బిగ్గరగాను గవుంగిలింపవే
సరస రసాల సద్రస ససార వచస్తతి నిచ్చిపోవవే
సరసర నాదు నాలుకనుశాలను దూకుచు నాట్యమాడవే
కొరకొర లేక కోరికల కూరిమి దీర్చగదే సరస్వతీ (సర – 15)

వంటి లయ ప్రధానంగా సాగే పద్యాలు, గేయాలు సుధాకర కవితా జ్యోత్స్నలో ఉన్నాయి.

సుధాకర్ ''తెల్గు బోధక సుశీలుడు, సంస్కృతంలో నేర్పరి, నడక లోపల రీవి, నడతలోపల మైత్రి గలవాడు, కరుణ కల్గినవాడు, కపటికాడు, సంస్కృతాంధ్రాంగ్లముల్ చదివి సాధించిన అపర భగీరథుడు, గద్య పద్య రచనలు చేసి ఘనుడైనా ఏ మాత్రమూ గర్వము లేని వాడు''[10] అని వెలిగడప చండికేశ్వర శర్మగారు వరంగల్ లో 'సుధాకర కవితా జ్యోత్స్న'పుస్తకావిష్కరణ సభలో తన 'మనసులోని మాటలు' చదివి వినిపించారు.

[8]శలాక రఘునాథ శర్మ, 'హృది కదలిక' సుధాకర కవితా జ్యోత్స్న

[9]చండికేశ్వర శర్మ, మనసులోని మాటలు

[10]చండికేశ్వర శర్మ, మనసులోని మాటలు

ఉత్తమోపాధ్యాయ వృత్తిని చేపట్టి

న్యాయము చేకూర్చె నియతి తోడ

సంస్కృతాంధ్రాంగ్లముల్ చదివి సాధించిన

అపర భగీరథుండన వచ్చు

గద్య పద్య రచనల్ గావించి ఘనుడయ్యు

గర్వంబు లేనట్టి గౌరవుండు

ధన్యులీతని తల్లిదండ్రి కళత్రముల్

హితబంధుయుత దేశమాత ధన్య

ధన్య సౌజన్య మూర్తికి యెన్నరాని

శ్రీశుఁడాత్మకిచ్చు తశాంతి శాశ్వతముగ

ఆత్మబంధువు లందరి కందజేయు

ఆయురారోగ్య భాగ్యాల నధిక తృప్తి[11]

వంటి మరికొన్ని పద్యాలు అనుబంధంలో చూడవచ్చు. తద్వారా సుధాకర్ వ్యక్తిత్వం బోధపడుతుంది.

సుధాకర్ చక్కని ప్రతిభ గలవాడు. ‘‘ఎంత ప్రతిభ వున్నా, ఎంతటి వ్యుత్పత్త్యభ్యాసాలున్నా, ఎంతగా కృషి చేసినా ప్రోత్సాహం లేకుంటే నివురుగప్పిన నిప్పువలె అన్నీ మరుగున పడిపోతాయి.’’[12] ప్రోత్సాహానికి ఉన్న మహత్తు అటువంటిది. ఎందరికో ప్రోత్సాహమందించిన వీరికి మాత్రము సరైన ప్రోత్సాహం లభించలేదు. ముఖ్యంగా కవిత్వ విషయంలో. వీరు వృత్తిరీత్యా మారుమూల గ్రామాల్లో పనిచేయడం వల్ల సాహిత్య గోష్ఠులలో ఎక్కువగా పాల్గొనలేకపోయారు. వీరి రచనలలోని గుణదోష విచారాలు చేసి చక్కని సలహాలు అందించిన వారూ తక్కువే. అదే విధంగా మారుమూల గ్రామాల్లో గ్రంథాలయ వనరులు తక్కువ కావడం వలన పూర్వ రచనలు చదివి కొత్త రచనలు చేయాలన్న ఉత్సాహమూ సన్నగిల్లుతుంది. ఏదేమైనా సాహిత్య లోకంలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నారాయన.

---

[11]చండికేశ్వర శర్మ, మనసులోని మాటలు

[12]తిరువరంగం సుధాకర్, విశ్వనాథ విజయ కావ్యానుశీలనం, పుట - 13

కష్ట సుఖములరయ కావడి కుండలు
ఇష్టముగను రెంటినెట్టులైన
నొక్కతీరు చూడ నోరిమి యున్నచో
చిక్కులెల్ల తీరు దిక్కుతోచు (ఉగాది. రమ్య – పుట 28)

కష్టసుఖాలు కావడి కుండలు అనీ, ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతూ ఉంటాయని, సమభావంతో వ్యవహరించాలని లోకానికి చెప్పటమే కాదు తాను కూడా అనుసరించాడనడానికి వీరి జీవితమే సాక్ష్యం. వీరి జీవితంలో ఆశావాద దృక్పథమే తప్ప నిరాశావాద దృక్పథం కనిపించదు. అందుకే కాబోలు వీరి రచనల్లో వైరాగ్యం ఎక్కడా అగుపించదు.

మొత్తానికి ''సుధాకర్ లో గొప్ప సంస్కర్త కానవస్తాడు. మహాభక్తుడు సాక్షాత్కరిస్తాడు. చక్కని వైదుష్యం వెల్లువయై ప్రవహిస్తూ ఉంటుంది. అన్నింటికన్నా మిన్నగా అంతరంగ నైర్మల్యంతో అలరారే సమభావనా, 'సమ' దర్శన సామర్థ్యమూ అతివేలంగా గోచరిస్తాయి''[13] అని ఆచార్య శలాక రఘునాథ శర్మ గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

1.4 సుధాకర కవితా జ్యోత్స్న – సంగ్రహ పరిచయం:

'సుధాకర కవితా జ్యోత్స్న' కవితా సంపుటి గ్రంథకర్త తిరువరంగం సుధాకర్. ఇది ఒక త్రివేణీ సంగమం. ఇందులో మొదటిది శ్రీ సాయీశ శతకం, రెండవది శ్రీ తోగు వేంకటేశ శతకం, మూడవది రమ్యభావ తరంగాలు.

శ్రీ సాయీశ శతకం సద్గురు శ్రీసాయీశుని సన్నుతికి సంబంధించింది. శ్రీ తోగు వేంకటేశ శతకం మహారాష్ట్రలోని తోగు వేంకటపురిలో వెలసిన శ్రీ తోగు వేంకటేశుని దర్శించిన వారు ఆ క్షేత్ర మహాత్మ్యాన్ని కవికి చేబితే 'సంకట వినాశ! శ్రీ తోగు వేంకటేశ' మకుటంలో శతక రచన గావించారు.

[13]శలాక రఘునాథ శర్మ, 'హృతి కదలిక' సుధాకర కవితా జ్యోత్స్న

సుధాకర్ అప్పుడప్పుడు ఆయా సందర్భాలలో రాసిన కవితాఖండికలు చాలా ఉన్నాయి. అలాగే మాతృభాషలో విద్యాబోధన, అరసున్న అవసరం ప్రయోగం వంటి ఆలోచనాత్మక విషయాలను గూర్చి రాసిన వ్యాసాలు, చెదలు పట్టి పోయినవి పోగా మిగిలిన సరస్వతీ శతక పద్యాలు (సరస్వతీ సంస్తవనం) కొన్ని ఉన్నాయి. వాటినన్నింటిని 'రమ్య భావ తరంగాలు' అనే శీర్షికతో ఈ గ్రంథంలో ప్రచురణ కర్తలు అందించారు.

1.4.1 శ్రీ సాయీశ శతకం:

ఈ శతకం భక్తి రసాత్మకం. ఇందులో 138 కందపద్యాలున్నాయి 'సాయీ' అనేది ఇందులోని మకుటం. ఇందులో కవి యొక్క ఆత్మనివేదనం, సాయిబాబా యొక్క గుణౌన్నత్యం చక్కగా వర్ణించబడింది. ఇందులోని పద్యాలను ఒక క్రమ పద్ధతిలో పేర్చితే సద్గురు సాయినాథుని నిత్య పారాయణ గ్రంథంలా భాసిస్తుంది. ఈ శతకంలో అవతారికా సంప్రదాయాన్ని పాటించి కవి విలక్షణతను ప్రదర్శించారు. అంతేకాకుండా శతకం చివర ఫలశ్రుతి సంస్కృత శ్లోకాలలో ఉంది. శబ్దాలంకార యుక్తంగా ఈ శతకం ఉంది.

1.4.2 శ్రీ తోగు వేంకటేశ శతకం:

ఈ శతకం కూడా భక్తి రసాత్మకం. ఇందులో 100 తేటగీతి పద్యాలున్నాయి. 'సంకట వినాశ! శ్రీ తోగు వేంకటేశ' అనేది ఇందులోని మకుటం. పండితపామర జనరంజకంగా ఇందులోని పద్యాలు దర్శనమిస్తాయి. శ్రీనాథుని కాలంనుండి సీసపద్యం ఒక సమతూగు (తులాన్యాయం) తో రాయబడినట్లు, వేమన ఆటవెలది ఏ పాదానికాపాదం సమతూకంతో నడచినట్లు ఈ శతకంలోని తేటగీతి పద్యాలు సమతూగుతో నడిచాయి. గీతోక్తులకు ఛాయోక్తులనదగిన పద్యాలు ఇందులో ఉన్నాయి.

1.4.3 రమ్య భావ తరంగాలు:

1. సరస్వతీ సంస్తవనం (ప్రకృత గ్రంథంలో సరస్వతీ శతకంగా ప్రస్తావించబడింది):

'సరస్వతీ' అనేది ఇందులోని మకుటం. కొన్ని పద్యాలు ''ధాతృసతీ! సుదతీ! సరస్వతీ!'' అనే మకుటంతో (''ఆంధ్ర భాషలో యతిస్థానంలో మకుటం చేరేవిధంగా రాయబడినటువంటి శ్రీ కాళహస్తీశ్వర, దాశరథి శతకాల మాదిరిగా'')[14] ఉన్నాయి. అవతారికా పద్యాలతో కలిపి సరస్వతీ సంస్తవనంలోని మొత్తం పద్యాలు 35.

---

[14] బొలుగాని రాములు, 'గురుదక్షిణ' సుధాకర కవితా జ్యోత్స్న

2. సుధాకర్ అప్పుడప్పుడు ఆయా సందర్భాలలో చెప్పిన పద్యాలు, గేయాలు, వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

'రమ్య భావ తరంగాలు' లోని వ్యాసాలు

i. మాతృభాషలో విద్యాబోధన
ii. శారీరక మురికి వాడల కన్నను మానసిక మురికి వాడలు మరీ ప్రమాదకరములు
iii. సంక్రాంతి పర్వదిన ప్రాధాన్యం
iv. జన్మభూమి వేదాంత ప్రాముఖ్యం
v. అరసున్న అవసరం – ప్రయోగం

వీటితో పాటు సుధాకర్ గారి సిద్ధాంత గ్రంథం (సంపత్ విశ్వనాథ విజయ కావ్యానుశీలనం) లో ఉన్న ప్రపత్తి (8 వసంత తిలక వృత్తాలు), దత్తపది (10 తోటక వృత్తాలు) అనే స్తుతులు వీరి యొక్క సంస్కృత పాండిత్యాన్ని విశద పరుస్తాయి.

ఉదా. దత్తపది

సరసీరుహ సుందర పాదరజ:
శిరసామర పూజ్య ధరామి సదా
అభయం త్వధునా మమదేహి ముదా
వరదాన పరోభవ దత్తగురో!
కరకఙ్కణ ఝుంకృతిభిః కృతిభిః
దివిజైర్వినుతం తవగీత శతమ్
కరతాల శతైర్లయ తాలయుత
వరదాన పరోభవ దత్త గురో!

1.4.4 సుధాకర కవితా జ్యోత్స్నలోని మొత్తం పద్యాలు:

సంస్కృతం: అనుష్టుప్పు– 3
మాలిని – 1
భుజంగ ప్రయాతం – 1

తెలుగు: ఉత్పలమాల – 27

చంపకమాల – 25

శార్దూలం – 9

మత్తేభం – 3

మత్తకోకిల – 1

తరళం – 3

తేటగీతి 120

ఆటవెలది – 11

సీసం – 7

1.5 వ్యాస రచయితగా సుధాకర్:

సుధాకర్ వ్యాస రచనలోను సిద్ధహస్తులు. విషయానికి తగిన వివరణ తగిన ఆధారాలతో వీరి వ్యాసాలలో ఉంటుంది. విషయం సూటిగా ఎటువంటి సందేహానికి తావివ్వకుండా వీరి వ్యాసరచన సాగింది. వీరు కవి అయ్యుండి కూడా వీరి వ్యాస రచనలో కవితా పంక్తులు ఎక్కడా కన్పించకపోవడం మరో విశేషం.

రమ్య భావతరంగాలలో మొత్తం ఐదు వ్యాసాలున్నాయి. అందులో మొదటిది మాతృభాషలో విద్యాబోధన. ''పిల్లలు ఏ తల్లి పాలు త్రాగుదురో ఆ తల్లి మాట్లాడే భాషయే యా పిల్లలకు మాతృభాష అగును. తల్లి తరువాత తల్లి వంటిది మాతృభాష. మాటలు రానంతవరకు తల్లి యెన్నో యిబ్బందులు పడి, పిల్లల బాధలు, అవసరాలను అర్థము చేసికొని వారికుపయోగపడును. మాటలు వచ్చిన పిదప పరస్పర భావ ప్రకటనకై మాతృభాష యడుగడుగున తోడ్పడును''[15] అని మాతృభాష ఔన్నత్యాన్ని తెలియచేశాడు. ఇంకా ''విద్యాబోధన మాతృభాషలో సాగితేనే సులభావగాహన సాధ్యపడును. ఏ భాష నేర్చుకున్నను, ఏ విషయము నేర్చుకొనుటకైనను మాతృభాషలో బోధన జరిగినచో నే యితర భాషలైనను, విషయములైనను చక్కగ నేర్చుకొనుటకు వీలగును'' [16] అని మాతృభాషలో విద్యాబోధన జరగాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశాడు.

---

[15] తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 45

[16] తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 45

'శారీరక మురికి వాడల కన్నను మానసిక మురికి వాడలు మరీ ప్రమాదకరములు' అనే వ్యాసం నేటి సమకాలీన సమాజాన్ని చక్కగా ప్రతిబింబిస్తుంది. మనుషుల్లో పెరిగిన స్వార్థబుద్ధిని, ద్రోహచింతనను ఇందులో రచయిత చక్కగా విశ్లేషించాడు. 'స్వార్థము మితిమీరినచో, లోభము పెచ్చుపెరిగినచో మానవతకు మనుగడయే లేదు. ఈ గుణాలు మానసిక మాలిన్యమునకు ముఖ్య కారణములు'[17] అని మనోమాలిన్యానికి మూలాలు అన్వేషించాడు. 'మానవుడన్నపుడు కామక్రోధలోభ మోహ మాత్సర్యాలకు లోను గాకుండుట యసహజము. ఆ దుర్గుణాలు హద్దులో నున్నచో తప్పుకాదు. అవి మితిమీరినప్పుడే మానసిక మాలిన్యము పేరుకొని పోవుచుండును'[18] అనే సత్యాన్ని ఇందులో తెలియచేశాడు.

'సంక్రాతి పర్వదిన ప్రాధాన్యము' అనే వ్యాసంలో సంక్రాంతి పర్వదిన విశేషాలను తెలియచేశాడు. '' 'సమ్' అను నుపసర్గతో కూడిన 'క్రము' ధాతువునకు 'క్తిన్' ప్రత్యయము చేరగా 'సంక్రాన్తి' అను పదము తయారైనది'' అని 'సంక్రాంతి' అనే పదానికి వ్యాకరణ విశేషాలు తెలియచేశాడు. ఈ వ్యాసంలో తెలుగువారి ఆచార సంప్రదాయాలను చక్కగా విశ్లేషించాడు.

'జన్మభూమి వేదాంత ప్రాముఖ్యము' అనే వ్యాసంలో సుధాకర్ దేశభక్తి కనిపిస్తుంది. ''భారతీయుల సంస్కృతిలో వేదాంతము గూడ ఒక భాగము. వేదాంత మను పదము దైవికమగు విషయములో వ్యవహరింపబడు పదము. దైవికము అనగా దేవతాభక్తికి సంబంధించిన యొక శాస్త్రము. అది 'పరబ్రహ్మము' ను గూర్చి బోధించును. దైవికము అనుపదానికి 'విధి' లేదా అదృష్ట దురదృష్ట సంబంధిగా లౌకిక వ్యవహారమున్నది. అన్నింటికి మూలము దైవమే అను భావము భారతీయులలో వ్యాపించి యున్నది. కాని ఆ భావన నేటి కాలానికి ఉపయోగపడుటలేదు. ఏ కాలములోనైనను అప్రయత్నముగ ఏ కార్యమూ సిద్ధించుట సాధ్యపడదను భావన నూటికి నూరు పాళ్ళు సత్యము. మన చేతిలో నేమున్నది? అంతా దైవమే చూచుకొంటుందని 'దైవాధీనం జగత్సర్వ'మ్మను భావము ప్రబలముగ మనవారిలో బలపడినది. దీనినే నేడు 'మెట్ట వేదాంత' మని యనుచున్నారు.

[17] తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 49

[18] తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 49

కాని ఈ భావము అభివృద్ధి నిరోధకము. దైవముపై నమ్మకముండవలెగాని మూఢ నమ్మకముండరాదు''[19]వంటి ఆలోచనాత్మక పంక్తులెన్నో ఈ వ్యాసంలో ఉన్నాయి.

'అరసున్న అవసరము – ప్రయోగము' అనే వ్యాసం భాషా పరిశీలనా దృష్టితో వివేచించిన వ్యాసం. ''అరసున్నకు ఉచ్చారణ లేదు. కాని ప్రాచీన భాషా స్వరూపము తెలిసికొనుటకును, అరసున్నగల పదాలు, లేని పదాలు భిన్నార్థాలు తెలిసికొనుటకును పనికి వచ్చును.''[20] అని అరసున్న అవసరాన్ని ఇందులో తెలియచేశాడు. అందుకు తగిన ఉదాహరణలు ఇచ్చాడు. ''ఈనాడు వాడుక బాస ప్రాధాన్యమును సంతరించుకొన్న కారణమున దేని యవసరము లేనే లేదని భావింపదగదు. తెలుగు భాషా స్వరూపమును గుర్తుంచుకొనకున్నచో భాషా పాండిత్య సంపాదన సమయమున చాలా ఇబ్బందులలో ఇరుకుకొనవలసి వచ్చును.''[21] అని అరసున్న ప్రయోగ అవసరాన్ని గుర్తుచేశాడు.

1.6 పరిశోధకుడిగా సుధాకర్:

సుధాకర్ కవిత్వంలోనే కాదు పరిశోధనలోను తనదైన ముద్ర వేసుకున్నాడు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తర్వాత దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా ప్రవేశించాడంటే పరిశోధన పట్ల తనకు గల అంకిత భావం, గౌరవ ప్రపత్తులు, పట్టుదల అర్థం చేసుకోవచ్చు.

1999 లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ద్వారా ఎం.ఫిల్. పూర్తి చేసి అదే విశ్వవిద్యాలయంలో 'శంఖవరం రాఘవాచార్యుల విశ్వనాథ విజయం – సమగ్ర పరిశీలన' అనే విషయంపై ఆచార్య శలాక రఘునాథ శర్మ గారి నిర్దేశకత్వంలో పరిశోధన పూర్తి చేశాడు. తన శ్రమకు ఫలితంగా 2002 ఫిబ్రవరిలో డాక్టరేట్ పట్టాను పొందాడు సుధాకర్. సుధాకర్ పరిశోధనా రంగం వైపు దృష్టి సారించడానికి ప్రోత్సాహకులు, ప్రేరేపకులు వెలగడప చండికేశ్వర శర్మగారు ముఖ్య కారకులని సుధాకర్ ధర్మపత్ని పద్మాలయ తెలియచేశారు.

---

[19]తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 59

[20]తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 65

[21]తిరువరంగం సుధాకర్, 'రమ్యభావ తరంగాలు' సుధాకర కవితా జ్యోత్స్న, పుట - 65

సుధాకర్ తన పరిశోధనా గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాడు. మొదటి అధ్యాయంలో కవి ప్రశస్తి – కావ్య ప్రశస్తి, కవి జీవితం – సారస్వత జీవితం, విశ్వనాథ విజయ రచనకు ప్రేరక పరిస్థితులు, తెలుగులో దేశభక్తి సాహిత్యం – సంగ్రహ పరిచయం అనే విషయాలను చర్చించాడు.

రెండవ అధ్యాయంలో చరిత్ర – చారిత్రక కావ్యాలు – వాని ప్రయోజనాలు, చరిత్రను కావ్యంగా మలచుటలో సాధక బాధకాలు, చారిత్రక కావ్యాలలో శాశ్వతత్వపు విలువలు, చారిత్రక కావ్యాలు – తదుత్పత్తి వికాసాలను విశ్లేషించాడు.

మూడవ అధ్యాయంలో విశ్వనాథ విజయం – చారిత్రక నేపథ్యం, విశ్వనాథ విజయం – చారిత్రక కావ్యాలలో తులనాత్మకత, విశ్వనాథ విజయం – చారిత్రకత అనే అంశాలను చర్చించాడు.

నాల్గవ అధ్యాయంలో విశ్వనాథ విజయం – ఇతివృత్త నిర్వహణము, విశ్వనాథ విజయ కావ్య నిర్మాణ శిల్పము – నవ్య ప్రబంధకత, కవి – కవితా ప్రౌఢి – భాషా సంపద, విశ్వనాథ విజయం – రస భావాది శిల్ప సమీక్ష, విశ్వనాథ విజయం – ఛందశ్శిల్పం మొదలైన అంశాలున్నాయి.

ఐదవ అధ్యాయంలో విశ్వనాథ విజయంలో గానవచ్చు సాంఘిక పరిస్థితులను చర్చించాడు.

సుధాకర్ పరిశోధనా గ్రంథంలో తానిచ్చిన వివరణలు ఎంతో సమంజసంగా ఉన్నాయి. ఉదాహరణకు

''కరవీర కుసుమ పింజర శిరోవేష్టను,
శ్రీ చూర్ణ పుండ్ర భూషితలలాటు,
వ్యాయామ వర్ధిత వజ్రకర్కశకాయు,
కవచిత ప్రథుల వక్షః కవాటు,
వీరోచితోదగ్ర వృత్త భుగ్నశ్మశ్రు,
నయనోపరి ప్రాక్తన వ్రణాంకు,
బద్ధగోధాత్రాణ బహుకిణాంకిత హస్తు,
గటిచక్రపిహితాహికల్పకుండు,

స్వీయ యౌవన రూపాను బింబసదృశు,
నభిముఖియాత సాకార విభవరాశి,
స్థవిరసేనాని పొడగనెఁ దనతనూజు,
వ్యాయతోత్తుంగ కఠిన పీనాంసు ప్రాంశు''

అనే పద్యానికి సుధాకర్ ఇచ్చిన వివరణ. ''ఈ పద్యంలోని వర్ణన చాలవరకు సహజమే. కాని అందు రెండు విశేషణములుగమనింపదగినవి. 'శ్రీ చూర్ణ పుండ్ర భూషిత లలాటుడు'. నయనోపరిప్రాక్తన వ్రణాంకుడు.

నాగమ నాయకుడు శైవుడు. రాయల వైష్ణవుడు. రాయల కొలువులో నున్న కారణమున నాగముడుగాని, తన కుమారుడు గాని వైష్ణవము స్వీకరించరేమో? విశ్వనాథుని నుదురు శ్రీ చూర్ణ పుండ్ర భూషితమైనది అనగా రాయల పక్షము వహించినవాడు. తన కుమారుడు అన్న భావము నాగముని మనసులో కలిగి ఉండవచ్చును. అంతేగాక కను పై భాగమున వెలయు వ్రణాంకము తొల్లి రాజునకు విశ్వనాథుడు అతులిత సేవచేసి ప్రాణాపాయము నుండి అతని తప్పించెనను విషయము స్పష్టము చేయుచున్నది. ఈ రెండు అంశముల సారాంశము విశ్వనాథుని లేఖ ద్వారా నాగమునకు విదితమయ్యెను.''[22]

అదే విధంగా

సోత్ప్రాస స్మిత కాకు పూర్వక మయశ్శూలాయమానమ్ము, భూ
భత్ర్పా గుక్త వచోభిఘాత యెడదన్ హ్రీమూఢమున్ జేయ, ను
ద్యత్ర్పాగుక్త పరాభవనాల శిఖా దగ్ధుండునై నాయ డీ
హత్రృజ్ఞా బల సంయుతూత్తుడయి, యాశాబంధముం బూనుచున్

అనే పద్యానికి ఇచ్చిన వివరణ ''ఇచట 'త్రివర్ణ సంయుక్త ప్రాస' వేయుటలో ఛందో వైదగ్ధమును చూపుకొనుటకు, ప్రకర్షకొరకో ఏ ఉద్దేశ్యమో తెలియదు గాని, తకార, పకార, రకార సంయోగమున మరొక భావము ద్యోతకమవుతున్నది. విశ్వనాథుడు తన యెడదలో

[22]తిరువరంగం సుధాకర్, విశ్వనాథ విజయ కావ్యానుశీలనము, పుట - 41

'తం' డ్రి చేసిన తప్పును దిద్దుట, తద్వారా 'ప'రువు నిలుపుకొనుట 'రా'యలకు తనస్వామి భక్తిని నిరూపించుకొనుటయను మూడభిప్రాయములు త్రివర్ణ ప్రాస రూపమున నిక్షిప్తములని తోచును.''[23]

సూక్ష్మ దృష్టి, సునిశిత పరిశీలనా శక్తి అనేవి పరిశోధకుడికి ఉండవలసిన ముఖ్య లక్షణాలు. ఆ రెండు సుధాకర్ లో మెండుగా ఉన్నాయనడానికి పై రెండు ఉదాహరణలు సాక్ష్యం.

★ ★ ★

[23]తిరువరంగం సుధాకర్, విశ్వనాథ విజయ కావ్యానుశీలనము, పుట - 106

2. సుధాకర కవితా జ్యోత్స్న –ఆధ్యాత్మికాంశాలు

పూజలు చేయడం, స్తోత్రాలు చదవడం, పుణ్య కర్మలు ఆచరించడం, ధ్యానం చేయడం, మంత్రజపం మొదలైనవి ఆధ్యాత్మిక జీవితంలోని భాగాలు. మనసును పరిశుద్ధంగా, బుద్ధిని పరమ పవిత్రంగా చేసుకోవడాన్ని ఆధ్యాత్మికత అంటారు.[24] ఆధ్యాత్మిక జీవితంలో భక్తి ప్రధాన భూమిక వహిస్తుంది. భక్తి అంటే

''పూజా దిష్వను రాగ ఇతి పారాశర్యః''

'పూజల యందు ప్రీతియే భక్తి' అని నారద మహర్షి పేర్కొన్నారు.

''సాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా''

'భగవంతునిపై ప్రగాఢమైన ప్రేమయే భక్తి' అని వ్యాస మహర్షి అన్నారు.

''కథా దిశ్వతి గర్గః''

కథా శ్రవణాన్నే భక్తి అని గర్గ మహర్షి నిర్వచించారు.

2.1 నవ విధ భక్తి సమన్వయం:

సుధాకర కవితాజ్యోత్స్నలోని సాయిశతకం, తోగువేంకటేశ శతకం, సరస్వతీ శతకాలు భక్తి శతకాలు కావున వీటిలో కవి భక్తి పలువిధాలుగా వ్యక్తమయింది. భక్తి తొమ్మిది విధాలని భాగవతం పేర్కొంటుంది.

''శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం, పాదసేవనం
అర్చనం, వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్'' భాగ. 7-5-23

ఈ విధమైన భక్తి భావాలతో కూడిన పద్యాలు సుధాకర్ రచించిన సుధాకర కవితా జ్యోత్స్నలో కన్పిస్తున్నాయి.

2.1.1 శ్రవణ భక్తి:

భగవంతుని పవిత్ర చరిత్రను, గుణ మహిమాదుల్ని వినడమే శ్రవణ భక్తి. 'శ్రవణం నామ చరిత గుణదీనాం శ్రుతిర్భవేత్' అని భక్తి రసామృత సింధువులో చెప్పబడింది.

గీతార్థ ప్రవచనమున
నీతో సరివారెవారు? నిజ మఱసినచో

[24]రాజర్షి శ్రీ రమణానంద స్వామి, శిరిడిసాయి అనుగ్రహ రహస్యం, పుట - 134

నీ తేట మాటలే, నవ

నీ తమ్ముల మూటలగుట నిక్కము సాయీ! (సా.శ – 47)

భగవద్గీత చదివేటప్పుడు అందులోని విషయాలు ఎంత లోతుగా చదివితే అన్ని మంచి విషయాలు బోధపడతాయి. సాయి ఇచ్చే గీతా ప్రవచనం వీనుల విందుగా ఉంటుందని సుధాకర్ ఇందులో తెలిపాడు.

సాయీశుని భక్తులు గురు పారాయణ ప్రియులు. శ్రీ గురు చరిత్ర పారాయణ గ్రంథాన్ని రోజూ పఠించేవారు సాయికి ప్రియ భక్తులు. అందుకే సుధాకర్

ఓ వనమాలీ! నీ దరి

పావనమౌ గురు చరిత్ర పారాయణమున్

సేవన మొనరించినచో

కావగ మా యింట నుందు గాదే సాయి! (సా.శ – 69)

అని వర్ణించాడు. దీనిలో శ్రవణ భక్తి కనిపిస్తుంది.

2.1.2 కీర్తన భక్తి:

'నామ లీలా గుణదీనాం ఉచ్చైర్భాషతు కీర్తనమ్'. భగవంతుని నామాలను, లీలలను, గుణాలను త్రికరణ శుద్ధిగా చేయడమే కీర్తన భక్తి.

మంగళమమ్మ వాణి! మహిమాన్విత ధాతృమనోనుసారిణీ!

మంగళమమ్మ! భక్తజన మంగళదాయిని! సౌఖ్య కారిణీ!

మంగళమమ్మ! సంతత సమద్ధి విజాత సమేత ముత్తమా

తంగ సయాన మంగళము ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 9)

ఇందులో కీర్తన భక్తి ఉంది. అదే విధంగా సాయిశతకం లోని 25,31,32,90,97,104 సంఖ్యగల పద్యాలు, తోగు వేంకటేశ శతకంలోని 6,33,39,91 సంఖ్యగల పద్యాలు నామసంకీర్తనకు సంబంధించినవే.

2.1.3 స్మరణ భక్తి:

శ్రవణం, కీర్తనం తర్వాత నామస్మరణం ముఖ్యమైనది. భగవంతుని నామ రూపాలను పదే పదే మననం చేయడమే స్మరణ భక్తి.

ఏ లీలను గుర్తింతుము

నీ లీలను? వేదవేద్య! నిన్నుతియింపన్

ఈ లీల, నేరనట్లే

కాలూపుచు గూరుచుంటె? కమ్మగ సాయీ! (సా.శ – 9)

ఈ పద్యం ఒక భావ చిత్రం వలె భాసిస్తుంది. వేదార్థ సారం కొందరికే తెలుస్తుంది. వేదవేద్య సంబోధన సాభిప్రాయం. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యోవేదాన్తకృద్వేద విదేవ చాహమ్'[25] అనే శ్లోకంలో వేదవేద్యుడని చెప్పుకున్నాడు.

నెత్తిన కుఫ్నీ ధారణ,

మొత్తము మేన్గప్పునట్టి ముద్దంగరఖా

చిత్తమ్ము పరాయత్తము

పుత్తడి నీ మేని సొబగు, భోలా సాయీ! (సా.శ – 25)

అంటూ సాయీశుని దివ్య స్వరూపాన్ని దర్శింపచేశాడు. సుధాకర్ సాయిశతకంలో నామస్మరణ కంటే రూపస్మరణ పద్యాలే ఎక్కువగా ఉన్నాయి. తద్వారా ఈ శతకం ఒక కథాత్మక శతకంగా భాసిస్తుంది.

2.1.4 పాదసేవన భక్తి:

భగవంతుని పాదాలను సేవించడమే పాదసేవనం. ఇది దాస్య భక్తికి దగ్గరగా ఉంటుంది. మానవుని యొక్క ఉత్తమ అంగం శీర్షం. భక్తునికి పరమేశ్వరుని యొక్క పాదమే ఉత్తమ అంగం.

శ్రీపాద శ్రీ వల్లభ!

పాపాలను బాపి నన్ను పాలింపవయా,

నీ పాదమ్ముల నమ్మితి

నా పాలిటి దైవ మీవె, నమ్ముము సాయీ! (సా.శ – 4)

అని సుధాకర్ శ్రీ సాయీశుని పాదాలను ఆశ్రయించాడు. ఇంకా వినమ్రుడై

నా మది నీ పద పీఠిక

నా మనమున సాగు నీదు నామజపంబున్

---

[25]పురుషోత్తమ ప్రాప్తి యోగము 15వ శ్లోకం, భగవద్గీత

''సామజ వరగమనా!'' నా

సామివి నీ వంచు నెంతు సతతము సాయీ! (సా.శ – 30)

అంటూ తన మనస్సునే సాయి పద పీఠిక లాగా ఉదాత్త భావన చేశాడు. అలాగే 'సాయీశుని పదపంకజ చింతన ఆపదలను పారదోలి ఆనందమిస్తుందని, పాపాలను పరిహరిస్తుందని, శాపాలను పోగొడుతుంద'[26]ని పేర్కొన్నాడు.

సరస్వతీ శతకంలో

చదువుల తల్లి! నిన్నెపుడు సాగిలి మ్రొక్కితి నన్నుగావు మే
పదముల గోర నీదు పదపద్మములన్మది నిల్పుకొందు స
త్పదముల నిల్పుమమ్మ నను తావక సేవక సేవకుండ న
య్యెద నెదలోన నిన్మరువ కెప్పుడు దల్చెదన్! సరస్వతీ! (సర – 18)

అనే పద్యంలో సరస్వతి పాదాలను మదిలో నిల్పుకుంటానని తెలియచేశాడు.

2.1.5 అర్చన భక్తి:

భగవంతుని షోడశోపచార విధుల చేత పూజించడాన్ని అర్చన అంటారు. అర్చన అంటే పూజ. 'పూజాదిష్వనురాగ ఇతి పారశర్యః' అని నారద భక్తి సూత్రం.

జనులందరు సుఖమందం
జనునటులం జేయవయ్య, శమదమ గుణరం
జను, జనరంజను, నీ పూ
జను మఱవక సేతు మఖిల సన్నుత సాయీ! (సా.శ – 82)

సాయీశుడు శమదమాలు గలవాడు. శమం అంటే మనసును బహిర్ముఖం కానివ్వకుండా నిగ్రహించడం, దమం అంటే ఇంద్రియనిగ్రహం కలిగి ఉండటం, జనులంతా సుఖంగా ఉంటే సాయి పూజను మరువకుండా చేస్తానని విన్నవించుకున్నాడు. ఇందులో

---

[26] నీ పద పంకజ చింతన
యాపదలం బారద్రోలి యానందమిడున్
పాపముల నెల్ల ద్రుంచును
శాపంబుల బాపు శేష శాయీ! సాయీ!

అర్చన భక్తి ఉంది. 'శమదమ గుణరంజను' అనే విశేషణ ప్రయోగం ద్వారా మానవులకు కూడా శమదమాలను ప్రసాదించుమనే విన్నపం ఉంది.

2.1.6 దాస్యభక్తి:

'దంసవతే స్వామి కార్యాణి సావధానేన ఇతివాసః'. స్వామి కార్యాన్ని సావధానంగా చూసేవాడు దాసుడు. సుధాకర్ సాయికి, సాయి భక్తులకు, శిరిడీ పురికి దాసుడనని చెప్పుకున్నాడు.

దాసుడ నీ శిష్యులకుం,
దాసుడ నీ భక్తులకును, దండము నీకున్
దాసుడ నీ పాదములకు
దాసుడ శిరిడీ పురికిని దయగల సాయీ! (సా.శ – 94)

ఈ పద్యంలోనే వందన భక్తి కూడా ఉంది. పేరుకు భక్తుల దాసుడనని అనడమే కాదు, భక్తుల స్తుతి గావించాడు సుధాకర్. సాయిశతకంలో సాయి భక్తులైన దాసగణు, తాత్యా, మహల్సాపతి మొదలైన భక్తుల స్మరణ, తోగు వేంకటేశ శతకంలో దిలీపుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, ద్రౌపది, కుచేలుడు, త్యాగరాజు, కంచర్ల గోపన్న, ఘంటసాల మొదలైన భక్తుల స్మరణ గావించాడు.

ఉదాహరణ:

రాగజలధులు మధియించి త్యాగరాజు
రామనామామృతము దీసి రాణకెక్కె
అమ్మహాత్ముని పదధూళి నాశ్రయింతు (తోగు – 46)

2.1.7 వందన భక్తి:

భగవంతునికి నమస్కారం చేయడం వందన భక్తి. భక్తి రీతుల్లో ఇది చాలా సులభమైనది. 'నమ' అంటే అహంకారం లేదని అర్థం. నేను చేస్తున్నాననే అహంకారం లేకుండా, అంతా భగవంతునిదేనని చెప్పడం ఇందులో ఉంది.

ప్రణతి సేసెద నిన్ సదా పద్మ నయన!
భారమా నీకు పాలింప భక్త జనుల
వనధిజాజాని! యో శ్రీనివాస! దేవ! (తోగు – 98)

ఇందులో వందన భక్తి కనిపిస్తుంది.

2.1.8 సఖ్య భక్తి:

భగవంతుడు తన ప్రియ స్నేహితుడనే భావంతో సలిపే భక్తి సఖ్య భక్తి. ఈ భక్తికి ఉదాహరణగా అర్జునుడు, కుచేలుడు, గోపికలను చెప్పుకోవచ్చు. సుధాకర్ వెంకటేశ్వరుని ఒక మిత్రునిగా భావించి, పూజించి తన భక్తిని ప్రకటించాడు.

నిఖిల జగములు నీలోన నిండియుండె
నిండియుంటివి వానిలో నీవుగూడ
నీకసాధ్యము లేదురా నీరజాక్ష! (తోగు – 19)

2.1.9 ఆత్మనివేదన భక్తి:

భక్తుడు తనదేహం, మనస్సులనే గాక అంతరాత్మను కూడా భగవత్ కైంకర్యం చేయడమే ఆత్మనివేదనం. పతంజలి మహర్షి మొదలైనవారు ఆత్మనివేదనం భక్తిమార్గాలలో ముఖ్యమైనదని ప్రకటించారు.

వేయి కన్నులవాడవు వేరె తెలుప
నవసరము లేదు నీకు, నా యంతరాత్మ
వీవగావున, శరణంటి గావవేల? (తోగు – 28)

ఇందులో కవి తన అంతరాత్మను భగవత్ కైంకర్యం చేశాడు.

అదే విధంగా సాయి శతకం, తోగు వేంకటేశ శతకాలలో 'అయ్య' అనే సంబోధన పలుమార్లు ప్రయోగించి ఆ స్వాములిద్దరిపై గల అనన్య భక్తిని ప్రకటించుకున్నాడు సుధాకర్.

2.2 యోగశాస్త్ర విషయాలు:

'సాయి బాబా యోగి, యోగులకే యోగి, గురువులకే గురువు. పరమ గురువు' అని బాబా ప్రియశిష్యుడు శ్రీరమణానంద స్వామి 'శిరిడిసాయి అనుగ్రహరహస్యం'లో ప్రస్తావించారు. సాయిబాబా నీటితో దీపాలు వెలిగించినవాడు, కడుపులోని పేగులను బయటికి తీసి కడిగినవాడు. ఇటువంటి పనులు యోగులకే సాధ్యం.

సాయిశతకంలో సాయికి తెలిసిన ఖండయోగ ప్రక్రియను గురించి సుధాకర్ వర్ణించాడు.

తల, మొండెము, కాళ్ళేతులు
నిలముక్కలు ముక్కలగుచు నెల్లంగడలన్
గలిగుంట ఖండయోగము
లలితాత్మా! నీ కదెట్టు లబ్బెను సాయీ! (సా.శ – 26)

శరీరంలోని తల, మొండెము, కాళ్ళు, చేతులు ఏ భాగానికాభాగం విడదీసి ఉంచడం ఖండయోగం. తర్వాత ఆయాభాగాలను అమర్చుకొని సాధారణ దేహంలాగా భాసించేవాడు సాయి. సాయి శతకంలోని మిగతా పద్యాలతో పోల్చితే, ఈ పద్యంలో కవి పదగత గణాలు వాడకుండా భావాభివ్యక్తికి తగినట్లు శిల్పాన్ని ప్రదర్శించాడు.

నిను బొగడగ నా తరమా
ననుగను గడకంట, మధుర నాదవినోదీ!
నిను గాక గతిని గానను
జననుత గుణగణ విశాల! సాధో! సాయీ! (సా.శ – 35)

ఈ పద్యంలో 'మధుర నాదవినోదీ' అనే సంబోధన విశేషమైంది. సాయి నాదయోగి. అరిస్టాటిల్, వేమనలు కూడా నాదయోగులని ప్రతీతి. ''యోగంలో నాదోపాసనకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. ఈ ఉపాసన చేసేవాళ్ళను నాదయోగులంటారు. నవనాథులు, షిర్డీ సాయినాథ్ మొదలైన వాళ్ళంతా నాదయోగులే. నాదం వింటూ సాధన చేయడమే నాదయోగం. ఈ నాదం కుండలినీ శక్తి ఉద్భవించడానికి ముందు – అది జాగృతమౌతున్నదనడానికి సంకేతంగా వెలువడుతుంది. 'శక్తి (ప్రాణం) ఉన్నచోటనే నాదం ఉంటుంద'ని అఘోరి విమలానంద గారు వెల్లడించారు. శరీరంలోని రక్త ప్రసరణ యొక్క శబ్దమే నాదం.''[27]

'' 'సదాశివోక్తాని సపాదలక్షయావధానాని వసంతి లోకే నాదాను సంధాన సమాధిమేకం మన్యమహో మన్యతమం లయానాం' శివప్రోక్తమైన లయావధానాలు లోకంలో లక్షాఇరవై ఐదువేలున్నాయి. నాదానుసంధాన సమాధిని (నాదాన్ని అనుసరించడం వల్ల ఏర్పడే సమాధిని) ఒక దాన్ని లయవిధుల్లో శ్రేష్ఠమైందిగా

[27] మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త (శివయోగి), బ్రహ్మవిద్య, పుట – 112

గ్రహిస్తున్నామని ఆది శంకరాచార్యుల వారు తన 'యోగ తారావళి' లో పేర్కొన్నారు. నాదంతో సమానమైన లయవిధి లేదని హఠయోగ ప్రదీపిక వెల్లడిస్తున్నది.''[28]

కాయమనిత్యం బనునది
ఖాయము షట్చాత్రవుల నికాయముగానన్
గాయపడి యున్నదిది, యన
ఘా! యమతిన్ నన్ను గావ గదవే సాయీ! (సా.శ – 43)

ఇది ఒకరకమైన ఆత్మసంయమయోగము. మనోనిగ్రహ ప్రధానమైంది. దేహంలోని ఆ ఆరుగురు రాజులు 'మదము, క్రోధము, లోభము, మత్సరము, కామము, మోహములు' అని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారు 'కాళికాంబా సప్తశతి' లో పేర్కొన్నారు.

ఆత్మసీమనేలు నార్గురు రాజులు
మదము, క్రోధ, లోభ, మత్సరములు
కామమోహములను ఘనులు దుర్జయులయా!
కాళికాంబ వీర కాళికాంబ[29]

2.3 గీతోక్తులు – చాయోక్తులు:

''ఎటువంటి దుఃఖాల మధ్యనైనా సరే ఒక్కసారి చదివితే చాలు చిరునవ్వులను చిగురింపచేసే దివ్యగ్రంథమే గీత. అనేక కష్టాలనుంచీ, సమస్యలనుంచీ ఈ భగవద్గీతే నన్ను ఉద్ధరించింది''[30] అని మహాత్మాగాంధి పేర్కొన్నారు.

మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినేదినే!
సకృద్గీతాంభసి స్నానం సంసార మలనాశనమ్!!

'జలస్నానం వలన శరీర మాలిన్యం తొలగినట్లే గీతా పారాయణమనే స్నానం వలన మనో మాలిన్యాలు నశించి పోతాయ'[31]ని మహాభారతం పేర్కొంది.

---

[28]మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త (శివయోగి), బ్రహ్మవిద్య, పుట – 113

[29]పోతులూరి వీరబ్రహ్మం, కాళికాంబా సప్తశతి, పుట (?)

[30]భగవద్గీత, పుట - 17

[31]భగవద్గీత, పుట - 17

గీతోక్తులకు ఛాయోక్తులనదగిన పద్యాలు 'సుధాకర కవితా జ్యోత్స్న'లో ఉన్నాయని ఆచార్య శలాక రఘునాథ శర్మ గారు పేర్కొన్నారు.

సూర్య చంద్రుల నేత్రాల జాతువీవు

కల్లనిజముల జక్కగా గాంచగలవు

శర్మమును ప్రసాదించుమా! కర్మసాక్షి! (తోగు – 8)

ఈ పద్యంలో మొదటి పాదం గీతకు సంబంధించిందే. గీతలో

''అనాది మధ్యాన్త మనన్త వీర్యం

అనన్త బాహుం శశిసూర్యనేత్రమ్''[32]

అని ప్రస్తావించబడింది. సూర్యచంద్రులు కనిపించే ప్రత్యక్ష దైవాలు. పరమాత్మకు నేత్రద్వయం. జీవుల నిత్యవ్యవహారాలు చూసేవాడు కాబట్టి 'కర్మసాక్షి' అనే విశేషణం చక్కగా కుదిరింది ఈ పద్యంలో. అలాగే

'నిఖిల జగములు నీలోన నిండియుండె' (తోగు – 19)

అనేది 'వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః'[33] అనే గీతోక్తికి ఛాయోక్తి.

సర్వధర్మములను వీడి శరణువేడు

దాసులను పాలనము సేయుదైవమీవు

మాట దప్పితివో లేక మఱచినావొ (తోగు – 78)

గీతలో శ్రీకృష్ణుడు

''సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః''[34]

అన్ని ధర్మాలను వదిలేసి నన్నొక్కన్నే శరణువేడు అని పేర్కొన్నాడు.

''పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్!

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!!''[35]

---

[32]విశ్వరూప సందర్శనం 19వ శ్లోకం, భగవద్గీత. పుట - 177

[33]విశ్వరూప సందర్శనం 20వ శ్లోకం, భగవద్గీత. పుట - 177

[34]మోక్ష సన్యాస యోగం 66వ శ్లోకం, భగవద్గీత, పుట - 251

[35]జ్ఞానయోగం 8వ శ్లోకం, భగవద్గీత, పుట - 103

అనే జ్ఞానయోగంలోని శ్లోకానికి

సజ్జన త్రాణమును, దుష్టసంహరణము
ధర్మ సంస్థాపనము సేయ ధరణిలోన
అవతరింతువు యుగయుగమందు నీవు (తోగు – 80)

అనే పద్యం వ్యాఖ్యానప్రాయం.

2.4 అధిక్షేపం:

సాయి శతకంలో అధిక్షేపం కనిపించదు. కానీ తోగు వేంకటేశ శతకంలో అధిక్షేప పద్యాలున్నాయి. సాయీశుని లీలలకు, శ్రీ మహా విష్ణువు అవతార లీలలకు ఆంతర్య భేదాలుండటమే ఇందుకు కారణం.

పరమ పావని జానకి పడిన పాట్లు
పంచ పాండవులిలలోన బడ్డపాట్లు
నిన్ను నమ్ముట చేతనా? సన్ను తాంగ (తోగు – 5)

'నిన్ను నమ్మిన సీతను, పాండవులను ఎన్నో కష్టాలకు గురిచేశావు. ఏమిటి నీ గొప్పతనం?' అని సున్నితమైన అధిక్షేపం ఉంది ఈ పద్యంలో. ఆ విషయానికి వస్తే సీతతో పాటు రాముడు, పాండవులతో పాటు కృష్ణుడు ఎన్నో కష్టాలను అనుభవించారు. ఎంత గొప్పవాడివి 'వారి కోసం నువ్వూ (సీతకోసం రాముడు, పాండవుల కోసం కృష్ణుడు) కష్టాలను అనుభవించావు గదా తోగు వేంకటేశా' అని వ్యాజస్తుతి ఉంది ఈ పద్యంలో.

ఆ కుచేలుడు పండిచ్చె నీకు తొల్లి
ఆతని కోరిక పండింపనయ్యె జాగు
నీ దరికి రానిచో నట్లె నీల్గవలెనొ (తోగు – 71)

అంటూ దైవాన్ని పైకి వ్యంగ్యంగా దూషించినా 'ఏదీ నీ దరికి స్వయంగా రాదు, శోధించి సాధించాలి' అనే సూక్తిని పరోక్షంగా భగవంతుని లీల ఆధారంగా తెలియచేశాడు సుధాకర్. ఇంకా

లేని వారల కే మీయ లేనినాడు
కలత పడువారి కేమియు గానినాడు
పుక్కిటివె నీ పురాణముల్ పుణ్య చరిత (తోగు – 29)

వంటి అధిక్షేప పద్యాలు తోగు వేంకటేశ శతకంలో ఉన్నాయి.

'రమ్యభావ తరంగాలు'లో 'భగవంతుడున్నాడు' అనే ఖండికలో భగవంతునిపై అధిక్షేపం ఉంది.

భగవంతుడులేని చోటు లేదు
వాడు మార్చని ప్లేటు లేదు
మందిని ముంచిపెంచిన బొజ్జల్లో
సినీ తారల కాలి గజ్జల్లో
బస్ కండక్టర్లలో – బలిసిన డాక్టర్లలో
సూపర్ బజార్లలో – చుక్క గుర్తు బార్లలో
కల్లు కుండల్లో – మానంలేని ముండల్లో
రాజకీయ నాయకుల మేళ్ళ దండల్లో
... ... (రమ్య – పుట 42)

ఈ అధిక్షేపం ఆయా వృత్తులు చేస్తూ అన్యాయంగా అక్రమార్జన చేసే వాళ్ళకు సంబంధించింది. సాధారణంగా దేవుడు సాయపడే గుణం కలవాడే దయాగుణం లేనివాడు రాక్షసుడు అవుతాడు. 'వైద్యో నారాయణో హరిః' అన్నది శాస్త్ర వచనం. అలా హరితో పోల్చబడిన వైద్యులే దోపిడీ చేయడం ఈ సమాజంలో నిత్యం కన్పిస్తారు. అలా మిగిలిన వృత్తుల వారందరూ దోపిడీకి పాల్పడుతున్నారు. శ్రీకృష్ణుడు గీతలో

''ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి''[36]

సమస్త భూతముల హృదయాలలో పరమాత్మ నివసిస్తున్నాడని అర్జునుడికి బోధించాడు. అలా అందరిలోనూ దేవుడు ఉండే ఈ సమాజం ఇలా దుష్టగుణాలతో ఎందుకుంటుంది? అనేది ఇందులోని అధిక్షేపం.

★ ★ ★

[36] మోక్ష సన్యాస యోగం 61వ శ్లోకం, భగవద్గీత, పుట - 248

3. సుధాకర కవితా జ్యోత్స్న – సామాజికాంశాలు

కవికి, సమాజానికి విడదీయరాని సంబంధముంటుంది. సమాజంలోని సమకాలీనాంశాలను కవి తన కవిత్వం ద్వారా వెల్లడించే ప్రయత్నం చేస్తాడు. పురాణ పాత్ర తీసుకున్నా, ప్రబంధ పాత్ర తీసుకున్నా కవి తత్కాల సమాజాన్ని తన కావ్యంలో ప్రతిబింబింప చేస్తాడు. సమకాలీన స్పృహతోపాటు సామాజిక స్పృహను కలిగిన కావ్యాలు, రచనలు జనాదరణకు నోచుకుంటాయి.

3.1 శ్రీ సాయీశ శతకం:

'సాహిత్యం సమాజానికి దర్పణమే' అన్నది ఆర్యోక్తి. సాహిత్యంలో దార్శనికత కూడా ఎంతో కొంత ఉంటుంది. సాహిత్యంలో ఎన్నో విషయాలను, మంచి చెడులను, కష్ట సుఖాలను దర్శించవచ్చు. కాల చక్ర పరిభ్రమణంలో ధర్మాన్ని కాపాడవలసిన మానవుడు దారి తప్పినప్పుడు సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు శతక వాఙ్మయం దోహదపడింది. శతకం సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో జాతీయాలతో, సామెతలతో వ్యావహారిక భాషాశైలిలో బహుళ ప్రచారం పొందింది.[37] భక్తి శతకాలలో నైతిక విలువలు, సామాజిక విలువలు అంతర్వాహినిగా ప్రవహిస్తుంటాయి.

సాధారణంగా భక్తి శతకాలలో ఆత్మనివేదనం, భగవంతుని గుణలీలావర్ణనలు, ఆర్తజన రక్షణకై అర్థింపు ఉంటాయి. ఇందులో ఆర్తజన రక్షణకై అర్థింపులాంటివి సమాజానికి సంబంధించినవి. సాయిశతకంలోని

కులమత భేదమ్ములతో
మలినమ్మయి పోయె నీ సమాజము, నీవే
దలచినచో నీ రుగ్మత
దొలగింపగలవు తురము దొడగుము సాయీ! (సా.శ.–81)

ప్రస్తుత సమాజంలో కులమత భేదాలు ఎక్కువయ్యాయి. పూర్వకాలంలో నిరక్ష్యరాస్యులు మాత్రమే కులాల పట్ల పట్టింపులు కలిగి ఉండే వారు. కానీ ఇప్పుడు

---

[37]యన్.వి.యన్. చారి, 'సర్వేశ్వర శతకం – ఒక పరిశీలన' శతక సాహిత్యం – నైతిక సామాజిక విలువలు

అక్షరాస్యులు సైతం ఎదుటి వ్యక్తి కులమతాలను తెలుసుకున్నాకే సఖ్యంగా ఉంటున్నారు. ఇది సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మత.

చదువుకొను పిల్లలందరు
కుదురుల కృషి సల్పి, లబ్ధిగొను కోరికతో
మొదలు కొనునట్లు వారల
యెదలో గదలాడవయ్య యెప్పుడు సాయీ! (సా.శ. – 84)

విద్యార్థులు బాగా చదవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుకుంటారు. ఇక్కడ 'కుదురుగ' అనే క్రియ పరిశీలిస్తే, 'ఏదో చదువుతున్నాంలే!' అన్నట్లు కాకుండా ఏకాగ్రతతో చదవాలని సుధాకర్ ఆకాంక్ష. 'లబ్ధిగొను కోరిక' అనేది 'చదివే చదువు జీవితానికి ఉపయోగపడే విధంగా ఉండాలి' అనే విషయాన్ని తెలియచేస్తుంది.

విధినిర్వహించు వారల
నధికముగా నాదరింప నభ్యర్థింతున్
విధమెరిగిన వారల, నిర
వధికముగా రక్షసేయ వలయును సాయీ! (సా.శ. – 85)

ప్రతి ఒక్కరు వృత్తిలో తమ పని తాము పూర్తి చేయాలని సుధాకర్ ఆకాంక్ష. కొంతమంది ఉద్యోగులు తమ పనిని తాము పూర్తి చేద్దామన్నా– చేయనీయరు కొందరు సహోద్యోగులు. ఇతరుల వృత్తికి ఆటంకాలు తేవద్దని అంటాడు సుధాకర్.

ప్రస్తుత సమాజంలో మరొక సమస్య పేదరికం. అందుకే సుధాకర్ 'లేమిని తొలగ చేసి, లోకులకు భోగాలు ప్రసాదించుమ'[38]ని సాయీశుని స్తుతించాడు.

కలవారు లేనివారని
గలవిలలో రెండు తెగలు గాట్లాడుటకున్

[38]లేమిని దొలగం జేయుచు
భూమిని లోకులకు సెల్లభోగము లిమ్మా!
సామివి నీవే, మా పో
రామిని దూరంబు సేయ రావే సాయీ! – సాయి శతకం - 89

గలతలతో నిండిన యీ

కలికాలము చక్కదిద్ద గడగుము సాయీ! (సా.శ. – 95)

జీవితమంటేనే కలతలతో నిండినటువంటింది. 'కాళ్ళు తడవకుండా సముద్రాన్నైనా ఈదవచ్చు, కానీ కళ్ళు తడవకుండా సంసారాన్ని దాటలేం' అన్నాడొక కవి. ఈ లోకంలో ఉన్నవారు, లేనివారు ఉన్నారు. వీరి మధ్యే పోరాటం. ఉన్నవాడు లేనివాన్ని తక్కువ చూపు చూస్తాడు. ఉన్నవాడి ధనసాయం లేకుండా లేనివాడు తన బతుకు తాను బతకలేడు. లేనివాడి పరిశ్రమ లేకుండా ఉన్నవాడు మరింత ఉన్నతుడు కాలేడు. ఇద్దరి మధ్య సమన్వయం లేకపోవడమే అన్ని అనర్థాలకు మూలం.

నీతికి కాలము గాదిది

కోతికి చిక్కినటువంటి కొబ్బరి కాయన్

భాతినయె రాజకీయము

జాతిని నడుగంటినది నిజాయితి సాయీ! (సా.శ. – 117)

ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. నేటి సమాజంలో నిజాయితికి విలువ లేదు. కోతికి చిక్కిన కొబ్బరికాయ ఎవరికీ ఇవ్వదు. కొబ్బరికాయ – ప్రసాదం కదా! ప్రసాదం పది మందికి పంచిపెట్టాలంటారు, కాని కోతి అలా చేయదు. అలాగే కొందరు రాజకీయ నాయకులు ప్రజలకు వచ్చిన నిధులు ప్రజలకు పంచకుండా దోచుకుంటున్నారు. కేవలం తమ స్వప్రయోజనాల కొరకే రాజకీయాన్ని వాడుకునే నాయకులెందరో ఉన్నారిప్పుడు.

ఈ శతకం జదివిన సా

యీశుని దయ వలన నెల్ల యిక్కటులెడరున్

పాశవికత్వము దొలగు, స

దాశయ సిద్ధియును గల్గు, ధర్మము గెలుచున్ (సా.శ. – 138)

ఈ విధంగా పాశవికత్వము తొలగాలని, సదాశయ సిద్ధి కలగాలని, ధర్మము గెలవాలని కవి కోరుకోవడంలో సామాజిక స్పృహ ఇమిడి ఉంది.

3.2 శ్రీతోగు వేంకటేశ శతకము:

ఈ శతకంలో సుధాకర్ కుల వివక్ష ఉండరాదని కులం కంటే గుణమే ప్రధానమని తెలియచేశాడు.

నిక్కమైనట్టి భక్తితో నిన్ను గొలుచు
మాలదాసరి సరియైన మానవుండు
కులము కన్నను మిన్న సద్గుణము లెన్న (తోగు – 73)

'శునిచైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః' అన్న భగవద్వాక్యానికి వ్యాఖ్యానప్రాయమైనది ఈ వాక్యం.

గుణాః సర్వత్ర పూజ్యంతే
పితృవంశీ నిరర్ధకః
వాసుదేవం సమస్యన్తి
వసుదేవం నమానవాః

ఎక్కడైనా, ఎప్పుడైనా ఉత్తమ గుణాలు మాత్రమే పూజలందుకుంటాయి. కులంగానీ, వంశంగానీ కాదు. మానవులంతా వాసుదేవుడిని (కృష్ణుడిని) పూజిస్తారు తప్ప వసుదేవున్ని (కృష్ణుడి తండ్రిని) కాదు కదా!

మానవత్వము లేనట్టి మతము లేల?
కుత్సితమ్మున కుళ్ళిన కులములేల?
జాతి భేదము గల నరజన్మమేల? (తోగు – 74)

అంటూ కులమత భేదాలుండరాదని తెలియచేశాడు సుధాకర్.

ఈశుడే విచారింపగా నేసుడయ్యె
కృష్ణుడే క్రీస్తురూపమై క్షితిజనించె
'అల్ల'యన విష్ణు రూపమౌ ఆదిశక్తి (తోగు – 82)

అంటూ భగవంతుడొక్కడేనన్న విషయాన్ని మరోమారు గుర్తు చేశాడు. ఇందులో సర్వమత సమతాభావన ప్రస్ఫుటమవుతుంది.

మతము లెన్నైన గానిందు మనుజులొకటె
కులము లెన్నైన వారల గుణములొకటె
రకము లెన్నైన గానిమ్ము రక్తమొకటె (తోగు – 84)

అంటూ కులమత భేదాలుండ రాదని మనసారా కోరుకున్నాడు.

3.3 సరస్వతీ శతకం:

రాసభమట్టులం బెరిగి రాలను గొట్టిన చావు లేక నన్
గోసలు బెట్టc బుట్టితిని కూడును దండుగటంచు తల్లలే
దోసము లేని మమ్ములను దూషణ సేయుచు నున్నవారు నీ
దాసుల యొక్క గోస యిది ధాతృసతీ! సుదతీ! సరస్వతీ!(సర – 10)

నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమకు నచ్చిన చదువులు వారి పిల్లలు చదవాలని ఆరాటపడుతున్నారు తప్ప పిల్లలు ఇష్టపడి కాదు. చదువును ఇష్టపడి కాకుండా, కష్టపడి చదవడం, తత్ఫలితంగా తెలివి కలిగిన వారైనా తక్కువ మార్కులు పొంది, తల్లిదండ్రుల నుండి ఛీత్కారాలను ఎదుర్కొంటున్నారు. అలాంటి విద్యార్థుల మనసులోని మాటలు పై పద్యంలో కవి ముఖతః వెలువడ్డాయి.

చదివిన వారికెల్లరకు సౌఖ్యము సేకురునట్లు సేయగన్
పదవులనున్న నాయకులు పాటువడం దగునట్లు గానిచో
చెదరును వారి బుద్ధి మరి చేటగు లోకుల కెల్లనయ్యెడన్
మదము గలట్టి పాలకులు మాడెద రెట్లయినస్సరస్వతీ (సర – 23)

'నానృషికురుతే కావ్యమ్' అని ఆర్యోక్తి. ఋషిత్వమున్నవాడే కావ్యాన్ని రాయగలడు. అంటే భవిష్యత్తును దర్శించేవాడు. ఈ పద్యం రాసిన కాలం (1970) లో నిరుద్యోగుల సంఖ్య చాలా తక్కువ. ఇప్పటి రాజకీయ పరిస్థితులకు ఈ పద్యం చక్కగా వర్తిస్తుంది. డిగ్రీ పట్టాలు చేతబట్టుకొని ఉద్యోగం కోసం ఎందరో విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. దీనికంతటికీ పదవిలో వున్న నాయకుల నిర్లక్ష్యధోరణి కారణం. 'ఇదిగో పులి, అదిగో తోక' అన్న చందంగా ఇప్పుడిస్తాం, అప్పుడిస్తాం అంటూ కాలయాపన చేస్తారు. కాని నోటిఫికేషన్లు జారీ చేయరు. కొందరు ప్రబుద్ధులు లంచాలు తీసుకుని అర్హత లేనివాళ్ళకు ఉద్యోగాలు ఇస్తారు. ఈ పద్యంలో ఇంకో అర్థముంది. తమ కింది స్థాయి వారి ప్రయోగాలు వెలుగు చూడకుండా పై స్థాయివారు అసూయతో అడ్డు తగులుతారు. అందుకే ఎందరో మేధావులు ఇతర దేశాలకు వలస వెళ్ళి, అక్కడ తమ సత్తా చాటుకుంటున్నారు. ఈ పద్యంలో మొదటి మూడు పాదాలు వాస్తవికతా వాదా(రియలిజమ్)నికి చెందినవి

కాగా, నాలుగోపాదం 'మదము గలట్టి పాలకులు మాడెదరెట్లయినన్' అనేది డాడాయిజం ప్రభావం కలది.

బడులకు రాజకీయములు బ్రాకగ వీచె నపాన వాయువుల్
బడుగుల నాసికావళుల బారిన వారికవే సువాసనల్
పడిసెము బట్టె పాటుపడు వారికి, నిట్టి నికృష్ట దుస్థితిన్
జడిసిన వారలేమొ దిగజారుదు రెట్లయినన్ సరస్వతీ! (సర – 24)

ఈ పద్యంలో విద్యారంగ సంస్థలపై రాజకీయ ప్రభావం కనిపిస్తుంది. ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరించడం వల్ల ఇంగ్లీషులో విద్యాబోధన ఒక గొప్ప హోదాగా భావింపబడుతుంది. పేదవారు కూడా ఆంగ్లభాషా వ్యామోహంతో తమ పిల్లలను ఇంగ్లీషు కాన్వెంటులలో చేర్పిస్తున్నారు. దీనికి కారణం ఉద్యోగం కోసమే చదువు అనే భ్రమ అందరిలో నెలకొనడం, విద్యార్థుల భవిష్యత్తు కూడా ఆంగ్లభాషపై ఆధారపడటం. గొప్ప కోసం కాన్వెంటులో చేర్పించిన తల్లిదండ్రుల ఫీజుల విషయంలో తంటాలు పడతారు. అదే విధంగా విద్యార్థులు మాతృభాషలో విద్యాబోధన ఉండదు కాబట్టి చదివే చదువు అర్థం కాక నెత్తిగోక్కుంటారు. ఈ విషయాన్ని 'పడిశము బట్టె పాటుపడు వారికి' అనేది తెలియచేస్తుంది.

నేతలిలన్ స్వబంధువులనేకుల వృద్ధికి దెచ్చునట్టు లా
ధాతయు దేశ దుర్దిన విధాతల నేతల జేయుచుండు, నీ
వూతయి కొందరిన్ కవుల నూరక జేసితి కాళిదాసు నీ
తాతకు చుట్టమేమొ మరి ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 30)

పూర్వకాలంలో రాజుల కుమారులే చక్రవర్తులై రాజ్యాన్ని పాలించేవారు. అదేవిధంగా ఇప్పటి నేతల కొడుకులకే ఆయా రాజకీయ పార్టీలలో టిక్కెట్లు ఇవ్వడం వల్ల వారు కూడా నాయకులు అవుతున్నారు. కాలంలో మార్పు వచ్చినా సమాజంలో మార్పు మాత్రం రావట్లేదు. 'తలుకు బెలుకు రాలు తట్టెడేల' అన్నట్లు ఎక్కువ తక్కువ మంది కవులెందుకు కాళిదాసు లాంటి కవి ఒక్కడు చాలు. అలాగే 'దేశాభివృద్ధికి పాటుపడని నాయకులెందరున్నా ఒక మంచి నాయకునికి సాటి రారు' అని దృష్టాంత పూర్వకంగా ఈ పద్యం చెప్పాడు సుధాకర్.

కలియుగమందు మానవులు కల్మికై గౌరవమిచ్చుచుండి రం
చలిగితివేమొ గాని మనసా నినె దల్చుచునుండి రందరున్
కలిమికి నిన్విన బలిమి కల్గుట గాంచగరారె వారిలా
తలమున నెంత వారయిన ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 26)

చదువుల తల్లి సరస్వతి, ధనానికి అధిపతి లక్ష్మీదేవి. సరస్వతి, లక్ష్మీదేవిలను ప్రతీకలుగా తీసుకుని చెప్పబడింది ఈ పద్యం. 'ఎంత ధనవంతులైనను విద్య లేని వారు శోభించరు' అనే జీవిత సత్యం ఇందులో ఉదాహృతం.

3.4 రమ్య భావ తరంగాలు:

రమ్యభావ తరంగాలలో కూడా సుధాకర్ కున్న సామాజిక స్పృహ చక్కగా దర్శనమిస్తుంది. దీనిలోని దాదాపు అన్ని ఖండికలు నేటి సామాజిక స్థితిగతులకు అద్దం పట్టేవే.

రామప్ప శిల్పాలు, ఉగాది, దీపావళి, సంక్రాంతి, సారాయి, మనోవేదన, ప్రియురాలు, కూలివాడు, నేటి విద్యాస్థాయి, నేటి విద్యావిధానం, భగవంతుడు, సగటు మనిషి మొదలైనవన్నీ వీరి కవితా వస్తువులు.

ఉగాది గురించి రాసినా, దీపావళి గురించి రాసినా, దానిలో సామాజికాంశాలను చొప్పించే విధానం సుధాకర్ కు వెన్నతో పెట్టిన విద్య.

అప్పులెక్కువై చిప్ప చేతికొస్తే అభివృద్ధే మరి
కరిమ్రింగిన వెలగపండు గతి కద మన పురోగతి
ప్రజాస్వామ్యానికి ముఖం ముందుకు, పాదాలు వెనుకకు
చెంచాల కృషిలో లంచాల పంట కుంచాల కొద్ది(ఉగాది, రమ్య – పుట:16)

అంటూ అప్పులెక్కువైతే అభివృద్ధి సాగదని, లంచాలు మితిమీరి పోయాయని తెలిపాడు. లంచం సమాజంలో విశ్వరూపం దాల్చింది. సమాజంలోని ఉత్తమ ప్రమాణాలను అది తలక్రిందులు చేస్తుంది. ఈ కవితలో ప్రజాస్వామ్యం దెయ్యంతో పోల్చబడింది. దెయ్యానికి రాత్రి పూటే శక్తులుంటాయి. అలాగే మన ప్రభుత్వం రాత్రికి రాత్రే ధరలను పెంచడం, రాజకీయ పార్టీలు ఓట్ల కోసం నోట్లను పంచడం ఇప్పుడు మనం చూస్తున్నదే.

సంస్కరణకు పూనుకుంటే ఓట్లు పడవు, సీట్లు దొరకవు

మితిమీరిన కల్తీతో మనిషి మతి మురిగిపోయింది

ప్రతివ్యక్తి చెడును విమర్శిస్తాడు వాడే దాన్ని ఆచరిస్తాడు, అనుకరిస్తాడు

ఈత రాని ఈ తరాన్ని ఈదడం మీ తరానికి చేతనౌనా!(ఉగాది, రమ్య – పుట:16)

దీనిలో నేటి సమాజంలోని అవకతవకలు, రుగ్మతలు, వ్యక్తుల ప్రవర్తనా విధానం మొదలైనవన్నీ ప్రతిబింబిస్తున్నాయి.

'ఉగాది కైత'లో పండగల వెనకున్న పరమార్థం సామాజిక స్పృహతో చక్కగా విశ్లేషించాడు సుధాకర్.

వేపపచ్చడిలో నున్న విశ్వసమత

భిన్న రసములు దెల్పగా భేదభావ

రహితులై జనుల్మైత్రితో రంజిలంగ

నీయుగాది సంతోషము నిచ్చుగాదె (రమ్య – పుట:10)

ఉగాది పచ్చడిలో ఉన్న సమతాభావం ఈ పద్యంలో చెప్పబడింది. జనులంతా మైత్రితో ఉంటే ఉగాదే కాదు ప్రతీ పండగ సంతోషదాయకమవుతుంది.

'సారాయి' అనే ఖండికలో

''సారతో సంసారమంతా సారహీనము సేయుటేలా

సార – హీనము, సారహీనము, దారసుతుల దహించు పానము

నరనరాలకు పారి మెదడును నష్టపరచెడు దుష్టభూతము

తరతరాలుగ జాతికూల్చగ నవతరించిన యశని పాతము''(రమ్య – పుట:14)

పాశ్చాత్య విషసంస్కృతిలో మునిగి మన ప్రాచీన సంప్రదాయాలను విడనాడుట చూసి 'నేటి విద్యాస్థాయి' అనే ఖండికలో

''నేటి సంస్కృతి నవనాగరికత పేరుతో నడిబజారులో నగ్నంగా

నాట్యం చేసే నర్తకి

నేడు ఘరానాలతో నున్నంత అవసరం పురాణాలతో లేదు కయ్యాని

కుండే విలువ కావ్యానికి

శుష్కవాదాలకు విప్లవ నాదాలకుండే గౌరవం వేదాలకు లేదు

వస్త్రాలకుండే ఘనత శాస్త్రాలకు లేదు'' (రమ్య – పుట:18)

అని నేటి స్థితిని మనకళ్ళముందుంచాడు. అనవసర విషయాలలో తలదూర్చటం, అవసరమైన వాటిపై శ్రద్ధచూపకపోవడం ఇప్పటి మనుషుల్లో సర్వసాధారణమైన విషయమైందని ఈ కవితలో వివరించబడింది.

క్రీ.శ. 18వ శతాబ్ది వాడైన కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర శతకంలో ఇటువంటి విషయాన్నే 'వేదశాస్త్ర పురాణ విద్యలక్కరకు రావు, పరిహాస విద్యల పనికి వచ్చు' అని తెలియచేశాడు.

'రాజులు' అనే ఖండికలో

అరేయ్ నేస్తం ఎటు చూస్తున్నావు ఏం చేస్తున్నావు
నీ చిట్టిబాబు చిట్టీలు తయారుచేస్తున్నాడు పరీక్షలో
'చూచిరాత' వ్రాస్తున్నాడు వాడికంటే తెలివైనవాడు నా
గారాలపట్టి గైళ్ళను చింపి సమాధానపత్రాలను ఫైళ్ళుగా
తయారుచేస్తున్నాడు మనం వాటిని మనతో దిద్దిస్తున్నాం
మనమై మనం వాళ్ళకు విషాన్ని వడ్డిస్తున్నాం (రమ్య – పుట:21)

తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపకపోవడాన్ని సుధాకర్ పై కవితలో తెలియచేశాడు. ఇలా అక్రమంగా మార్కులు సంపాదిస్తే వారికుండే జ్ఞానం శూన్యం. అదే విషయాన్ని

పెద్ద సర్టిఫికెటు పేరుకుండునె గాని
పండితుండు మెచ్చ బనికి రాదు
సర్టిఫికెటు గాదు చదువు నా దృష్టిలో
వినుర భావి పౌర వీనులార (రమ్య – పుట:37)

అని చెప్పాడు. విద్యార్థులు శ్రద్ధగా చదవాలని, విజ్ఞానం పెంచుకుంటే అది ఎప్పటికైనా జీవితంలో ఉపయోగపడుతుందని తెలియచేశాడు. ప్రాచీన కాలంలో పాండిత్యానికి గౌరవం లభించేది. ఆధునిక కాలంలో పాండిత్యానికంటే పొందిన డిగ్రీలను చూసి గౌరవిస్తున్నారు. 'సర్టిఫికెటు గాదు చదువు నా దృష్టిలో' అనటంలో అంతరార్థం ఇదే. అదే విధంగా విద్యార్థులు అలవర్చుకోవాల్సిన సద్గుణాలు కింది పద్యంలో చెప్పాడు.

అసమాన ప్రతిభా విశేషమును, నిత్యారబ్ద సంపూర్తియున్
వ్యసనాభావము, సత్యశీలతయు నిర్వ్యాజోక్తి భావంబు ల
భ్యసనోత్సాహము జ్ఞాన కాంక్ష గలుగన్ భాసిల్లగా నెప్పుడున్
ద్వ్యసహస్రాబ్ది శుభాభినందన లివే విద్యార్థిలోకానికిన్ (రమ్య – పుట:26)

ఇది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులకు ఉపదేశాత్మకంగా చెప్పిన పద్యం.[39] విద్యార్థికి ఉండాల్సిన ఏడు గుణాలు ఇందులో చెప్పాడు.

అవి సాటిలేని ప్రతిభావిశేషము, నిత్యం పఠిస్తూ ఉండటం, దుర్వ్యసనాలకు సంబంధించిన ఆలోచనలు లేకపోవడం, సత్యం పలికే స్వభావం, దోషం లేని ఆలోచనా విధానం, అభ్యసించాలనే ఉత్సాహం, జ్ఞానకాంక్ష. ఇవి కలిగిన విద్యార్థి జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సులువుగా సాధిస్తాడు.

విద్యార్థికి ఉపదేశం ఇవ్వడమే గాదు, గురువు ఎలా ఉండాలో కింది పద్యంలో తెలియచేశాడు.

విద్యగోరునట్టి విద్యార్థి విద్యార్థి
వినయ భాసియైన విద్య విద్య
పంతిబోలునట్టి పంతులు పంతులు
వినుర భావి పౌర వీనులార (రమ్య – పుట:37)

అని గురువు విద్యార్థికి ప్రమిదలాగా వెలుగును ప్రసాదించాలని తెలియచేశాడు. అటు సమాజాన్ని, ఇటు విద్యార్థులను సూక్ష్మంగా పరిశీలించాడు సుధాకర్.

ఈనాటికీ సమాజ స్థితిగతుల్లో పెద్దగా మార్పులు వచ్చిన దాఖలాలు లేవు. ఇంకా పెద్దల ముసుగులో అధికార పీఠాలను దొడ్డిదారుల్లో అధిరోహించి సమాజాన్ని, ప్రజాజీవితాన్ని మరింత ఛిన్నాభిన్నం చేస్తున్నారు నాయకులు.

ప్రజాస్వామ్యమనగానే పదవుల కొట్లాటయయ్యె
పేదల గుండెలు ఫిరంగి గుండులుగా మారుచుండె
మధ్యరకపు జీవితాలు వధ్యశిలాతలములయ్యె
ఈ స్వాతంత్ర్యం కన్నా ఆ పారతంత్ర్యమే మిన్న

[39]ఈ పద్యం విద్యార్థులకు ఉపదేశాత్మకంగా 1 జనవరి 2000 తారీఖున చెప్పారని ప్రచురణ కర్తలు తెలియచేశారు.

ఇది ఇట్లే కొనసాగిన ప్రజాస్వామ్యమే సున్న (రమ్య – పుట:33)

'సమాజ శ్రేయస్సును వదిలిపెట్టి కేవలం పదవుల కోసమే పాటుపడే నాయకులు ఉన్నంత కాలం అభివృద్ధి శూన్యం' అని పై కవితలో చక్కగా విశ్లేషించాడు.

'నేటి సమాజంలో సమభావం నశించింది, శాంతి కరువైంది, సత్యానికి విలువ లేదు, గాంధీజీ బోధించిన అహింసాధర్మసూక్ష్మాలు అంతమొందాయి' అనే విషయాలను 'గాంధీ మహాత్మ' ఖండికలో కింది విధంగా తెలియచేశాడు.

సమభావమ్ము నశించె శాంతి కరవై సత్యమ్మసత్యమ్ముగా
సమకట్టంబడె తాము నేర్పిన యహింసా ధర్మసూక్ష్మంబులం
తమునొందెం దమతోనే నిక్కముగ నేతల్పీత సంకోచులై
తమ పొట్టం దము చూచుకొందురిల గాంధీ చూడు మాదుస్థితిన్
– (రమ్య – పుట:43)

నేటి సమాజంలో తమ పొట్టను తాము చూసుకునే స్వార్ధనాయకులెందరో ఉన్నారని తెలియచేశాడు.

'ఉగాది' అనే ఖండికలో

'యుద్ధభీతి పోయి శుద్ధాశయమ్ముతో
భరతజాతి నిచ్చవరలుగాత
కొరత లెల్ల తొలగి కొంతైన నికమీద
నీయుగాది శాంతినీయుగాదె' (రమ్య – పుట:28)

అని దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని ఇందులో తెలియచేశాడు.

'ఆలోచించు' అనే ఖండికలో కూలివాన్ని వర్ణించాడు.

తినడానికి దొరకలేదు కూలీకొక బుక్క
ఐనా వాడు దొరికించుకుంటాడు
సాయంత్రానికల్లా సారాయి చుక్క
ఎంత బాగా చిరిగిందో చూడు వాడి చొక్కా
వాడి బతుక్కంటే కుక్క బతుకే పక్కా (రమ్య – పుట:29)

మనిషిని మరింత ఉన్నతున్ని చేసేది అతని ప్రవర్తన. తాగుడుకు బానిసై ఆస్తిపాస్తులను అన్నింటిని పోగొట్టుకున్నా, ఆ వ్యసనాన్ని చాలామంది వదులుకోలేక పోతున్నారు. తాగుడే కాదు మనసును అదుపులో పెట్టుకోనంత వరకు మనిషి ఉన్నతుడు కాలేడు. గీతలో శ్రీకృష్ణుడు 'నిన్ను నీవు ఉద్ధరించుకో'[40] అని చెప్పడంలో పరమార్థం ఇదే.

ఆడంబరం లేని దైవభక్తి, కులమత రాహిత్యాకాంక్ష, కష్టపడే వారిని ఇష్టపడే మనసు మొదలైనవి సుధాకర్ తత్వాలుగా గ్రహించవచ్చు.

ఈ విధంగా సుధాకర్ రచించిన సుధాకర కవితాజ్యోత్స్నలో అడుగడుగునా సామాజిక స్పృహ కనిపిస్తుంది.

★ ★ ★

[40] ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్!
ఆత్మైవ హ్యాత్మనో బన్ధు రాత్మైవ రిపురాత్మనః!!

- ఆత్మసంయమ యోగము – 5, భగవద్గీత

4. సుధాకర కవితా జ్యోత్స్న – కవితా శిల్పం

'శిల్పం' కవిత్వంలో కంటే నిత్య వ్యవహారంలో ఎక్కవగా ప్రయోగింపబడుతూ ఉంది. నిత్య వ్యవహారంలో విగ్రహ శిల్పానికి సంబంధించి 'శిల్ప' శబ్దం రూఢమై పోయింది. విగ్రహాలను తయారు చేసేవారికి 'శిల్పి' అనే పదం జనవ్యవహారంలో ఉంది. ఇంకా ఇతరవృత్తుల్ని చేసేవారిని కూడా వారి పని నైపుణ్యాన్ని బట్టి శిల్పులనడం పరిపాటయింది. సాహిత్యంలో రచయిత ప్రదర్శించే రీతికి పర్యాయపదంగా శిల్ప శబ్దం వాడబడుతూ ఉంది. శిల్పం లేనిదే ఎంత గొప్ప సాహిత్యమైనా రాణించదు. కొందరు విమర్శకులు కావ్యాల్ని గూర్చి చర్చిస్తూ – ఇందులో విషయం బాగుంది కానీ శిల్పం లోపించిందనడం మనకు తరచుగా వినిపిస్తూ ఉంటుంది.

'టెక్నిక్', 'స్టయిల్', 'ఆర్ట్' అనే ఆంగ్ల పదాలకి పర్యాయపదంగా నేటి విమర్శకులు 'శిల్పం' అనే మాటను వాడుతూ ఉన్నారు. 'టెక్నిక్' అనే పదానికి 'కార్య సూక్ష్మత' అనే అర్థం ఉంది. కళాత్మకంగా ఒక కార్యాన్ని నెరవేర్చడాన్ని టెక్నిక్ అని వ్యవహరిస్తూ ఉన్నాం. 'స్టయిల్' అనే పదం రాసే విధానాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ పదం ముందుగా కవి రాసే ఘంటానికి వాడబడినట్లు ఉంది. ఆ పైన్నే రాసే తీరుకు స్థిరపడిపోయింది.

ఇక 'ఆర్ట్' అనే పదం 'నేర్పరితనం' అనే అర్థాన్ని సూచిస్తూ ఉంది. విస్తృతార్థంలో ఇది సృజనాత్మకమైన అన్ని విషయాల్నీ వ్యక్తం చేస్తుంది. ఇలా 'టెక్నిక్', 'స్టయిల్', 'ఆర్ట్' అనే పదాల స్థాయిలో ఈ శిల్ప శబ్దం వాడబడుతూ విస్తృతార్థాన్ని కలిగి ఉంది.

శిల్ప శబ్దం 'శీల' ధాతువునుండి ఏర్పడింది. శీల ధాతువుకు అభ్యాసం, సమాధి అనే అర్థాలు చెప్పబడ్డాయి. శిల్ప స్థానంలోనే ప్రస్తుతం వాడుకలో ఉన్న 'శైలి' శబ్దం కూడా శీలధాతువు నుండి ఏర్పడింది. 'శిల్పం', 'శైలి' ఈ రెండూ ఒకే ధాతువు నుండి ఏర్పడినా, భిన్నమైన అర్థాన్ని కలిగి ఉన్నాయి. శిల్పమంటే ధర్మప్రవృత్తి నిరూపక మయినదియు, ఏకాగ్రతా మూలకమైనదియునగు కర్మకౌశలం అని భావం. వ్యస్తంగా శీల శబ్దానికి స్వభావం, ప్రవృత్తి అనే అర్థాలున్నాయి. శీల శబ్దమే స్వార్థమున శైలి అవుతుంది. కనుక శైలి శీలాన్ని అనుసరించి ఉంటుంది. జీవుల శీలములలో ఎంతటి వైవిధ్యముంటుందో శైలులలోనూ అంతటి వైవిధ్యం ఉండక తప్పదు.

ఈ పరామర్శ వల్ల తేలే సారాంశం – శిల్పానికీ, శైలికీ కొంత భేదం ఉందని, వాస్తవానికి శైలి అయ్యిందల్లా శిల్పం కావటం లేదు. అలా అయి ఉంటే ప్రతి ఒక్కరి శైలీ శిల్పమే అవుతుంది. కాని కొందరి ప్రత్యేక శైలులే శిల్పంగా రూపుదిద్దుకొని అందరి ఆదరణని పొందుతూ ఉన్నాయి.

అభ్యాసం సమాధ్యవస్థలని పొంది శైలి శిల్పం కాగలదు. అభ్యాసం వల్ల శైలికి కౌశల రూపం, సమాధి వల్ల నైపుణ రూపం సిద్ధిస్తాయి. వీటి రెంటివల్ల లౌకిక శైలికి శైలీ శిల్పత్వం ప్రాప్తిస్తుంది. ఇదే శిల్పమై అమరత్వాన్ని పొందుతుంది.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం ఈ మూడూ పుష్కలంగా ఉన్న కవి తన కవితా రీతి వల్ల సాహిత్యంలో తనదైన శిల్పాన్ని స్థాపించుకుంటాడు. తన మనోగత భావాల్ని బాగా వ్యక్తం చేసేందుకు అర్థవంతమైన కావ్యాన్ని రాయడం కవి పని. కావ్యంలో పదాలు, అర్థాలు, ఛందస్సు, అలంకారాలు సమపాళ్ళలో చోటు చేసుకొని పఠితకు ఆనందానుభూతిని కలిగిస్తాయి. అట్టి సన్నివేశాలతో కూడుకొని ఉన్నటువంటి కవి యొక్క ఆంతర, బాహిర ఇంద్రియాల ఏకాగ్రమైన వ్యాపారమే శిల్పం.[41]

4.1 అవతారికా విశేషాలు:

శతక కర్తలు కొందరు నియమాలను సడలించి శతకాలను రచించడం వల్ల తెలుగు శతక స్వరూపాలలో ఎన్నో మార్పులు వచ్చాయని తిరుమల శ్రీనివాసాచార్య గారు తెలియచేశారు. ఆ మార్పులివి –''వివిధ మకుటాలను గ్రహించడం, పద్యారంభంలో మకుటం ఉంచడం, కొన్ని పద్యాలను నిర్మకుటంగా రాయడం, సజాతి వృత్తం కాకుండా వివిధ వృత్తాలలో, జాత్యుపజాతి పద్యాలలో రాయడం, శతక ద్వయాన్ని అర్థశతాన్ని సహస్రాదులను రచించి సంఖ్యానియమాన్ని పాటించకపోవడం, మిశ్రవస్తువును గ్రహించడం, కథాత్మక శతకాలలో ముక్తక లక్షణం పాటించకపోవడం, శతకంలో పూర్వోత్తర విభాగాలనూ, ప్రథమ, ద్వితీయాది విభాగాలనూ, ఆశ్వాస – అంక విభాగాలనూ, పర్వ – స్కంధ – కాండ విభాగాలను పాటించడం, శతకాలలో కావ్యావతారికలను ప్రవేశపెట్టి ఇష్టదేవతాస్తుతి, కావ్యారంభం, కృతిపతి, కుకవినింద, షష్ఠ్యంతాలు, ఆశ్వాసాంత గద్యలు చేర్చడం, మధ్య మధ్య చంపూ సంప్రదాయమైన వచనం

[41] ఎస్వీడి చంద్రశేఖర్, వచన కవిత్వం – కుందుర్తి పాత్ర, పుట - 153

చేర్చడం, పూర్వం వలె దైవానికి గాక శతకాలను పోషక – మిత్ర – బంధు మాతా పితరులకు అంకితం చేయడం, శతకాలకు అంకిత – ఆవిష్కరణోత్సవాలు నిర్వహించడం, శతకాలను చిత్రబంధ కవితారీతుల్లో రాయడం, యమక, అనుప్రాస, ముక్తపదగ్రస్త – మొదలైన శబ్దాలంకారాలను వాడడం, శతక కర్తలు జంటకవులుగా రాయడం, పూర్తిపాదాన్ని మకుటంగా ఏకైక ప్రాసతో స్వీకరించడం, యతి దగ్గర నుండి మకుటం ఆరంభించడం, అకారాది అక్షర క్రమంలో శతకం రచించడం, ద్విప్రాస, త్రిప్రాస, దుష్కర ప్రాస ఆది నియమాలను పాటించడం ఒక్కొక్కరు ఒక్క పాదాన్ని పూర్తి చేస్తూ ముగ్గురు కవులు శతకం పూర్తి చేయడం – వంటి ఎన్నెన్నో పరివర్తనలను పొందింది శతక సాహిత్యం.''[42]

సుధాకర్సాయి శతకంలోను, సరస్వతీ శతకంలోను అవతారికా సంప్రదాయాన్ని పాటించాడు. పైన పేర్కొన్నట్లు కావ్యాలలో మాదిరిగా శతకాల లోను అవతారికా సంప్రదాయాన్ని పాటించారు కొందరు శతక కర్తలు. శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతకంలో

అందంగా మధురస ని
ష్యందంగా పరితృహృదయ సంస్పందంగా
కందాలొక వంద రచిం
చిందికి మనసయ్యె నాకు సిరిసిరి మువ్వా!

అని పేర్కొని కావ్యావతారికా సంప్రదాయాన్ని అనుకరించాడు.

ప్రాచీన కాలం నుండి సంప్రదాయ రచనలు చేసిన కవులు శ్రీకారంతో తమ రచనలను ఆరంభించడం నియతంగా పాటించినట్లు కనిపిస్తుంది. శతక కవులు కూడా దీనిని అనుసరించారు. ఆధునిక కవులు కూడా దీనిని పాటించారు. సుధాకర కవితాజ్యోత్స్నలోని సాయిశతకం కూడా శ్రీకారంతో కింది విధంగా ఆరంభమైంది.

శ్రీగౌరీ ప్రియనందన!
నాగానన! నాగభూషణాత్మజ! నన్నున్
వేగదయబూని, వాగ్ ఝరి
నీగదె సాయీశు శతకమింపుగ వ్రాయన్!

---

[42]తిరుమల శ్రీనివాసాచార్య, 'శతక సాహిత్యం' తెలుగు భాషా వైభవం. పుట- 313

ఇది సాయి శతకం అవతారికా మొదటి పద్యం. గణపతి స్తుతి ఇందులో ఉంది.గణపతి విఘ్ననాయకుడు. 'శ్రీ', 'లక్ష్మీ' మొదలైన దేవతా వాచక శబ్దాలు కావ్యాదిలో ప్రయోగిస్తే లిపిదోషాలు కాని, గణదోషాలు కాని రావని విజ్ఞుల అభిప్రాయం. 'శ్రీ' అనే శబ్దానికి శబ్దరత్నాకరంలో లక్ష్మి, సంపద, ఐశ్వర్యం, త్రివర్గము (ధర్మార్థ కామములు), వృద్ధి, శోభ, అలంకరణము, కీర్తి, బుద్ధి, సరస్వతి, విషం, ఉపకరణం, మూడు వేదాలు, చంద్రుని పన్నెండో కళ, తామర, మారేడు, ఒక రాగం అనే అర్థాలున్నాయి.

'ఎంతయు శ్రీకారము లా
ద్యంతంబుల నుంచి లేఖలంపిన నగు న
శ్రాంతంబు గార్యసిద్ధి ము
రాంతక కావ్యాది గూర్ప నరుడె శుభంబుల్' (అప్ప. 2 – 355)

అను అప్పకవి మతం ప్రకారం కావ్యాదిలో శ్రీకార ప్రయోగం శుభాన్ని కలిగిస్తుంది. ఆలంకారికంగా చూస్తే ఛందశ్శాస్త్రం ప్రకారం కావ్య ప్రారంభంలో 'మగణము' ను ప్రయోగించాలి. గణాలలో 'మగణము' శ్రేష్ఠము.

'మో భూమి స్త్రి గురుశ్శ్రియం దిశతి' అని ఛందఃకౌముదిలోని గణ ప్రకరణంలో చెప్పబడింది. దీని ప్రకారం మగణం భూమి బీజం. అది రచయితకు, తత్కావ్య భర్తకు, పాఠకుడికి సంపదను కల్గిస్తుంది. పైన పేర్కొన్న సుధాకర్ పద్యం శార్దూలం కాకున్నను మగణం ప్రయోగించడం విశేషం.

పై పద్యంలో కంద పద్య గణాలైన 'గా,భ,జ,స,నల' లోని గా, భ గణాలు వరుసగా ప్రయోగించబడ్డాయి. అంటే అది మొదటగా మూడు గురువులు గల మగణంగా దర్శింప చేసి కవి ఛందశ్శిల్పాన్ని పాటించాడని చెప్పవచ్చు. అదే విధంగా 'గణ సాంగత్య ఫలం ప్రకారం మగణం తర్వాత న–మ–య–స గణాలలో ఏది ఉన్నా శుభమౌతుంది'[43] పై పద్యంలో మొదటి పాదంలో 'గా, భ, భ' గణాల ప్రయోగం (శ్రీగౌరి ప్రియనందన)వల్ల– మగణం తర్వాత నగణం ప్రయోగింపబడినట్లు అయింది. అంతే గాకుండా ఇది క్రియాంత పద్యం కావడం మరో విశేషం. నన్నయ భారతంలోని ఉదంకోపాఖ్యానంలో 'ప్రసన్నులయ్యెడిన్' అనే క్రియ అంతంగా గల పద్యముంది.

[43]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశం. పుట-287.

నిరంతర అధ్యయనశీలురకు మాత్రమే ఇటువంటి రచన సాధ్యం. ఎవరైనా నిరంతర అధ్యయన శీలి కావాలని సుధాకర్ హితబోధ చేయడమే కాదు, తనకు తాను ఆచరించినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు

శ్రీ సాయీశ్వర పాదయుగ్మము నెదం జింతించి, ప్రాచేతస
వ్యాసర్షీంద్ర కవీంద్ర చంద్రముల భక్త్యావేశ ముప్పొంగగన్
భాసున్ హాసుని కాళిదాసనుకవిన్ ప్రార్థించి, కీర్తించి, య
భ్యాసార్థంబు సరస్వతీ శతి రచింపం బూనితిన్ దిన్నగన్ (అవతారిక, సర – 2)

ఇది సరస్వతీ శతకారంభ పద్యం.

శ్రీ సాయీశ్వరు పాదపద్మము లెదన్ జింతించి, ప్రాచేతస
వ్యాసర్షీంద్ర కవీంద్ర చంద్రముల భక్త్యావేశ ముప్పొంగగన్
భాసున్ హాసుని కాళిదాససుకవిన్, బాణున్, మాయూరాదులన్
వాసిన్ సంస్తుతి జేసి వ్రాసెద, దయా వారాశి సాయీ శతిన్
–(అవతారిక, సా.శ – 2)

ఈ పద్యం సాయిశతకంలోనిది. సాయి శతకం కంటే ముందు సరస్వతీ శతకం రచింపబడింది. పైన పేర్కొన్న రెండు పద్యాలలోని మూడవ పాదంలో మార్పు వచ్చింది. సరస్వతీ శతక రచనా కాలం నాటికి సుధాకర్ దృష్టిలో కాళిదాసు కవి మాత్రమే (కాళిదాసనుకవిన్). కాని సాయి శతకం రచనాకాలం నాటికి 'కాళిదాస సుకవి' అయ్యాడు. అంతే గాకుండా, అదనంగా 'బాణుడు, మయూరాదులన్' ప్రస్తావన. ఈ రెండు పద్యాలను బట్టి సుధాకర్ నిరంతర అధ్యయన శీలి అని చెప్పవచ్చు. పూర్వలాక్షణికులు చెప్పింది అదే. కవికి ప్రతిభ, వ్యుత్పత్తితో పాటు అభ్యాసం కూడా ఉండాలని.

4.2శ్రీ సాయీశ శతకం:

సాయి శతకంలోని పద్యాలు భావచిత్రాల వలె ఉన్నాయి. సాయీశుని నామస్మరణ, రూపస్మరణ గల పద్యాలు ఎక్కువగా ఉండటం వల్ల ఇదొక కథాత్మక శతకంగా భాసిస్తుంది.

అంతే కాకుండా శతకం చివర 'ఫలశ్రుతి' సంస్కృత శ్లోకాలలో ఉంది. ఇది సంస్కృతంలో సుధాకర్ కున్న పాండిత్యాన్ని తెలియచేస్తుంది.

''శతకం సాయిదేవస్య

యః పఠేత్ పూతమానసః

హృది తిష్ఠన్ సదాదేవో

దద్యాద్విద్యా ధనాధికమ్''

ఇది అనుష్టుప్పు ఛందస్సు. ఇందులో ప్రతిపాదంలో అయిదవ అక్షరం లఘువుగా, అరవ అక్షరం గురువుగా నియతంగా ఉన్నాయి. ''అయితే ప్రతి అనుష్టుప్ పద్యము ఇట్లాగే ఉండదు. దీనికి ఎనిమిదక్షరాల నియతియే తప్ప గురు, లఘు క్రమానికి ప్రాధాన్యం లేదు. కాని బేసి పాదాల్లో అయిదవ అక్షరం మాత్రం లఘువుగా, సరిపాదాల్లో ఆరవ అక్షరం గురువుగా ఉండాలన్న నియమం ఉంది. వాల్మీకి ముఖతః ప్రప్రథమంగా ఆవిష్కృతమైన పద్యం.

మానిషాద ప్రతిష్ఠాంత్వ

మగమశ్శాశ్వతీస్సమాః

యత్క్రౌంచ మిథునాదేక

మవధీః కామ మోహితమ్

ఇందులోనూ ప్రతిపాదంలోనూ అయిదవ లక్షరం లఘువుగా ఆరవ అక్షరం గురువుగా నియతంగా ఉన్నాయి.'' [44]

సుధాకర్ వాల్మీకిని గురించి ప్రత్యేకించి స్మరించకున్ననూ, వాల్మీకి తనకు ఇష్టమైన కవిగా పరోక్షంగా తెలియచేశాడు పై శ్లోకం వల్ల. అదేవిధంగా సాయిశతకంలోని 'తిర్వరంగకులోద్భూత....' , తోగు వేకంటేశ శతకంలోని 'తిర్వరంగాన్వయే జాత....' అనే శ్లోకాలలో కూడా పైన పేర్కొన్నట్లు గురు, లఘువులు నియతంగా ఉన్నాయి.

పాపల నవ్వుల లోపల

కాపట్యము లేని లేడి కన్నుల లోనన్

[44]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-10.

చేపల తళుకుల లోపల

నీపావన రూపుఁ జూతు నిజముగ సాయీ! (సా.శ – 83)

ఈ పద్యంలోని విశేషాలను ఆచార్య శలాక రఘునాథశర్మగారిట్లు వివరించారు. ''ఇది ఒక విధమైన విభూతి యోగ దర్శనం కల్లా కపలం లేని తావులను మూడింటిని ఎన్నుకున్నాడు సుధాకర్. అందులో మొదటిది మానవ జాతి, రెండవది పశుజాతి, మూడవది జలచర జాతి. ఈ మూడింటిని ఉపలక్షణంగా తీసుకుని సర్వజగత్తులో సర్వేశ్వరుణ్ణి సాక్షాత్కరింపజేసుకొనే సామరస్యాన్ని నింపుకున్నాడు సుధాకర్. పైగా 'చూతు' అనే తాచ్ఛీల్యార్థక క్రియాపదాన్ని ప్రయోగించి దర్శనంలోని నైరంతర్యాన్ని, శీలాన్ని అభివ్యక్తం చేస్తున్నాడు. అవి అటువంటి వాటినన్నింటిని తెలియజేస్తాయి. 'యద్యద్విభూతి మస్తత్త్వం శ్రీమదూర్జిత మేవవా, తత్త దేవా వగశ్చ త్వం మమ తేజోంశ సంభవమ్' [45] అనే గీతా వాక్యానుసారం సర్వవ్యాపి భగవత్తేజో దర్శనానుభూతిని పొందుతున్న విషయం మనకు తెలిసి వస్తుంది. 'నిజముగ' అనే పదం యతికోసం అనిపిస్తుంది. కీనా 'సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ' అన్న శ్రుతి వాక్యాన్ని స్మరిస్తే నిజముగ అంటే సత్య స్వరూపంగా అనే అర్థం సిద్ధిస్తుంది.'' ప్రాస 'ప' కారం కావడం విశేషం. పరమాత్మ స్వరూపం తెలుపడం ఇందులో ప్రధానోద్దేశ్యం కాబట్టి. చిన్న పద్యంలో మిన్న అయిన అర్థాన్ని నింపిన ఇటువంటి పద్యాలు ఇందులో చాలా ఉన్నాయి.

అదేవిధంగా పై పద్యంలో మొదటి పాదంలో వరుసగా మూడు భగణాల ప్రయోగం శ్రవణ శుభగత్వాన్ని కలిగిస్తున్నాయి. ఈ విధంగా మొదటి లేదా మూడవపాదంలో, కొన్ని చోట్ల మొదటి మరియు మూడవ పాదంలో భగణత్రయ ప్రయోగ ప్రియత్వం గల పద్యాలు సాయి శతకంలోను, రమ్యభావ తరంగాలలోను ఉన్నాయి. అవి.

దేలుచునుందువు, భక్తుల (సా.శ. – 12)
చెంగున గంతులు వేయుచు (సా.శ. – 17)
గీతకు భాష్యము సెప్పిన (సా.శ. – 18)
మొల్లలు, మల్లియలత్తరు (సా.శ. – 21)
పూవుల మాలలు దెత్తురు (సా.శ. – 23)

---

[45] విభూతి యోగం 41వ శ్లోకం, భగవద్గీత

నా మది నీ పద పీఠిక (సా.శ. – 30)

మూడు దినంబులు కాయము (సా.శ. – 39)

అంతము లేని జగమ్మును (సా.శ. – 50)

సాయి సమాధియె మాకిక (సా.శ. – 53)

నా కనుపాపల లోపల (సా.శ. – 55)

కల్లల నుక్కడ గింపుము (సా.శ. – 56)

వేడిన వారిని వీడక (సా.శ. – 58)

జన్నపు గుండము నీధుని । యెన్నియొ యజ్ఞమ్ములున్న వీధరలోనన్

అన్నియు ద్వారకమాయిని । యెన్నంబడు యాగములుగ నీశా! సాయీ!

–(సా.శ. – 98)

నీతికి కాలము గాదిది (సా.శ. – 117)

భూతము లైదిటి లోపల (సా.శ. – 135)

ఈ విధమైన భగణ త్రయప్రయోగం ఇతర కవుల రచనల్లో అక్కడక్కడ కనిపిస్తుంది. ఉదాహరణకు అనంతుని ఛందో దర్పణం నుండి

విద్యల లోపల నుత్తమ
విద్య కవిత్వంబు, మరి కవిత్వము ఛందో
వేద్యము, గావున చెప్పెను
హృద్యంబుగఁ గవిత ఛందమేర్పడ గృష్ణా! (ఛందో. 1 – 5)

అదే విధంగా అల్లసాని పెద్దన మనుచరిత్ర లోని

ఆ మందిడి అతడరిగిన
భూమీసురుడరిగె తుహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాఢ్య దరీ ఝరీ నిరీక్ష్యాపేక్షన్. (మను. 1 – 79)

అనే పద్యానికి విశ్వనాథ సత్యనారాయణగారు 'అల్లసాని వాని అల్లిక జిగిబిగి'లో చక్కని వివరణ ఇచ్చారు.

భగణాలు కాకుండా వరుసగా 'నల' గణాల ప్రయోగం కూడా తెలుగులో ఉంది. సవరము చిననారాయణ కవి కువలయాశ్వ చరిత్రలో వరుసగా సగణాలు ప్రయోగించబడిన కంద పద్యం ఉంది.

కనమో? వినమో? ఘనమో
ఘనమోహన మోదకారి కచ । మగవానిం
దినముం భువనంబుల నా
మనమున్ హరియించువాని మఱిగంటి మఱే? (కువ. 3 – 144)

ఇటువంటి కంద పద్య శైలీ విశేషాలను పరిశీలించాల్సి ఉంది.

ధర్మానికి గ్లాని కలిగినపుడు అధర్మాన్ని రూపుమాపి ధర్మాన్ని సుస్థాపించడం కోసం ప్రతియుగంలోను అవతరిస్తానని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో ''యదాయదా హి.... పరిత్రాణాయ సాధూనాం'' అని రెండు శ్లోకాలలో పేర్కొన్నాడు. అవసరానికి అనుగుణమైన రూపాన్ని పొందుతాను అని 'తదాత్మానం సృజమ్యహమ్' అని వెల్లడించాడు. ఆ అవతారాలలో

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహోఽథ వామనః
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కల్కిస్తథైవ చ

అని ప్రసిద్ధి పొందాయి. సాయి శతకంలో దశావతారాల స్తుతి ఉంది. ఇందులో దశావతారాలను సాయికి ఆపాదించాడు సుధాకర్.

జయజయ మత్స్యాకారా!
జయజయ కూర్మావతార! జయ కిటి రూపా
జయజయ శ్రీ నరసింహా!
జయజయ వామనవతార! జయజయ సాయీ! (సా.శ – 31)

ఇందులో సుధాకర్ ఎంచుకున్న అవతారాలు గమనించదగినవి. దీనిలో మత్స్యావతారం జలచర జాతి, మోహనాకృతి గలది. కూర్మావతారం జలచరజాతి. వరహావతారం జంతుజాతి. నరసింహావతారం సగం జంతువు, సగం మనిషి. వామనావతారం మనుష్యజాతి. వరాహావతారం, నరసింహావతారం వికృత, భీకర

స్వరూపం గలవి. అంతేగాకుండా ఈ అవతారాలు అవతరించగానే లక్ష్యసాధనకు ప్రయత్నించినవారు, ఎక్కువగా బంధాలలో చిక్కుకున్న వాళ్ళుగా (మిగతా అవతారాలతో పోలిస్తే) దర్శనమీయరు. అంతేగాకుండా మహావిష్ణువు ఈ అవతారాలలో ఎక్కువ కాలం ఉన్నట్లు ఐతిహ్యాలు లేవు కాబట్టి వీటన్నింటినీ ఒక పద్యంగా రాశాడని భావించవచ్చు.

సుధాకర్ కవిత్వంలో ధారాశుద్ధి ప్రధానగుణం. వీరి పద్యాలు ఎక్కడా కుంటి నడక నడవకుండా లయ ప్రధానంగా సాగుతాయి. కానీ పై పద్యంలో 'వామనవతార' వద్ద లయ చెడింది. దీనికి కారణం 'గిడుగు సీతాపతి గారు పేర్కొన్నట్లు 19వ మాత్రపై ఊనికి లేకపోవడం.' అయితే కవి ఇక్కడ కావాలనే లయ లోపింప చేశాడనుకోవచ్చు. ఇందుకు కారణం వామనుడు బాలుడు అతని నడక బుడిబుడి అడుగులతో సాగుతుంది.

జయజయ భార్గవరామా!
జయజయ దాశరథి రామ! జయ బలరామా!
జయజయ హే శ్రీకృష్ణా!
జయజయ కల్క్యవతారధారి! జయ శ్రీ సాయీ! (సా.శ – 32)

పై పద్యంలో గల అవతారాలు మానవ రూపాలు. వీళ్ళు అంతా బంధాలలో చిక్కుకున్న వాళ్ళుగా దర్శనమిస్తారు. అందుకే వారిని ఒకచోట కలిపి రాశాడని భావించవచ్చు.

సాయిబాబా చర్చాగోష్ఠి ప్రియుడు. సమయం దొరికినప్పుడల్లా సాయి తన భక్తులతో వేదాంత విషయాలను గురించి చర్చించేవారు. ఆ విషయాన్ని సుధాకర్ గ్రహించాడు.

గీతార్థము చెప్పుటలో
నీ తాత్పర్యమ్ము దెలియనేరరెవారున్
గీతకు భాష్యము సెప్పిన
తాతలకే దోచలేదు తత్వము సాయీ!

భగవద్గీతను పూర్తిగా అర్థం చేసుకోవడం సామాన్యులకు సాధ్యం కాదు. కాని సాయి అందుకు అతీతుడు. పై పద్యంలో 'తత్త్వము' అనే పదం సాధారణార్థంలో యాదృశ్చికంగా వాడిన పదం కాదు. తత్+త్వం అంటే ఆ పరమాత్మ రూపమే నీవై ఉన్నావు అన్న పరమార్థంలో పద్యంలో యతిస్థానంలోనే వాడటం విశేషం. యతికే గదా తత్+త్వం అన్న ఆధ్యాత్మిక భావన ఉండేది. ఈ అధ్యాత్మిక భావన గలిగిన ప్రతివ్యక్తీ

యతియే కదా! నాల్గవ పాదంలోని 'తాతలకే తోచలేదు' అనే నుడికారం పరిశీలనార్హం. ఏదైనా ఒకపని కష్టసాధ్యమైనప్పుడు 'తాతలు దిగిరావాల' అనే ప్రయోగం వ్యవహారంలో ఉంది. తాత అంటే తండ్రి అని, పితామహుడు లేదా మాతామహుడు అనే అర్థాలున్నాయి.

సుఖాలలో ఉన్నప్పుడు భగవంతున్ని విస్మరించే భక్తులు కష్టాలు వచ్చినపుడు మాత్రం విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఆ భగవంతున్నే నిందిస్తారు. సహజంగా లోకంలోని మనుషుల తీరు కింది విధంగా ఉంటుంది.

కష్టాలు చుట్టుముట్టగ
దుష్టాత్ముడనౌచు నిన్ను దూరుదునేమో,
సృష్టించితివీవె గద!
కష్టంబనుకొనక తప్పు గాయుము సాయీ! (సా.శ – 73)

ఏ మనిషైనా తనకు మంచి జరిగినపుడు దానికి కారకుడు తానే అంటాడు. అదే చెడు జరిగినపుడు దానికి కారణంగా ఎదుటివారిని చూపిస్తాడు, లేకపోతే విధి విలాసం అంటాడు. ఎటుంచి తన తప్పును తాను ఎప్పుడూ ఒప్పుకోడు. ఇదే విషయాన్ని పై పద్యం ద్వారా తెలియచేశాడు సుధాకర్. ఇందులోని పరుషాక్షరాలు భగవంతుని పట్ల భక్తుల కోపాన్ని వ్యక్తపరుస్తున్నాయి.

తాను కవి అన్న అహంభావం ఈ కవికి లేదు. తన తప్పులు సవరించుమని సవినయంగా కింది పద్యంలో విన్నవించుకున్నాడు సుధాకర్.

కవి నేను గాను గానీ
కవితాభ్యాసంబు సేయ గడగితి నెటులో
సవరింపుము దోసముల, నా
యవి నాకు గాననగునె యరయగ సాయీ! (సా.శ – 86)

ఇందులో సుధాకర్ వినయబుద్ధి కనిపిస్తుంది. ఎవరి తప్పులు వారికి కనిపించవు. ఇతరులు చెబితేనే తన తప్పులు తాను తెలుసుకోగలుగుతాడు. అలా తన తప్పులను తెల్సుకొని వాటిని పునరావృతం కాకుండా చూసుకునేవాడు ప్రశంసార్హుడు అవుతాడు.

తోగు వేంకటేశ శతకంలోని 'నీదు లీలలు దెలిసిన నిక్కమైన, పాండితీవైభవము లేని పామరుడను' అనే పద్యంలో కూడా సుధాకర్ వినయబుద్ధి కనిపిస్తుంది.

ఏ పని చేయటానికైనా ఏకాగ్రత చాలా అవసరం. క్రమక్రమంగా సాధన పెంచుకుంటూ పోతే ఏకాగ్రత కుదురుతుంది. తాను ఎంచుకున్న అంశానికి తగిన విధంగా భావన చేసుకోవడం ఏకాగ్రతలో మొదటి మెట్టు. సుధాకర్ సాయి భక్తుడు అందుకే అందరిలోనూ సాయిని దర్శించ ప్రయత్నించాడు. అన్ని పుణ్యక్షేత్రాలను షిరిడీగా భావించాడు.

షిరిడీ పురి యమరావతి,
షిరిడీ పండరి పురమ్ము, షిరిడీ కాశీ,
షిరిడీయే వైకుంఠము,
షిరిడీ కైలాసనగము, షిరిడీ సాయీ! (సా.శ – 33)

ఇందులో షిరిడీ పురి అమరావతిగా, పండరి పురంగా, కాశిగా, వైకుంఠంగా, కైలాసంగా భావన చేయబడింది. అంటే ఆయా స్థలాలలో ఉన్న మాహాత్మ్యాలన్నీ షిరిడీ క్షేత్రంలో ఉన్నాయన్నమాట. 'షిరిడీ సాయీ!' అనే పదం గమనించదగింది. 'షిరిడీ పురిలోని సాయీ!' అని సంబోధనగా, 'షిరిడీయే సాయి' అని రెండు విధాలైన అర్థాలను అన్వయించుకోవచ్చు.

సుధాకర్ సాయిశతకంలో ఇంచుమించు సాయిబాబా అన్ని లీలలను వర్ణించాడు. ఏ ఒక్క లీలను విస్మరించలేదు. అదే విధంగా సాయిబాబా దివ్యబోధలను విస్మరించలేదు.

జాతకము తుంగ ద్రొక్కుము,
పాతకములఁ బాపి నిన్ను పాలింతును, నీ
చేతము నాపై నిల్పుము,
నే తప్పనటంచు నంటి నిజమే సాయీ! (సా.శ – 10)

సాయికి తన భక్తులు జాతకాలను చూపించుకోవడం ఇష్టముండదు. 'కష్టించిన వారికే తగిన ప్రతిఫలం అందుతుంది. నీ శ్రమను నువ్వు నమ్ముకో. అందుకు తగిన సహకారం నేను అందజేస్తాను' అని సాయి ఉపదేశించాడు. ఆ విషయమే పై పద్యంలో వర్ణితం.

సాయి శతకంలో ద్విప్రాస, త్రిప్రాస కలిగిన పద్యాలున్నాయి. కొన్ని పద్యాలలో మూడు పద్యాలు ద్విప్రాస కలిగి ఒక పాదంలో ద్విప్రాస లోపం కనిపిస్తుంది.

భూతములే యేను వశీ

భూతములై చెలగె నీకు, భువిపై సట్కా

ఘూతమున నిప్పు, నీరును

నేతఱి మఱి యుప్పతిల్లె నీశ్వర! సాయీ! (సా.శ – 107)

సాయికి పంచభూతాలు వశీభూతాలై ఉంటాయి. సాయి చేతిలో ఎప్పుడూ ఒక సట్కా ఉంటుంది. దానితో భూమిపై ఒకసారి కొడితే నిప్పు, మరోసారి కొడితే నీరు వస్తాయి. ఇదేలా సాధ్యమని కవి సంశయం. నాల్గవ పాదంలో ద్విప్రాస లోపింప చేసి కవి తన సంశయానికి బలం చేకూర్చాడు.

నీ నామోచ్చారణమున

నానా బాధావ్యథాళి నాశమునొందన్

నూనమ్ముగ, సంపదలన

నూనమ్ముగ గల్గజేయు మోయీ! సాయీ! (సా.శ – 63)

భగవన్నామ స్మరణలో భక్తుల బాధలు నశిస్తాయి. సంపదలు కల్గుతాయి. ఇందులో ఎటువంటి సంశయం లేదు. పై పద్యంలో రెండవ పాదంలో ద్విప్రాస నశింపచేశాడు. ఈ ద్విప్రాసలోపం 'నానా బాధావ్యథాళి నాశమునొందన్' అనే భావాన్ని చక్కగా అభివ్యక్తీకరిస్తుంది. సాయి శతకంలోని 39, 131 సంఖ్య గల పద్యాలలో కూడా ద్విప్రాసలోపం ఉంది.

సాయిశతకంలోని కంద పద్యాలు వివిధ గతుల్లో నడుస్తాయి. కోమల పదాలు వాడబడ్డాయి. శబ్దాలంకార యుక్తంగా ఇందులోని పద్యాలున్నాయి.

నీవున్న చోట లేమికి

తావుండదు నిక్కువముగ తామరసాక్షా!

చావున్న వాడెవండును

నీవున్నటులుండ డిలను నిక్కముసాయీ! (సా.శ – 13)

'ఒక పద్యంలో గతి ఇంపుగా కనబడాలంటే ఆ పద్య పాదాలలోని గణాలు ఒకే విధమైన కూర్పును కలిగి ఉండాలి. అలాకాక 1,3 పాదాలొక రకంగా 2,4 పాదాలొకరకంగా ఉన్నా కూడా ఇంపుగానే ఉంటుంద'ని గిడుగు సీతాపతి గారు పేర్కొన్నట్లు పై పద్యంలో పూర్వార్థం, ఉత్తరార్థాలలో ఒకే విధమైన గణాలు ప్రయోగింపబడి పద్యానికి సొగసును ఆపాదించాయి.

ఏ యాలయమునసైనను
నీయాకృతి మానసమున నిల్చుట చేతన్
నీయాలయ మనిపించును
నా యాత్మను నిన్నె తలతు నమ్ముము సాయీ! (సా.శ – 76)

పై పద్యంలో కూడా పూర్వార్థం, ఉత్తరార్థాలలో ఒకే విధమైన గణాలు ప్రయోగింపబడ్డాయి.

సుధాకర్ వైష్ణవ సంప్రదాయంలో పెరిగాడు. తర్వాత సాయి భక్తుడయ్యాడు. మహావిష్ణువు సహస్రనామ స్తోత్రాలలోని కొన్ని నామాలను సాయికి విశేషణాలుగా ప్రయోగించాడు. శ్రీ పాద, శ్రీ వల్లభ, శ్రీ నరసింహ సరస్వతి, వేదవేద్య, తామర సాక్షా, తోయజనేత్ర, శేషశాయీ, యేకో నారాయణుండ, కన్నయ్య, వనమాలీ, నళిన దళాక్షా, పరమాత్మ, సామజవర సంరక్షక మొదలైన విశేషణాలు సాయిని కీర్తించే క్రమంలో ప్రయోగించాడు. వైష్ణవమత ప్రభావం ఈ శతకంపై ఉందని భావించవచ్చును.

4.3 శ్రీ తోగు వేంకటేశ శతకం:

ఒక్క పరి తల్లివై గాతు వోర్పు మీఱ
నొక్క యెడ తండ్రివై ప్రోతు వో ముకుంద
యెప్పుడేమౌదువో యెవ్వరెరుగలేరు
సంకట వినాశ! శ్రీ తోగు వేంకటేశ! (తోగు – 1)

ఇది తోగు వేంకటేశ శతకంలోని మొదటి పద్యం. దైవాన్ని తల్లిగా, తండ్రిగా భావించాడు. మొదటి పాదంలో 'ఓర్పు' పదం గమనార్హం. సహజంగా స్త్రీలు సహనశీలురు. తల్లికి ఉండే ఓపిక ఎవరికీ ఉండదు. భగవత్ తత్వాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. ఒకసారి తల్లిగా, మరోసారి తండ్రిగా, ఇంకోసారి మిత్రునిగా దర్శనమిస్తాడు.

అవసరమైతే కొన్ని సందర్భాలలో శత్రువుగా కూడా ఉంటాడు. ఈ విధంగా ఈ పద్యం మూడవపాదంలో ఎంతో భావ విస్తృతి ఉంది. ఇందులోని ఇంద్రగణాలన్నీ పంచమాత్రాగణాలు. మకుటంలోని ప్రాసయతిని మినహాయిస్తే దీన్ని అచ్చమైన తేటగీతికి ఉదాహరణగా చెప్పవచ్చు. పై పద్యంలో మొదటి రెండు పాదాల్లోనూ ఒకే రకమైన గణాలను ప్రయోగించి తల్లిదండ్రులకు ఏ మాత్రం భేదం లేదని ఛందశ్శిల్పం ద్వారా తెలియచేశాడు. అంతేకాకుండా మొదటి రెండు పాదాల్లోని ప్లుతయతి ఈ విషయాన్నే దృఢ పరుస్తుంది.

శేషశయ్యను శయనించి చింతలేక

దొంగనిద్దుర వోయెడి దొరవు నీవు

మమ్ముఁ బ్రోచుట బొత్తిగా మరచినావొ? (తోగు –4)

ఈ విధంగా ఇందులోని పద్యాలు వైదర్భీరీతిలో భావక్లిష్టతకు తావివ్వకుండా సాగిపోతాయి. సున్నితమైన వ్యంగ్యం, హాస్యం, వ్యాజస్తుతి ఈ శతకంలోని పద్యాలలో కన్పిస్తుంది. శేషశయ్యపై చింతలేకుండా పడుకుంటాడు శ్రీ మహావిష్ణువు. నిద్రపోయేవాన్ని లేపవచ్చు. కాని దొంగ నిద్దుర పోయేవాన్ని ఎవరూ లేపలేరు. అలా నిద్ర (దొంగనిద్ర) పోతే, 'మామొర ఎవరు ఆలకిస్తారు, తగిన వరాలు ఎవరిస్తారు' అని కవి ఆవేదన. 'దొంగ నిద్దుర వోయెడి దొరవు నీవు' అనగానే పాండవోద్యోగంలోని శ్రీకృష్ణుడు గుర్తుకు వస్తాడు. తిరుపతి వేంకటకవుల 'బావా! ఎప్పుడు వచ్చితీవు' అనే పద్యం గుర్తు కొస్తుంది.

ధర్మరక్షణ అంటే అర్థం వివరించే విధంగా కొన్ని పద్యాలు ఈ శతకంలో ఉన్నాయి.

భక్తులందరి నెప్పుడు బాధవెట్టు

శక్తియుక్తులు గల్గిన శౌరివీవు

ధర్మరక్షణ గావించు దారిదేమొ? (తోగు – 12)

మొదటి రెండు పాదాలలో భగవంతుని గుణగణాలను వర్ణించి మూడవపాదంలో కవితాత్మకంగా సమాధానపరచడం ఈ శతకంలో కనిపిస్తుంది. భగవంతుడు భక్తులను బాధపెట్టేది ధర్మరక్షణ గావించటానికనే ధర్మసూక్ష్మం ఈ పద్యంలో చెప్పాడు.

సుధాకర్ తన పొగడ్తలతో భగవంతున్ని పైకెత్తగలడు, సున్నితమైన మందలింపుతో కిందికి దించగలడు. ఇంతకు ముందు ఎవరూ చెప్పని భావాలు చెప్పటం స్వతస్సిద్ధంగా

ప్రతిభ ఉన్న వాళ్ళకే సాధ్యం. కింది పద్యం చూస్తే భగవంతున్ని ఎంత అమాయకంగా చిత్రించాడో తెలుస్తుంది.

మానవులలోన దాగిన దానవులను
మట్టుబెట్టగ లేని యమాయకుడవు
సాయమొనరింపగలవు కసాయికైన (తోగు –51)

ఎవరినైనా వారి ప్రవృత్తిని బట్టి ఇతడు మంచివాడు, ఇతడు చెడ్డవాడు అని చెప్పవచ్చు. రాక్షసుల ప్రవృత్తిని బట్టి రాక్షసులను సులువుగా గుర్తించవచ్చు. కాని పైకి మంచివాళ్ళుగా కనిపించే దుష్టమానవుల ప్రవృత్తిని తెలుసుకోవడం కష్టం. 'కసాయికైనా సాయపడే గుణం దైవానికే ఉంటుంది' అనే భగవత్ తత్త్వం ఇందులో ఉంది.

ఈ శతకంలోని భాష సరళసుందరంగా, పండితపామర జనరంజకంగా ఉంటుంది. సుధాకర్ కు భాషా జ్ఞానం ఎక్కువ. సందర్భానికి తగిన పదాలను ఎన్నుకోవడంలో నిష్ణాతుడు.

మాటిమాటికి రూపాలు మార్చినట్లు
మానసము మారనీకుమా! మారజనక!
పుండరీకాక్ష! నతభక్త పుండరీక! (తోగు –20)

ఈ పద్యంలో 'మారజనక' అనే విశేషణం శ్లేషగా ప్రయోగించాడు. మరుడు అంటే మన్మథుడు, మారటం అంటే మార్పు చెందటం, అవతారాలెత్తే క్రమంలో శ్రీ మహావిష్ణువు రూపాలు మారినాడు. కాని మనసు మారలేదు. అంటే ఏ అవతారంలోనైనా దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఖచ్చితంగా ఉంటుంది. అది మారదు. అదే భగవత్తత్త్వం. ఈ విధంగా శిష్టరక్షణ ధర్మాన్ని భగవంతుడు మరువరాదని కవి విన్నపం.

భగవత్ తత్వాన్ని తెలియచేయటం కోసం, ధర్మరక్షణ కోసం భగవంతుడు ఏ రూపాన్నైనా ధరించడానికి వెనుకాడడు. ఆ విషయాన్ని మూడు పాదాలలో ముచ్చటగొలిపే విధంగా చెప్పిన పద్యం కిందిది –

ఒక్కచో మోహనాకృతి యొక్కయెడను
వికృత భీకర రూపము, వెదుకనీక
వేనవేలుగ వేసాలు వేయుసామి! (తోగు –44)

క్షీరసాగర మథనం జరిగిన తర్వాత అమృతం పంచేందుకు మోహినీ రూపంలో అవతరించాడు శ్రీ మహావిష్ణువు. దేనికి ఎవరు అర్హులో నిర్ణయించడం భగవంతుని విధి. అమృతం తీసుకోవటానికి దేవతలు మాత్రమే యోగ్యులు. అందుకే మోహినీ అవతారం ద్వారా దేవతలకు అమృతాన్ని పంచాడు. మోసగాళ్ళను మోసంతోనే జయించాలనే సూక్తి ఈ అవతారంలో ఉంది. ఇందులో ప్రస్తావించబడిన రెండవ అవతారం భీకరరూపము నృసింహస్వామికి సంబంధించింది. భక్త ప్రహ్లాదున్ని రక్షించడానికి ఎత్తిన అవతారం నరసింహావతారం. సూక్ష్మంగా పరిశీలిస్తే 'మనల్ని నమ్ముకున్నవాళ్ళను నట్టేట ముంచరాదు' అనే విషయం ఈ అవతారాలన్నింటి సారాంశం.

పేరు లేనట్టి వాడని పేరుకెక్కి

రూపమే లేనివాడని రూఢినొంది

నాస్తికుల నాయకుడవైతి నలిననాభ! (తోగు –63)

అంటూ భగవంతున్ని నాస్తికులకు కూడా నాయకున్ని చేయగలిగిన ప్రతిభాశాలి సుధాకర్. 'దేవుడు లేడు, వాడికి ఏ రూపం లేదు' అనేది నాస్తికుడి వాదన. తన వాదనలో భాగంగా భగవంతున్ని తనకు తెలియకుండానే పదే పదే స్మరిస్తుంటాడు నాస్తికుడు. ఇది కూడా ఒక విధమైన భక్తే అని పై పద్యంలోని సారాంశం.

ఈ శతకంలో అటు విశిష్టాద్వైతానికి, ఇటు అద్వైతానికి సమానమైన ప్రాధాన్యాన్నిచ్చాడు సుధాకర్.

ప్రణవ రూపుండవౌ పరబ్రహ్మ మీవె

వేదములు నీవె సత్యమౌ విద్యనీవె

నిర్మలుడ వీవె జగముల మర్మమీవె (తోగు –65)

ఇందులోని మొదటి రెండు పాదాలు అద్వైతానికి చెందినవి కాగా, మూడోపాదం విశిష్టాద్వైతానికి చెందింది.

యతిస్థానంలో క్రియను గానీ, సంబోధనను గానీ ప్రయోగించడం సుధాకర్ కెంతో ప్రీతి.

కరుణతో నిండినట్టి క్రీగంటి చూపు

నిముసమైనను నాపైన నిలుపుమయ్య

నీదయా పాత్రుడను గాన నీలగాత్ర (తోగు –3)

ఇందులో యతి రెండవ పాదంలో క్రియగా, మూడవ పాదంలో సంబోధనగా ఉంది. మూడవ పాదంలో 'కాన' అనే పదం 'కాబట్టి' అనే అర్థంలో అవ్యయంగాను, 'కాదా' అనే అర్థంలో నిశ్చయార్థకంగానూ ప్రయుక్తం. ఇందులో 'నిముసమైనను' అనే పదం పరిశీలించదగింది. ఈ పదం కవికి అన్వయించుకుంటే 'భగవంతుని కృప క్షణకాలమున్నా సరిపోతుంద'నే అర్థం వర్తిస్తుంది. భగవంతునికి అన్వయించుకుంటే 'జన్మజన్మలలోనూ నా రక్షణ భారం నీదే' అనే అర్థంలో ప్రయుక్తం. ఎలాగంటే ''కృత, త్రేత, ద్వాపర, కలియుగాలు కలిసి మొత్తం 43 లక్షల 20 వేల సంవత్సరాలు అవుతాయి. దీన్ని మహాయుగమంటారు. ఇలాంటి 71 యుగాలు కలిసి ఒక మన్వంతరం అవుతోంది. ఇలాంటి మన్వంతరాలు బ్రహ్మదేవుడికి ఒక పగలు అవుతుంది (432,00,00,000 సంవత్సరాలు). ఇది ఉదయ కల్పం కాగా ఇంతే పరిమాణమున్న క్షయ కల్పం (రాత్రి) – గడిస్తే బ్రహ్మకు ఒకరోజు''[46] ఈ లెక్కన ఇంచుమించు ఒక నిమిషమంటే ఒక లక్ష సంవత్సరాలు అవుతుంది.

ఈ శతకంలో కోమలమైన పదాలు, పదబంధాలు, పలుకుబడులు, సంబోధనలు మనోహరంగా, వీనులవిందుగా ఉంటాయి. ఉదాహరణకు

శరణు వేడితి గను నన్ను కరుణతోడ (తోగు – 13)
చిక్కులను విప్పుమిక నాకు దిక్కునీవె (తోగు – 17)
దోసిలొగ్గితి నింక నా దోసమేమి (తోగు –20)
స్మరణసేయగ నీదిన మరణమేల (తోగు –27)
పిలిచినంతనె పల్కెడు పిచ్చితండ్రి (తోగు –38)
చల్లనయ్యవు ననుగావు నల్లనయ్య (తోగు –40)
వేనవేలుగ వేసాలు వేయుసామి (తోగు –44)
సాయమొనరింప గలవు కసాయికైన (తోగు –51)
జాడ తెలియని గారడివాడవీవు (తోగు –57)
నాటకమ్ముల నడిపించు నటకిశోర (తోగు –58)

[46] హెచ్. ఎస్. బ్రహ్మానంద, వర్ణన రత్నాకరం. 8వ సంపుటం. పుట – 30

మన్ను దిన్నట్టి నీ నోరు మఱతురెవరు (తోగు –59)

భారతము దేల్చె నీదు బండారమంత (తోగు –61)

బజ్జుకుంటివి మఱ్ఱాకు పడకపైని (తోగు –70)

రాలగరగించు నీ దివ్య రాగమహిమ (తోగు – 100)

మొదలైన శ్రవణ శుభగత్వాన్ని కలుగజేసే పంక్తులెన్నో ఈ శతకంలో ఉన్నాయి. ఈ శతకంలో తోగు వేంకటపురికి సంబంధించిన వర్ణనలు రెండున్నాయి.

ఏడు కొండలు దిగివచ్చి యింపుమీర

తోగు వేంకటపురి మఱ్ఱి తొఱ్ఱజేరి

చింతచెట్టునె ధ్వజముగ జేసుకొంటి, (తోగు –53)

తిరుపతిలోని ఏడుకొండలు దిగివచ్చి తోగు వేంకటపురిలోని మఱ్ఱి తొఱ్ఱలో వెలసినవాడు తోగు వేంకటేశుడు. తోగు వేంకటపురిలోని వాతావరణం కింది పద్యంలో తెలిపాడు.

ఊయలలనూగదగు మఱ్ఱియూడలుండె

వాగు నీ చుట్టు ప్రవహింపసాగుచుండె

నందమైనట్టి ప్రకృతి నానందమందు (తోగు – 24)

సుధాకర్ తోగు వేంకటపురిని 'దర్శించకుండా'[47] ఇంత మధురంగా రాశాడంటే, చూసి ఉంటే అక్కడి వింతలు ఇంకా ఎన్ని దర్శింపచేసేవారో. ఈ పద్యంలో తోగు వేంకటపురి వైకుంఠంగా భాసిస్తుందని ధ్వని పూర్వకంగా తెలియచేశాడు. ఇందులోని 'వాగు' పాల సముద్రాన్ని తలపిస్తుంది. 'ఊయలలూగడం' మహా విష్ణువుకు ఇష్టమట. 'పాల సముద్రంపై శేషతల్పం, అలలకు ఊయలలాగా ఊగుతుందిగా' అదే విషయం ఇక్కడ సూచితం. అదే విధంగా చిన్ని కృష్ణుడికి మఱ్ఱాకు పడకపై పడుకోవడం ఎంతో ఇష్టం.

నీదు సాయమె లేకున్న నిశ్చయముగ

పరమబలవంతులా పంచపాండవులును

కౌరవుల గెల్చుటన్నది కల్లగాదె? (తోగు – 43)

[47]సుధాకర్ తోగు వేంకటపురిని దర్శించలేదని వారి ధర్మపత్ని తిరువరంగం పద్మాలయగారు తెలియచేశారు.

శ్రీకృష్ణుడికి, పాండవులకు మధ్య ఉన్న అనుబంధం ఇందులో వర్ణించాడు. రెండవ పాదంలోని ప్లుతయతి పాండవుల బలానికి బలాన్ని చేకూరుస్తుంది. ఇందులో 'నిశ్చయముగ' అనే పదం గమనించదగింది. అది ఇటు కృష్ణుడికి, అటు పాండవులకు అన్వయింపబడింది.

నీదు సాయమె లేకున్న, నిశ్చయముగ
పరమబలవంతు లా పంచపాండవులును
కౌరవుల గెల్చుటన్నది కల్లగాదె?

అంటే ఒక అర్థం. (కృష్ణుడి సాయం లేకుంటే పాండవులు కౌరవులను గెలిచేవారు కాదు)

నీదు సాయమె లేకున్న నిశ్చయముగ,
పరమబలవంతు లా పంచపాండవులును
కౌరవుల గెల్చుటన్నది కల్లగాదె?

అని చదివితే మరొక అర్థం స్ఫురిస్తుంది. (కృష్ణా! నీ సాయం లేకున్నా పాండవులు కౌరవులను గెలిచేవారు). ఇటువంటి చమత్కారమే జాషువా గబ్బిలం లోనూ ఉంది.

కులము లేని నేను కొడుకులఁ బుట్టించి
యీ యఖాతమందె త్రోయవలెనె
భార్య యేలఁ బుట్టుబానిసకనివాడు
జరుపసాగె బ్రహ్మచర్య దీక్ష (గబ్బిలం)

ఇందులో 'భార్య యేల, పుట్టు బానిసకనివాడు' అని చదివితే ఒక అర్థం. 'భార్య యేల పుట్టు, బానిసకనివాడు' అని చదివితే ఒక అర్థం స్ఫురిస్తుంది.

తులువ యొక్కడు పాంచాలి వలువలొలువ
నిండు భక్తిని నిలుచుండి నిన్ను బిలువ
కరుణతో నమ్మహాసాధ్విఁ గాచినావు (తోగు – 42)

అనే పద్యంలో కృష్ణుడికి, ద్రౌపదికి మధ్య అనుబంధం తెలుపబడింది. ఇది కూడా ఇంచుమించు పై చమత్కారం లాగే ఉంది. 'కరుణతో అమ్మహాసాధ్విఁగాచినావు' అంటే ఒక అర్థం, 'కరుణతో నమ్మ, హా, సాధ్విఁగాచినావు' అంటే ఒక అర్థం స్ఫురిస్తుంది.

ఈ శతకంలో ప్రాసయతులు విరివిగా ప్రయోగించాడు సుధాకర్. శతకం యొక్క మకుటం ప్రాసయతితో కూడుకొని ఉంది (సంకట వినాశ! శ్రీ తోగు వేంకటేశ!). ఈ శతకంలోని యతి, ప్రాసయతి ప్రయోగాలను పరిశీలించినట్లైతే

1. పూర్వార్ధం యతి, ఉత్తరార్ధం ప్రాసయతి ప్రయోగం గల పద్యానికి ఉదాహరణ

గొల్లపిల్లల యుల్లముల్ గొల్లకొనిన
నాటి యల్లరి మరువ మేనాటికైన
నేటికిని లేదు చూడు నీబోటివాడు (తోగు – 60)

అనే పద్యంతో పాటు తోగు వేంకటేశ శతకంలోని 13,16,28,40,65,88 సంఖ్య గల పద్యాలను ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. గొల్లపిల్లల హృదయాలను ఆకర్షించాడు కృష్ణుడు. ఇక్కడ 'గొల్ల పిల్లల' అనే పదాన్ని శ్లేషగా ప్రయోగించాడు. 'గొల్ల పిల్ల' లంటే గోపాలబాలురు అని ఒక అర్థం, గోపికలు అని ఒక అర్థం. ఒకే పదం పుంలింగం, స్త్రీ లింగం రెండుగా ప్రయోగించబడటం విశేషం. అలంకారయుత రచన ఉన్నా అలంకారాలున్నట్లు కనిపించదు సుధాకర్ రచనలో. ఇదొక చమత్కారం. అల్లరిలోను, ఆటపాటలలోనూ కృష్ణుడికే అగ్రతాంబూలమిచ్చాడు సుధాకర్.

2. బేసి పాదాలలో యతి, సరి పాదాలలో ప్రాసయతి ప్రయోగం గల పద్యానికి ఉదాహరణ.

దేవతలలోను నిను బోలు తెలివితేట
లున్నవారలు నిజముగ సున్నగాన
సాగుచుండె నీ యాటలు చక్కగాను (తోగు – 56)

అదే విధంగా తోగు వేంకటేశ శతకంలోని 4,49,91,92 సంఖ్యగల పద్యాలను ఇందుకు మరికొన్ని ఉదాహరణలుగా చెప్పవచ్చు.

3. 1,2,4 పాదాలలో ప్రాసయతి ప్రయోగానికి ఉదాహరణ

ధరణి చాపగఁ జుట్టిన కరణి మున్ను
గొని హిరణ్యాక్షు డంబుధిఁ జనినయపుడు
వాని జంపితి కిటివయి, వనజనాభ (తోగు – 30)

4. 1,3,4 పాదాలలో ప్రాసయతి ప్రయోగానికి ఉదాహరణ

తోలు కన్నుల నినుజూడ జాలరెవరు
జ్ఞాన నేత్రమ్ముతో జూడగలరు గాని
వేడగల మేమొ గాని నిన్న జూడలేము (తోగు –32)

అదే విధంగా 17,57 సంఖ్యగల పద్యాలను కూడా వీటికి ఉదాహరణగా చెప్పవచ్చు.

5. 2,3,4 పాదాలలో ప్రాసయతి ప్రయోగానికి ఉదాహరణ

వ్యాస భగవానుడే నీదు భాగవతము
బైట బెట్టిన దిట్టరా! కైటభారి!
భారతము దేల్చె నీదు బండారమంత (తోగు – 61)

అదే విధంగా తోగు వేంకటేశ శతకంలోని 18వ పద్యాన్ని మరొక ఉదాహరణగా చెప్పవచ్చు. భారత, భాగవతాలపై క్షుణ్ణమైన అవగాహన ఉంటే తప్ప ఇటువంటి పంక్తులు గల రచన సాధ్యం గాదు. కృష్ణుని లీలలు అనేకం. పుట్టింది ఒకచోట, పెరిగిందొక చోట. చెప్పేదొకటి, చేసేదొకటి. ఈ లీలలన్ని భగవత్ తత్త్వంలోని భాగాలే.

ఈ శతకంలో సుధాకర్ ఎక్కువగా పదగత గణాలు వాడి తేటగీతి పద్యాలకు సొగసును చేకూర్చాడు. గజేంద్ర మోక్షం కథను రెండు పాదాలలో చెప్పే ప్రయత్నం చేశాడు కింది పద్యంలో.

మొసలి వట్టంగ నేనుంగు మొత్తుకొనగ
నెడద గరుగంగ గజరాజు నేలినావు
భక్త వత్సలుడను పేరు వడసినావు (తోగు– 41)

ఇందులో పూర్వార్థంలో పదగత గణాలు వాడబడ్డాయి. సాధారణంగా 'పూర్వార్థాలు పదగతంగా ఉంటే సొగసు ఉంటుంది తేటగీతికి'.[48] ఇందులోని పూర్వార్థం పదగతంగా ఉండటంతో పాటు ఇంద్రగణాలు పంచమాత్రా గణాలు కావడం వల్ల ఈ పద్యం మరింత శోభాయమానమైంది.

[48]సంగన భట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రారంభవికాస దశలు. పుట – 479

'పాదాంత విచ్ఛేదం వల్ల తేటగీతి పాద ప్రమాణము పాఠకుని మనస్సును ఆకట్టుకుంటుంది.[49] తోగు వేంకటేశ శతకంలోని చాలా పద్యాలు పాదాంత విచ్ఛేదంతో నడిచాయి.

నేను మ్రొక్కని దేవుడీ నేల లేదు
చూడగా నీవు లేనట్టి చోటు లేదు
మ్రొక్కు చేతుల నఱకుటే మోజు నీకు (తోగు -9)

'శ్రీనాథుని నైషధములోని తేటగీతులు ముప్పాతిక మువ్వీసము పాదాంత విచ్ఛేదమును పాటించి నూతన పదముతో తర్వాతి పాదారంభమును గావించినవే.'[50] పై పద్యం వలెనే తోగు వేంకటేశ శతకంలోని చాలా పద్యాలు పాదాంత విచ్ఛిత్తిని కలిగి పాఠకుడి మనస్సును ఆకట్టుకుంటాయి.

4.4. సరస్వతీ శతకం:

సరస్వతీ శతకంలోని పద్యాలు ధారాశుద్ధితో నడుస్తాయి. సులువుగా ధారణకు నిలుస్తాయి.

ఆగదు కాలచక్రమెపు డాయువు నట్టిదె, విద్యయే మహా
సాగరమయ్యె నీదుటకు సాధనసేయ తెఱంగెఱుంగకన్
సాగిలి మ్రొక్కుచుంటిని కసాయి తనంబును వీడు మమ్మరో
దాగుడు మూతలాడకుము ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 32)

ఈ పద్యంలో కవి ఒక వైపు జీవితాన్ని మరో వైపు విద్యను దర్శించిన విధానం తెలుస్తుంది. మొదటి పాదంలో జీవితాయుష్షును, రెండవ పాదంలో విద్యను, మూడవ పాదంలో సరస్వతీ దేవికి కవి విన్నపం వివరించబడింది. పద్య నిర్మాణ పరంగా కూడా కవి శిల్పాన్ని ప్రదర్శించాడని చెప్పవచ్చు. ఎలాగంటే

ఆగదు కాలచక్రమెపుడాయువు నట్టిదె– ఒక చిన్న వాక్యం.

విద్యయే మహాసాగరమయ్యె నీదుటకు సాధనసేయ తెఱంగెఱుంగకన్ – అనేది పై దాని కంటే పెద్ద వాక్యం.

---

[49]సంగన భట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రారంభవికాస దశలు. పుట – 479

[50]సంగన భట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రారంభవికాస దశలు. పుట – 479

సాగిలి మ్రొక్కుచుంటిని కసాయితనంబును వీడు మమ్మరో దాగుడు మూతలాడకుము– అనే తన విన్నపం రెండవ వాక్యం కన్నా పెద్దది.

'జీవితం ఎంత చిన్నది అయినా నిరంతర అధ్యయన శీలి కావాలి' అనేది పద్య శిల్పం ద్వారా సుధాకర్ పరోక్షంగా చేస్తున్న హితబోధ. ఎట్టిన లాగా క్రియాపదంతో పద్యాన్ని మొదలుపెట్టడం, 2,4 పాదాలలో యతి స్థానానికి ముందు విరుపులు, 4వపాదంలో యతిస్థానంలో మకుటం ప్రయోగించి విలక్షణతను ప్రదర్శించాడు.

ధూర్జటి రచించిన 'శ్రీ కాళహస్తీశ్వర శతకం', కంచర్ల గోపన్న 'దాశరథి శతకం', దాశరథి కృష్ణమాచార్యులు 'అభినవ దాశరథి శతకం', శ్రీశ్రీ 'సిరిసిరి మువ్వ శతకం', పట్టమెట్ట పాపకవి 'గౌరీ రమణ శతకం', పూసపాటి వీరపరాజు 'చిరుత వజీరు శతకం', కొటికల పూడి కోదండరామకవి 'జానకీ వల్లభ శతకం', 'వేణు గోపాల శతకం', జూలూరి అప్పయ్య 'యదువంశ భూషణ శతకం', పత్రి రమణప్ప కవి 'వేంకట రమణ శతకం', కన్న శతకం (అజ్ఞాత కర్తృత్వం), తిరువరంగం సుధాకర్ 'సరస్వతీ శతకం', కసిరెడ్డి వెంకట్ రెడ్డి 'కర్మణ్ ఘాట్ ఆంజనేయ శతకం', కావూరి పాపయ్య శాస్త్రి 'విశ్వనాథ శతకం' జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు 'రామలింగేశ్వర శతకం' మొదలైన శతకాలలో యతి స్థానంలో మకుటం ప్రయోగించబడింది.

ధూర్జటి రచించిన శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని ఒక పద్యాన్ని తీసుకున్నట్లైతే

జలకంబుల్ రసముల్ ప్రసూనముల వాచా బంధముల్ వాద్యముల్
కలశబ్ద ధ్వనులంచి తాంబరమలంకారంబు దీప్తుల్ మెఱుం
గులు నైవేద్యము మాధురీ మహిమగా గొల్తు నిన్నున్ భక్తి రం
జిల, దివ్యార్చన గూర్చినేర్చిన క్రియన్ శ్రీకాళహస్తీశ్వరా!

దీనిలో యతిస్థానంలో మకుటం వచ్చింది. అంటే శ్రీకాళహస్తీశ్వర శతకంలో ప్రతిపద్యం నాలుగవ పాదం మొదటి అక్షరం – 'శ్రీ' తో యతిమైత్రిగల చ,జ,శ,స,ర లలో ఏదో ఒకటి కావాలి. ఇదొక చమత్కారం. ఇందులో కవి పాండిత్యం గోచరమవుతుంది.

అదే విధంగా కంచర్ల గోపన్న రచించిన దాశరథి శతకంలోని ఒక పద్యాన్ని పరిశీలించినట్లైతే

రంగదరాతి భంగ, ఖగరాజ తురంగ, విపత్పరం పరో
త్తుంగ, తమః పతంగ, పరితోషిత రంగ, దయాంత రంగ, స
త్సంగ, ధరాత్మజా సారసభృంగ, నిశాచరాబ్జ మా
తంగ, శుభాంగ భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ!

యతిస్థానంలో 'దా' ఉండటం వల్ల నాల్గోపాదం మొదటి అక్షరం త,థ,ద,ధ,న లే రావాలి. పైన పేర్కొన్న మిగిలిన శతక పద్యాలకు ఇదే విధంగా అన్వయించుకోవచ్చు. వీటికి మరికొన్ని ఉదాహరణలు అనుబంధంలో చూడవచ్చు.

చిత్తము చంచలమ్ము మది చింతలు బోలెడు నెల్లవేళలన్
నెత్తిన నెన్నొ బాధ్యతలు నీరజ లోచన యేమి సెప్పుదున్?
పొత్తము పట్టినన్ జదువ బుద్ధియె పుట్టదు విద్యనింతయున్
దత్తము చేయవెందులకు? ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 33)

'చిత్తము చంచలమైనది, మదిలో ఎప్పటికీ ఏవేవో ఆలోచనలు, వాటికి తోడు బాధ్యతలెన్నో ఉండటం వల్ల చదవటానికి ఏకాగ్రత కుదరదు.' అందరూ ఎదుర్కొనే ఈ సమస్యను పద్యంగా మలచడం అద్భుతం. ఈ పద్యంలో భావాభివ్యక్తికి తగినట్లు మూడవపాదంలో పదగత గణాలు ప్రయోగించబడ్డాయి. వృత్తాలలో ఇటువంటి 'పదగత గణాల రచన చాలా కష్టంతో కూడుకున్న పని' అని సంగనభట్ల నరసయ్య గారు 'తెలుగులో ఛందో వైవిధ్యం' అనే లఘు సిద్ధాంత గ్రంథంలో తెలియచేశారు.

అలఘు తపస్సమాధి నియతాత్ములకున్ బహుపుణ్య లోకకాం
తులకు, విశుద్ధ మానసులకున్ సతతంబును సంశ్రయంబవై
లలిత నిలింప దంపతి విలాస విహార మహోత్సవంబులున్
గలిగి వెలుంగు రత్నమయి కందర సుందర! మందరాంచలా!

–(భారతం – సభాపర్వం)

అనే నన్నయ పద్యంలో కూడా మూడవ పాదంలో పదగత గణాలు వాడబడ్డాయి.

వాసర వాసినీ! విమత వాది హృదంతర వర్తమాన గ
ర్వాసుర నాశినీ! సుగుణ వన్నుతి నిర్మల కౌముదీ యశో

భాసుర హాసినీ! వినతి భాసిత మానస తావకీన స
ద్దాస సుహాసినీ! సురమతల్లి! జగజ్జననీ! సరస్వతీ! (సర – 11)

వంటి పద్యాలలో మాదిరిగా దీర్ఘసమాస రచన చేయడంలోనూ సుధాకర్ ది అందెవేసిన చేయి.

సుధాకర్ కవిత్వంలో యతిప్రాసల కోసం ప్రాకులాటలు, బెండు మాటలు, వ్యర్థ పద వాగాడంబరం ఎక్కడా కనిపించదు.

జపములు సేయలేక నిను సాధన జేయగ శక్తి లేక యే
తపముల సేయలేకయును దానము లీయగలేక భాస్కరా
తపము సహింపలేక జలధమ్ముల ధాటికి తాళలేక, నీ
యుపకృతి గోరినాడ ననునోర్చుకొనందగునో సరస్వతీ! (సర – 16)

ఇందులో 'లేక' అనే పదం పలుమార్లు ఆవృతమైనా వ్యర్థపదంలా అనిపించదు. అంతేకాకుండా ఈ పదమే పద్యానికి మరింత వన్నెను తీసుకువచ్చింది. ఏదైనా ఒక విషయాన్ని నొక్కి చెప్పాల్సి వచ్చినప్పుడు ఇటువంటి పద్ధతినే అనుసరిస్తాం. తెలుగులో ఇది సహజం. అంతేగాకుండా ఈ పదం కవి యొక్క భక్తిని చక్కగా ప్రకటించింది.

4.2 రమ్య భావ తరంగాలు:

చాటు పద్యాలు: 'మనోవేదన' ఖండికలోని రెండు పద్యాలు చాటూక్తిని కలిగి ఉన్నాయి.

సత్యమున్వీడి తప్పుడు చరితలల్లి
న్యాయమార్గాను సారము నడువనుంటి
ధర్మ పద్ధతి దప్పుచు దనివినొంది
నన్ను బాధించు వారికి నాశనంబు (రమ్య – పుట 21)

ఛందశ్శాస్త్రంలో కొన్ని విశిష్ట స్థానాలలో నిషిద్ధ అక్షరాలను ఉంచితే అది అశుభాన్ని కలుగజేస్తుంది అంటారు. పద్యం యొక్క మొదటి పాదంలో 3-5-6-7-11 స్థానాలలో ''అకచటహ'' లేదా ''అకచతప'' అక్షరాలు ఉంచరాదంటారు. శాపానుగ్రహ కవిగా పేరుపొందిన వేములవాడ భీమకవి ఈ స్థానాలలో ఇటువంటి అక్షరాలను ఉంచి శపించేవారు. మరికొంత మంది చాటుకవులు కూడా ఈ పద్ధతిని అనుసరించారు. పై

పద్యంలో 6,7 స్థానాలలో 'త' కార, 'ప' కారాలను ప్రయోగించి కవి తన ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తున్నాడు. ఈ పద్యంలోని రెండవ పాదం సుధాకర్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

నా వచనము తప్పదికన్
పావక శరమట్టులరుల భగభగమనుచున్
చావక లేవక యుండెడు
నా విధమున గాల్చుగాత నతి శ్రీఘ్రముగన్ (రమ్య – పుట 21)

ఈ పద్యం పై పద్యం తర్వాత పద్యం. ఈ పద్యంలో కూడా 3,6,7 స్థానాలలో 'చ' కార, 'త' కార, 'ప' కారాలను ప్రయోగించాడు కవి.

ఆరవ అక్షరంగా 'త' కారముంచి పద్యం చెప్పినట్లైతే ఆ పద్య మెవరిని గూర్చి చెప్పబడిందో, వారికి కీడు కలుగుతుంది. దీనికి ఉదాహరణగా భీమకవి గాథ, అతని పద్యం[51]

'హయమది సీత పోత వసుధాధిపుఁ డారయ రావణుండు ని
శ్చయముగ నేను రాఘవుడ సహ్యజవారిధి మారుఁడంజనా
ప్రియతనయుండు, లచ్చన విభీషణుఁ డా గుడిమెట్టలంక నా
జయమును బోత రక్కసుని చావును నేడవనాడు చూడుడీ'.

అనేది ప్రసిద్ధము. ఇట్లే బడబానలభట్టు మొదలైన వారి గాథలు ప్రసిద్ధములు.[52]

'దగ్గు' అనే ఖండికలో దగ్గుపై ఒక పద్యాన్ని రాశాడు సుధాకర్.

దగ్గు పడిసెము లీరెండు దగినతోళ్ళు
దగ్గు పెరిగిన నా బాధ దారివేరు
దగ్గు లేసిన మేనిలో దగ్గుశక్తి
దగ్గు గోళీలు మ్రింగిన దగ్గుదగ్గు (రమ్య – పుట 31)

ఈ పద్యం సుధాకర్ కున్న హాస్య చతురతను తెలియచేస్తుంది. ఇది తేటగీతి పద్యం. దీనిలో ప్రాస ప్రయోగించబడింది. 'తేటగీతికి ఆది ప్రాసనియమం పాటించినట్లైతే అంతరాక్కర అవుతుంది.'[53] కాబట్టి దీన్ని అంతరాక్కర కూడా అనవచ్చు.

---

[51]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట - 281

[52]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట - 281

ఆశుపద్యాలు: రమ్య భావతరంగాలలో సుధాకర్ చెప్పిన కొన్ని ఆశుపద్యాలు కూడా ఉన్నాయి. ''బకమును గనినంత మత్తవారణమదిరెన్'' అనే సమస్యకు వారి పూరణిది

పకపక నవ్వరె లోకులు
బకమును గనినంత గజము భయపడునన్నన్
ఒక వనమున కేసరి శా
బకమును గనినంత మత్తవారణమదిరెన్ (రమ్య – పుట 31)

బకము అంటే కొంగ. కొంగను చూసి ఏనుగు భయపడటం సాధ్యం కాదు. కేసరి శాబకము అంటే సింహం. పై పద్యంలో 'శా' చేర్చడం ద్వారా సమస్యాపూరణ జరిగింది. 'సమర్థపదాలు ఏకపదంగా మారటం సమాసం. సమస్యా పూరణకు ముందు పాదంతో ఒక సమర్థ సమాసాన్ని కూర్చి పూరించడం ఒక కౌశలం.'[54]

''స్తనములు లేని పూరుషుడు సంస్తవనీయుడు గాడు ధాత్రిలో'' అనే సమస్యను కూడా సమాసం చేర్చడం ద్వారా పూరించాడు సుధాకర్.

వినగనె గల్గుసంతసము వీనుల కెప్పుడు గానమాధురిన్
కనగ కనంగ సమ్ముదము గల్గుచునుండును సాహితిన్సదా
మనమున నిర్మలత్వమును మంచిగ నిల్పెడు భారతీసతీ
స్తనములు లేని పూరుషుడు సంస్తవనీయుడు గాడు ధాత్రిలో

–(రమ్య – పుట 32)

సమస్యాపూరణతో పాటు 'సాహిత్యాన్ని సదా జ్ఞాపకముంచుకుంటే అది జీవితానికెంతో ఉపయోగపడుతుంది' అనే చక్కని ఉపదేశాన్ని కూడా ఇచ్చాడు ఈ పద్యం ద్వారా. దీనిలో 'భారతీ సతీస్తనములు' అని సమాస కల్పన జరిగింది. ఇదే సమస్యను రాజశేఖర వేంకట శేషకవులు

'అనువుగ సర్పమున్ శిశువునైన గరంచును గాన విద్య, భూ
జనులకు గల్గు మూఢతను సాహితి మాన్పెడి, నిన్వి వాక్సతీ

[53]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట - 260

[54]రాళ్ళబండి కవితా ప్రసాద్, అవధాన విద్య ఆరంభ వికాసాలు, పుట - 134

ఘనకుచ సన్నిభంబులనగా బుధులెంచెద, రటి శారదా
స్తనములు లేని పూరుషుడు సంస్తవనీయుడు గాడు ధాత్రిలో'

(అవధాన సారము)

అని పూరించారు. దీనినే పిశుపాటి చిదంబర శాస్త్రి గారీ విధంగా పూరించారు.

వినుము నరేంద్ర నామతము, వీనుల కింపులు నింప గంధమం
దును నవరత్నహారమును దోరపుమేన మనోజ్ఞమైన చం
దనమును బొజ్జయందు సుమనః ప్రకరంబును గేల గామినీ
స్తనముల లేని పురుషులు సంస్తవనీయులు గారు పృథ్విలోన్

బాలకృష్ణుని కేల వెన్నముద్దల వలె, పురుషుల కేల కామినీస్తనములుండ వలెనని కవిగారి మతమట.[55]

ఆకాశ వాణి వారిచ్చిన బంతి, దొంతి, మంతి, మెంతి పదాల దత్తపదికి సుధాకర్ పూరణ – కింది పద్యము.

బంతుల తోరణాలు దరువాజల బంగరు కాంతులీనగా
దొంతుల కుండల న్నిలిపి తోయజ నేత్రలు నోమునోచి చే
మంతుల మాలల న్దలల మంచిగ దాల్తురు కూరలన్నిటన్
మెంతుల కూరనింత కొతిమీరను వాడుదు రద్దినంబునన్

–(రమ్య – పుట 27)

అని సంక్రాంతి వర్ణన చేశాడు. సుధాకర్ కున్న కాలస్పృహ ప్రశంసనీయం. సంక్రాంతి కన్నా ముందే బంతులు, చేమంతులు పూస్తాయి. సాధారణంగా అన్ని పండగలకు మామిడాకుల తోరణాలు కడితే సంక్రాంతి పండక్కి మాత్రం బంతుల తోరణాలు కడతారు. ఇచ్చిన దత్తపదిని బహువచనాలుగా మార్చటం విశేషం. ఎందుకంటే సంక్రంతి ఒక్కరోజు పండుగకాదు.

పై పద్యాలను బట్టి సుధాకర్ కు ఆశుపద్య రచనలోనూ ప్రావీణ్యం ఉన్నదని చెప్పవచ్చు.

సుధాకర్ సీసపద్య రచనలోనూ తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

వారు రచించిన సీసం.

---

[55]సి.వి. సుబ్బన్న శతావధాని, అవధాన విద్య. పుట - 152

పేదరోగుల పాలి పెన్నిధానంబునై
పేరుమోసిన యట్టి మేరునగము
మండు వేసంగిలో మధురాంబువులఁ బోసి
జనుల దప్పిని నార్పు జహ్నుకన్య
వరద బాధితులకు వరదయై భాసిల్లి
కరుణతో కాపాడు కల్పతరువు
అంబేత్కరుని యాత్మ కానంద యొనగూర్పు
బహుమాన మనుసోపు బస్సుస్టాపు
సంఘసేవా పరాయణ స్వచ్ఛ హృదయ
వర్తనుల తోడ విలసిల్లి వ్యధిత మాన
సాంద్ర భూమాత కించుక సాంత్వనంబు
నందజేయుచు నుండె లయన్సు క్లబ్బు (రమ్య – పుట – 12)

అని వరంగల్ జిల్లాలోని తొర్రూరులో గల లయన్సు క్లబ్బును వర్ణించాడు. సాధారణంగా కవులు గొప్పవారిని, గొప్పవాటిని వర్ణించేటపుడు మేరు పర్వతంతో పోలుస్తారు. ఈ పద్యంలో 'మేరునగము' ప్రయోగం అర్థ విస్తృతి గలది. మేరుపర్వతంపై ఎన్నో ఔషధగుణాలు గల చెట్లుంటాయి. కాబట్టి లయన్సు క్లబ్బు పేదరోగులపాలిట పెన్నిధానం కావడంలో ఆశ్చర్యంలేదు. అదే ఇక్కడ సూచితం. జాహ్నవిని జహ్నుకన్యగా మార్చటం మరో విశేషం. ఈ పద్యంలో మొత్తం 28 పంచమాత్రాగణాలు, 3 మాత్రం చతుర్మాత్రా గణాలు ప్రయోగింపబడ్డాయి. ఇది ఖండగతి సీసం. పోతన రచించిన భాగవతంలోని 'మందార మకరంద మాధుర్యమున దేలు, మధుపంబు పోవునే మదనములకు' అనే ప్రఖ్యాతసీసం ఖండగతికి చెందినదే.

రమ్యభావ తరంగాలలోని పంచరత్నమాలలు తన సహోద్యోగుల పదవీ విరమణ సందర్భాలలో చెప్పినవి. వాటిని పరిశీలించినట్లైతే కావ్య రచనకు తగిన శక్తి నైపుణ్యాలు సుధాకర్ లో ఉన్నాయనిపిస్తుంది. ఈ పద్యాలలో 'మంగళాదీని', 'మంగళమధ్యాని', 'మంగళాంతాని' పాటించబడటం విశేషం.

4.6 లయాత్మకత:

సమాంతర కాలఖండముల పౌనఃపుణ్యము లయ అని నిర్వచించవచ్చు. 'తాళాంతరాళ వర్తీయః కాలోஃసౌలయ నాయకః' అని కోహలుడు లయకు అర్థము చెప్పాడు. 'తాళాంతర్గతమైన కాలము లయ' అని ఇందులోని అర్థం. 'లయఃసామ్యం' అని అమరకోశము సామ్యము చెప్పింది. లయ సహజమైనది. సంగీత శాస్త్రంలో లయ నుండి కళాధర్మంగా తాళము అభివృద్ధి చెందింది. [56]

''తెలుగు పద్యాల్లో పాదాంతంలోనూ, పాదమధ్యంలోనూ పదాలు విరిగి పోవడమనే అంశాన్ని నిర్లక్ష్యం చేయడం లయను మరింతగా గుప్తం/సుప్తం చేయటం కోసమే ననిపిస్తుంది. పాటల చరణాలలో ధ్వని సంపుటుల నియమనం, చరణాంత విరామం లయను అభివ్యక్తం చేయడానికే ఉద్దేశించబడ్డాయి. కాని పద్యపాదాలలో ధ్వని సంపుటుల అసమానత, గణాల పాటింపు నిరాకరణ (పాదంలోని ఏ గణానికాగణం విరిగి స్పష్టంగా ఉండకపోవడం) దృష్టిని లయనుంచీ, సంగీతం నుంచీ తప్పించడానికే ననిపిస్తుంది. సంస్కృతంలో పాదమధ్య, పాదాంత విరామాల ద్వారా లయను రక్షించే ప్రయత్నం కొంత జరిగింది. కాని తెలుగు వారు ఆ ప్రయత్నానికి అనుకూలంగా స్పందించలేదు. పూర్తిగా నిరాకరించనూ లేదు. విచక్షణాధికారం ప్రయోక్తలకే అప్పగించినట్టు కన్పిస్తుంద''[57]ని కోవెల సంపత్కుమారాచార్య గారు 'తెలుగు ఛందస్సులో వెలుగులు'' అన్న గ్రంథంలో తెలియచేశారు.

సుధాకర్ తన కవిత్వంలో లయాత్మకతకు ప్రాధాన్యమిచ్చినట్లు అనిపిస్తుంది. సుధాకర్ కొన్ని పద్యాలలో పాదమధ్య, పాదాంత విరామాల ద్వారా లయను సాధించాడు.

కలకలలాడు నీకనులు గల్వల వెల్వల బారజేయగా
తలతలలాడు నీ మెగము దామరలన్ ముకులింపజేయగా
గలగలలాడు హాసముల కాంతుల మల్లెలు తల్లడిల్లగా
మిలమిలలాడు చూడుకులు మీలనుమించె గదా! సరస్వతీ! (సర – 14)

[56]సంగన భట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రారంభవికాస దశలు. పుట - 72

[57]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-113.

ఈ పద్యంలో పాదమధ్య పాదాంత విరామాల ద్వారా లయ సాధించబడింది. పాదాదిలో ధ్వన్యనుకరణ పదాలు ఈ పద్యానికి మరింత శోభను తెచ్చాయి. మరొకటి

ఎచ్చటి దానవీవు మదిరేక్షణ నీ ముఖనీర జాతమున్
ముచ్చటగొల్ప తుమ్మెదల మూగిన వోయన కేశపాశమున్
అచ్చెరువంద జేసినది యావగలా సొగసావయారమున్
చిచ్చుగ జిమ్ముమార సరసీరుహ సాయకమాకృశోదరీ!

(రమ్య – పుట : 15)

ఈ పద్యంలో పాదాంత విరామం ద్వారా లయ సాధించబడింది.

లయ హీనమైనపుడు ఛందోబద్ధమైన రచనైనా వ్యర్థమే. గణాలకు సరిపడి ఉన్నను, పఠనములో ఏ శ్రావ్యతను సంతరించుకొనక నిరర్ధకమౌతుంది. [58]

అదేవిధంగా రమ్యభావ తరంగాలలోని గేయాలలో మాత్రాగణాలనుపయోగించి లయను సాధించాడు సుధాకర్. వీటిలో రగడల ఛాయలున్నాయి.

ఖండగతి: రమ్యభావతరంగాలలోని నా చెలీ, రైలెక్కాను, ప్రేమగీతి, ప్రకృతి–వికృతి అనే ఖండికలు ఖండగతిలో నడిచాయి.

'నా చెలీ' ఖండికలోని గేయం

''పాడవే ఒకపాట
నేను వీణియమీట
కోకిలల నోడించ కోరికల నూరించ
చిలుక పలుకుల దాన
తళుకు బెలుకుల దాన
అలుక నీకేలనే – కలికి రావేలనే'' (రమ్య – పుట : 8)

ఖండగతిలో సాగింది. భావకవుల గేయాలలో ఖండగతి గేయాలు చాలా ఉన్నాయి. చాలా మంది ఆధునిక కవులు ఖండగతి గేయాలను రాశారు. ఉదాహరణకు

[58] సంగనభట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రారంభ వికాస దశలు. పుట-74.

గిరిపుత్రి కడగంటి

మణిదీప్తి విరిసికొని

హిమశైల శిఖరమ్ము

కటకమ్ము నొరసికొని

నాలోన

లోలోన

గుండెలను చుట్టుకొని

... ... (ఒక శ్రుతి, అమృతం కురిసిన రాత్రి)

అంటూ అద్భుతంగా సాగింది ఈ గేయం. అయితే సుధాకర్ రచించిన ఖండగతి గేయాలలో రగడల ఛాయలున్నాయి. ఉదాహరణకు

కలువ కన్నుల దాన –చలువ వెన్నెల సోన

నీ గుండెలో నన్ను –నిలుపుకోలేవా

నా గుండెలో చేరి –నటియించరావా (ప్రేమగీతి, రమ్య – పుట 20)

ఇది ద్విరద గతి రగడలా ఉంది. యతి పాటించబడింది. (సాధారణంగా అన్ని రగడలకు రెండు గణాల తర్వాత యతి ఉంటుంది).

'ద్విరదగతి రగడ పంచమాత్రాగణాలతో ఏర్పడింది. ఇందులో ప్రతిపాదంలో పంచమాత్రాగణాలు నాలుగుంటాయి. జల – యగణాలు పంచమాత్రాగణాలే ఐనను లాక్షణికులు నిషేధించారు. తృతీయ గణాద్యక్షరం యతి చెల్లుతుంది. (ఆది) ప్రాసతో పాటు అంత్యప్రాస నియతంగా ఉంటుంది'[59]

ఓ హంసి, నీ చేత –నున్నయది, నా బ్రతుకు

నా హృదయ, మింతి డెం –దమునేక, ముగనదుకు

(పై దానిలో కింద గీత గీసినది యతిస్థానం) అనేది ద్విరద గతి రగడకు ఉదాహరణ.[60]

'ప్రకృతి – వికృతి' ఖండికలోని గేయం

[59]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశం. పుట-243.

[60]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశం. పుట-243

ఒక్క చిన్నది నన్ను –సక్కంగ దరిజేర

పక్కనున్నా కుక్క –పైపైకి లేచింది

మాలతీ లతిక కుసు –మాల వాసనలీన

నాగుబాములు దాని –నానుకోనున్నాయి (రమ్య – పుట 26)

ఇది విజయభద్ర రగడలా ఉంది. కాని యతి ప్రయోగం దృష్ట్యా సమన్వయం కుదరడం లేదు. ఇందులో ప్రతిపాదంలో మూడవ గణం మొదటి అక్షరంగా యతి ప్రయోగం ఉంది. అక్కడక్కడ ప్రాసయతి ప్రయోగింపబడింది. ఇదే ఖండికలోని

''రత్నమని యెంచినే –రక్తితో దరిజేర

రాళ్ళనోపతి జేసి –రాయిగా మారింది

బంగారమని నేను –భ్రమసితే అది కాకి

బంగారమై నన్ను –బాధింప సాగింది.''

పాదాలు అచ్చంగా విజయభద్ర రగడకు చెందినవి.

ద్విరదగతి రగడకు రెట్టింపు విజయభద్ర రగడ. ప్రతిపాదంలో జల –యగణేతరాలైన పంచమాత్రాగణాలు ఎనిమిది ఉంటాయి. 3వ, 5వ, 7వ గణముల ఆద్యక్షరములు యతి చెల్లుతుంది. (ఆది) ప్రాసతో పాటు అంత్య ప్రాస నియతంగా ఉంటుంది[61]

'దారి ప్ర,క్కన ధరా –ధరకోణ, ఘనశిలా

త్త వితర్ధి, కాపరి –స్తరణ ర,మ్యం బైన

దారి మధ్యన ధరా –ధరఝరీ, సారణీ –

దరనీల, పదిల ఘూ –త్తమ వారి, మృదువైన'

అనేది విజయభద్ర రగడకు ఉదాహరణ[62]

మిశ్రగతి: రగడ జాతి పద్యాల్లో ఒక సౌలభ్యం ఉంది. ఆ పద్య పాదాల్లో భిన్న మాత్రా సంఖ్యా గణాల కలగలుపు ఉండదు. అన్నీ సమాన మాత్రా సంఖ్యా గణాలే ఉంటాయి. అంటే 3X4; 4X4; 5X4 అని (ఒక పాదానికి త్రిమాత్రా గణాలు నాలుగేసి.....)

---

[61]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశం. పుట-244.

[62]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశం. పుట-244.

అందువల్ల వీటిని చెప్పటం, అర్థం చేసుకోవడం, గుర్తించుకోవడం కూడా సులభం. ఈ సందర్భంలో విశేషంగా గమనించాల్సిన అంశమొకటుంది. సప్తమాత్రాగణాలతో గూడా ఒక రగడ భేదం ఉంది. అయితే ఈ ఏడుమాత్రలూ ఒకే మొత్తంగా ఉండవు. 3+4 గా ఉంటాయి. అంటే, ఒక విధంగా ఇది మిశ్రరూపమున్న మాట[63]

రమ్యభార తరంగాలలో 'సారాయి' అనే ఖండిక మిశ్రగతిలో నడిచే గేయం.

సారయను కాసారముంటే సారయేరై పారుతుంటే

సార సంద్రమై యెల్ల విచారముల కిక తావులేదని

పారలౌకిక సారమని మనసార సారకు దాసులైతే

ఆరుగాలము బద్ధ శ్రమనిక బారు లోపల బీరు కమ్ముచు

... ... (రమ్య – పుట 14)

వృషభగతి రగడలాగే దీనిలోని పాదాలున్నాయి. అక్కడక్కడ ప్రాస, యతి, ప్రాసయతి ప్రయోగాలున్నాయి. అక్కడక్కడ అంత్యప్రాస పాటించబడింది. దీన్ని 14 మాత్రలున్న ముత్యాల సరంగా కూడా రాయవచ్చు. ఈ గేయంలో మాత్రా గణాలతో కవి శిల్పాన్ని ప్రదర్శించాడు.

''జారు|లో బ|జారులో దిగజారుచును తామారుచుండుట''

ఈ పాదంలో ఒక మాత్ర తగ్గింది. భావాభివ్యక్తికి తగినట్లు 'దిగజారడం' అనే పదానికి ఇది బలాన్ని చేకూరుస్తుంది.

''మారుచుందురు ''రోగులు'' గనే, మేరలనన్నిటి మీరు చుందురు''

కవి ''రోగులు'' అనే పదాన్ని '' ''లో ఉంచాడు. అంటే ఇక్కడ మాత్రలను 4+3 గా భావించుకోవచ్చు. 3+4 నడక కాస్తా 4+3గా మారినట్టు సారాయి తాగినవాళ్ళు రోగులుగా మారుతారు అనేది ఇందులోని భావాభివ్యక్తి.

''మేరలనన్నిటి మీరుచుందురు''

ఇక్కడ ఒక మాత్ర పెరిగింది. 'మేరలన్నిటి' అని ప్రయోగించినా సరిపోతుంది. కాని 'మేరలనన్నిటి' అని ప్రయోగించడంలో ఆంతర్యం 'మీరుచుందురు' అనే పదానికి బలాన్ని చేకూర్చడం కోసమే.

---

[63]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-179

''ఆలుబిడ్డల నాదుకొను నీ యాస్తి యంతయు ''నాస్తి''

అంటే'' ఈ పాదంలో ప్రాస లోపింప చేయబడింది. ''నాస్తి'' అనే పదానికి అది బలాన్ని చేకూరుస్తుంది. అంతేకాకుండా ''సారయను కాసారముంటే..... మేరలనన్నిటి మీరు చుందురు'' వరకు నియతంగా పాటించబడిన యతి ప్రాసలు తరువాత పాదాలలో పాటించబడలేదు. అంటే కవి ఈ ఖండికలో భావాభివ్యక్తికి తగినట్లు శిల్పాన్ని ప్రదర్శించాడని చెప్పవచ్చు.

షణ్మాత్రా గతి: సంగీతంలో సమాన కాల ఖండాల క్రమం ద్వారా లయగతులు వ్యక్తం కాగా, ఛందో విధానంలో సమాన గణాల కూర్పు ద్వారా లయగతులు సాధింపబడుతున్నాయి. సమాన గణాలంటే, అన్నీ ఒకే మాత్రా సంఖ్య గల గణాలు. ఒక పద్యానికి నాలుగు గణాలు ఒక పరిమితి అనుకుంటే, ఆ పాదంలోని నాలుగు గణాలూ త్రిమాత్రా గణాలే కావలసి ఉంటుంది. లేదా నాలుగు మాత్రల గణాలే కావలసి ఉంటుంది. అంతే తప్ప కొన్ని గణాలు ఒక రకమయినవీ మరికొన్ని మరొక రకమయినవీ కాకూడదు. సమాన గణాలున్నపుడే లయగతులు స్పష్టంగా వ్యక్తమవుతాయి.[64]

మాత్రలాధారంగా మాత్రాగణాలు ఏర్పడ్డాయి. ఈ మాత్రాగణాలు కూడా కొన్ని గుంపులుగా వర్గీకరింపబడ్డాయి. ఒక గుంపులో ఒకే మాత్రా సంఖ్య గల గణాలుంటాయి. ఉదాహరణకు మూడు మాత్రల గుంపు అన్నపుడు ఆ మాత్రల లెక్కింపునకు ఆధారమైన గల, లగ, న అనే ఒక గుంపు – వర్గం అన్నమాట. ఈ గుంపు గణాల్లో అక్షరాల సంఖ్యకు ప్రాధాన్యం లేదు – వాటి మాత్రా సంఖ్యకే ప్రాధాన్యం. అందుకనే ఈ గుంపులోని అక్షరాల సంఖ్య రెండు (గల, లగ) మూడు (న) అయినా మాత్రల సంఖ్య మాత్రం అన్నింటికీ మూడే. ఈ గణాల గుంపు లేదా వర్గం 'గణ'మే (ఈ మూడూ త్రిమాత్రా గణాలని అర్థం). ఈ విధంగా నాలుగు, అయిదు మాత్రల గణాలున్నాయి. ఆరు మాత్రల గణానికి ప్రత్యేక గుర్తింపులేదు. సాధారణంగా ఆరుమాత్రల గణం రెండు త్రిమాత్రాగణాలుగా విరుగవచ్చు. ఎనిమిది మాత్రల గణం స్థితి కూడా ఇంతే. రెండు చతుర్మాత్రా గణాల ద్వారా ఎనిమిది మాత్రలేర్పడవచ్చు.[65]

---

[64]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-179.

[65]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-38

కాని ఆరు, ఎనిమిది మాత్రల గణాలను కూడా గుర్తించడం అవసరమనిపిస్తుంది. ఎందుకుంటే, మూడు మాత్రల గణాలు రెండున్నపుడు మూడవ మాత్ర, నాలుగవ మాత్ర కలిసి ఏకాక్షరంగా ఉండకూడదు. 'పూల – కారు', 'కనుగొ – నంగ' వంటి చోట్ల మూడేసి మాత్రలు స్పష్టంగా కన్పిస్తాయి. కాని, 'కన –జాలను' వంటి చోట్ల 'జా' అనేది మూడవ – నాల్గవ మాత్రల కలయిక గల ఒకే అక్షరం కావటంతో రెండు – నాలుగు మాత్రలుగా (ఒకప్పుడు నాలుగు+రెండు) గా కన్పిస్తుందే తప్ప 3+3 గా కన్పించదు. లెక్కకు ఆరుమాత్రలే గాని, రెండు త్రిమాత్రా గణాలు మాత్రం కావు.[66]

రమ్యభావ తరంగాలలోని కవిత, జలవిలయం, అమర్– ఉమర్, దీపావళి వచ్చింది, ఉగాది, పాల్కురికి సోమన, గజముఖుడు మొదలైన ఖండికలలో ప్రతిపాదంలో ఆరుమాత్రల గణాలు నాలుగు ప్రయోగించబడ్డాయి. ఉదాహరణకు అమర్ – ఉమర్ ఖండికలోని గేయం.

ప్రతివాడూ ఉమర్ –ప్రతివాడూ అమర్
పెగ్గుకొక్క ఎగ్గుంటే –పక్కన నును బుగ్గుంటే
ఎఱ్ఱని అధరాల తేనె –ఎల్ల కాల మందుతుంటె
అందని అందాలన్నీ – అందుబాటులో ఉంటే
పచ్చనోట్లు బీరువాలో –విచ్చల విడిగా ఉంటే (రమ్య – పుట 25)

దీనిలో విజయమంగళ రగడ ఛాయలున్నాయి.

'కవిత' అనే గేయం ఆరుమాత్రా గణాలతో మొదలై 'మలపిన మలగని కాంతుల జిమ్మును' అని మధురగతి రగడ పాదంతో ముగియడం విశేషం. కవిత్వంలో వస్తున్న మార్పులను ఇది సూచిస్తుంది. ఏదైమైనా సుధాకర్ 'హృదయము రంజిల్లగ జేయు కవిత తేజమ్మిడు జగతి ప్రగతికే' అని 'కవిత' గేయంలో చెప్పినట్లు, సుధాకర్ కవిత్వం హృదయం రంజింప చేసేదిగా, జగతి ప్రగతి ప్రబోధకంగా సాగింది.

సుధాకర్ కవిత్వం గురించి శలాక రఘునాథ శర్మగారు ''సూటిగా, మాటుగా మేటి భావాలను పాఠకుల హృదయ క్షేత్రాలలో నాటడానికి ఈయన ఎంతో పాటు పడ్డారు. అందులో వైవిధ్యం ఉంది. వైదగ్ధ్యం ఉంది. భాషలో సారళ్యం ఉంది. అక్కడక్కడా

[66] కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-38

స్వాతంత్ర్యం కూడా ఉన్నది. భావ ప్రకటనలో జంకుగొంకులు లేని ధీనైశిత్యం ఉంది. ఆలోచనాత్మక వ్యంగ్య ధోరణి తొంగి చూస్తూ ఉంటుంది''[67] అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

★ ★ ★

[67]శతాక రఘునాథ శర్మ, 'హృది కదలిక' సుధాకర కవితా జ్యోత్స్న

5. సుధాకర కవితా జ్యోత్స్న – భాషా సాహిత్య విశేషాలు

5.1 ఛందస్సు:

ఛందస్సుకు రకరకాల నిర్వచనాలు చెప్పబడుతున్నాయి. 'ఛందః పాదౌతు వేదస్య' అనే ప్రసిద్ధోక్తి ఛందస్సు వేదాంగమని చెబుతుంది. వేదాంగమైన ఈ ఛందస్సు మంత్రాన్నీ, మంత్రాధీదేవతనీ ఛాదనం చేస్తుందనీ, అలంకరిస్తుందనే తాత్పర్యంలో 'ఛందాంసి ఛాదనాత్' అని నిరుక్తం చెబుతుంది. మరి, జయదేవుని 'ఛందస్సు'కు 'వివృతి రచించిన హర్షటుడు– 'ఛందతి హ్లాదం కరోతి దేప్యతేవా శ్రవ్యతయా ఇతి ఛందః' అని ఛందస్సును నిర్వచించాడు. 'ఛది ఆహ్లాదే' అని ధాత్వర్థం చెప్పబడుతోంది.[68]

5.1.1 ప్రాస విశేషాలు:

ప్రథమాధ్యాయంలో ఇచ్చిన పట్టికను బట్టి సుధాకర కవితా జ్యోత్స్నలో కంద పద్యాల సంఖ్య ఎక్కువగా ఉంది. తర్వాతి స్థానం తేటగీతిది. సుధాకర్ పద్యాన్ని, గేయాన్ని, వచన కవితను సమానంగా ఆదరించాడు.

సుధాకర్ ద్విప్రాస, త్రిప్రాస గల పద్యాలు రచించి ఆయా పద్యాలకు శబ్దసౌందర్యాన్ని ఆపాదించాడు.

ద్విప్రాస: ప్రాసాక్షరంతోపాటు దాని తరువాత అక్షరాన్ని కూడ ప్రాసగా ఉపయోగించినట్లైతే అది ద్విప్రాస అవుతుంది.[69]

సాయి శతకంలో ద్విప్రాస గల కంద పద్యాలున్నాయి.

'కలవని నెఱనమ్మితి నే
నలవక పనులెన్నొ చేసి యతి దీనుడనై
తలవని దినమే లేదే
నెలవున నిను గాంచవచ్చు నిలలో సాయీ' (సా.శ. – 114)

---

[68]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-7

[69]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-69

'ల' కార ప్రాస ఇందులో ఉంది. తరువాత 'వ'కారము కూడా నాలుగు పాదాలలో ప్రయోగించాడు. సాయి శతకంలోని 33, 38, 66, 93, 97, 105, 114, 116 సంఖ్య గల పద్యాలలో కూడ ద్విప్రాస ప్రయోగం ఉంది.

రమ్య భావ తరంగాల నుండి ఒక ఉదాహరణ

చిలుకకు చెప్పవచ్చు మది చిన్నగ చిన్నగ మాటలెన్నియో
పలుకగ రాని కొక్కెరకు పాఠము చెప్పగలండెవండిలన్
కులుకుల రాజహంస పయి కూరిమి తోడుత గూరుచుండు నా
పలుకుల రాణితో నలువ వాయస వాహనుడై చెలంగునే(రమ్య – పుట: 29)

త్రిప్రాస: ప్రాసాక్షరంతోపాటు మరో రెండు అక్షరాలు తరువాతవి కూడా ప్రాసగా చెల్లించినట్లైతే 'త్రిప్రాస' అవుతుంది.[70]

నిగ్రహమన్నది యెఱుగ, న
నుగ్రహమును గోరి నిన్ను నుతియించుచు, నీ
విగ్రహమును మది నిల్పగ
నాగ్రహమును జూప నాయమౌనే సాయీ! (సా.శ. – 78)

ఈ పద్యంతో పాటు సాయిశతకంలోని 3,62 సంఖ్య గల పద్యాలలో కూడ త్రిప్రాస ఉంది.

సుకరప్రాస:'సులభాక్షరాలు ప్రాసగా ఉంచి చెప్పేది' సుకర ప్రాస అవుతుందని భీమన చెప్పాడు. సులభాక్షరములనగా భాషలో మిక్కిలి విరివిగా ఉపయోగించు అక్షరాలని తాత్పర్యం.[71]

తలక్రిందుగ నిటుక దిండుగ
చెలగుట జూడంగ నతి విచిత్రము గాదే?
యిలలో నీ లీలలకున్
గలయర్థ మెఱుంగ రెవరు, ఘనుడవు సాయీ! (సా.శ. – 65)

[70]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-70
[71]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-69

దుష్కర ప్రాస: 'విషమాక్షరాలు ప్రాసగా ఉంచి చెప్పేది' దుష్కర ప్రాస అవుతుందని భీమన చెప్పాడు. విషమాక్షరాలనగా భాషలో తక్కువగా ఉపయోగించబడు అక్షరాలు, క్లిష్టమైన సంయుతాక్షరాలు, విసర్గపూర్వక అక్షరాలు మొదలైనవి. [72]

విజ్ఞుండవు నీవుండగ
నజ్ఞతతో నెవ్వరేమి యననేమి? విభో
ప్రజ్ఞావంతుల కెప్పుడ
వజ్ఞలిలం గలుగ నీకు వాజ్నిది సాయీ! (సా.శ. – 132)

అదేవిధంగా సాయి శతకంలోని 36, 37, 73, 77, 91 సంఖ్య గల పద్యాలు కూడా దుష్కర ప్రాస గల్గిన పద్యాలే.

లఘు యకార ప్రాస: 'సంధి లేని చోట స్వరంబు కంటె పరంబైన స్వరంబునకు యడాగమంబగు'. ఈ విధంగా ఆగమమైన యకారానికి, పదంలో సహజంగా ఉన్న యకారానికి ప్రాస చెల్లినట్లైతే, అది 'లఘుయకార ప్రాస' అవుతుందని అప్పకవి చెప్పాడు.[73]

నీ యాలయమున నిల్చిన
యాయా మానవుల మనము లత్యచ్ఛములౌ
యాయాసమన్న దెఱుగరు
పాయరు నీ పాద చింత పండరి సాయీ! (సా.శ. – 108)

నీ + ఆలయము = నీయాలయము. ఇందులోని 'య' సంధివశంగా వచ్చింది. మిగిలిన పాదాలలో అలా కాదు. సాయి శతకంలోని 43, 53, 76, 109, 115 సంఖ్య గల పద్యాలు కూడా లఘు యకార ప్రాస కల్గినవే.

పూర్ణబిందు ప్రాస: ప్రథమ పాదంలో ప్రాసాక్షరము పూర్ణబిందు పూర్వకమయినట్లైతే మిగిలిన పాదాలలోను పూర్ణబిందు పూర్వకమే కావాలి. అలాగయితే పూర్ణబిందు ప్రాస అవుతుందని అప్పకవి చెప్పాడు.[74] ఉదాహరణకు

---

[72]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-69

[73]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-64

[74]కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-56

గంగా గోదావరులే
బంగరు నీకాలిదోయి బాగుగఁ బాఱెన్
చెంగున గంతులు వేయుచు
పొంగుచు హరిపాదసీమ పోలిక సాయీ! (సా.శ. – 17)

సాయి శతకంలోని 45, 50, 67, 90, 93, 129 సంఖ్య గల పద్యాలు దీనికి మరికొన్ని ఉదాహరణలుగా చెప్పవచ్చు.

ప్రాస వైరము: రేఫ–శకట రేఫలు (ర–ఱ) పరస్పరము ప్రాస చెల్లకూడదు అనే అంశాన్ని అప్పకవి 'ప్రాసవైరము' అనే ఒక ప్రాస భేదంగా చెప్పాడు. నిజానికి ఇది ఒక ప్రాసభేదం కాదు. నిషేధ నియమము మాత్రమే. అయితే రేఫ–ఱకారములకు పలుమంది మహాకవులు యతి చెల్లించినట్లే ప్రాస చెల్లించారు.[75]

నిరుపేదల కనుపాపల
నిరుపమ కారుణ్య రసధునీ రూపమునన్
దరిసెనమగు నీ రూపము
చిఱుతల కిలకిలలలోను, శ్రీ నిధి సాయీ! (సా.శ. – 75)

మూడు పాదాలలో రేఫను ప్రాసగా వేసి నాలుగోపాదంలో శకటరేఫ వాడబడింది.

ప్రత్యేక ప్రాస: ''ప్రాసాక్షరాలు నాలుగు పాదాలలో మామూలుగానే ఉండి, దాని తరువాతి అక్షరము నుండి పూర్వార్థ మొకరీతిగా, ఉత్తరార్థమునందొక రీతిగా నిర్మించడం ప్రత్యేక ప్రాస అని వుయ్యూరు లక్ష్మీనరసింహారావుగారు దీన్ని తన 'కువలయాశ్వ చరిత్రము– ఒక పరామర్శనము' అనే గ్రంథంలో ప్రస్తావించారు. దీనికి వారు కువలయాశ్వ చరిత్ర (4–102) నుండి ఇచ్చిన ఉదాహరణ.

ఈ కరణి నృపాగ్రణి
యే కరణీ యములు మాని, హిమకర విలస
ద్రాకలకున్ వలిదెమ్మెర
రాకలకున్ జాలగొని విరాళిఁ బడంగన్

[75] కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందః పదకోశము. పుట-68

ఇందులో ప్రాస స్థానంలో 'క' వర్ణము సమానంగానే ఉంది. తృతీయ చతుర్థాక్షరాలు ప్రథమార్థంలో 'ర'కార 'ణ'కారాలు, ద్వితీయార్థంలో 'ల'కార 'క'కారాలై ఉన్నాయి.

అనగా ప్రథమార్థంలో ఒకవిధమైన, ద్వితీయార్థంలో ఇంకొక విధమైన త్రిప్రాస నిబంధింపబడింది. ఇట్టివి మనవాఙ్మయంలో లెక్కింపదగినంత యెక్కువగానే కనబడుతున్నాయని మరొక ఉదాహరణ కళాపూర్ణోదయం (పీఠిక-19) నుండి ఇచ్చారు.

ఆ చంద్రుని వంశంబున

భూ చంద్రుండార వీటి బుక్క నరేంద్రుం

డా చక్రవాళశైల

క్ష్మా చక్ర స్ఫూర్తి కీర్తి సాంద్రుడు పుట్టెన్.

ఇంద్రులో ప్రథమార్థంలో ద్విప్రాస ఒక రీతిగా, ద్వితీయార్థంలో ద్విప్రాస ఇంకొక రీతిగా కూర్చబడింది. ఇటువంటి వాటికి లాక్షణికులు పేరు పెట్టలేదు. ఈ ప్రత్యేక ప్రాసలలో ఒక సగంలో ద్విప్రాస, వేరొక సగంలో త్రిప్రాస- ఈ విధంగా చిత్రవిచిత్రగతులు కలిగిన విశేషాలు కావ్యాలలో కానవస్తున్నాయి''[76]

సుధాకర కవితా జ్యోత్స్నలో కూడా పైన తెల్పిన విధంగా ప్రత్యేక ప్రాస కల్గిన పద్యాలున్నాయి. ఉదాహరణకు

జయములనిమ్ము విఘ్నముల జాలములం దొలగింపఁజేయు మా

భయముల బాపి నన్మిగుల బాగొనరింపుము నాదు జీవికన్

నయమున సాగిపోవుటకు నై తగుదారిని జూపరమ్మికన్

రయమున ధన్యుజేయుమనురాగము తోడుత నన్సరస్వతీ! (సర – 17)

ఇందులో ప్రథమార్థంలో ఒక విధమైన త్రిప్రాస, ద్వితీయార్థంలో ఒక విధమైన త్రిప్రాస కూర్చబడింది. అదే విధంగా సాయిశతకంలోని 16, 23, 109, 119 సంఖ్య గల పద్యాలు పైన పేర్కొన్నట్లు ప్రత్యేక ప్రాసను కల్గి ఉన్నాయి.

[76]ఉయ్యూరు లక్ష్మీనరసింహారావు, కువలయాశ్వ చరిత్ర – ఒక పరామర్శనము, పుట-104.

5.1.2 ఛందో వైచిత్రి:

ఆధునిక కవులు ఛందోవైచిత్రిని ప్రదర్శించారు. 'అంతర్గోళాలు'లో దుర్గానంద్ రాసిన 'తపనాః శీలము మూర్తి వై కనుము' అను ఒకే పద్యంలో ప్రథమ పాదము మత్తేభం, ద్వితీయ పాదం శార్దూలం, తృతీయ పాదం ఉత్పలమాల, చతుర్థపాదం చంపకమాల. ఒకే పద్యం ఇన్ని వృత్త గతులలో రాయటం అపూర్వ విషయం. 'అగ్నిధార'లో దాశరథి 'బాలచంద్రరేఖ' అను పద్యంలో ఆటవెలది, తేటగీతి పాదాలను కలిపి కుట్టినాడు.[77]

'సుధాకర కవితా జ్యోత్స్న'లో సుధాకర్ అక్కడక్కడ ఛందోవైచిత్రిని ప్రదర్శించాడు. వానమామలై లక్ష్మణాచార్యుల గురించి చెప్పిన పద్యం.

'ఆహిరీ భూపాలు నాస్థాన బుధకవి
అల్లసాని వాని యంతవాడు
నాల్గు బాసలందు నారి చేరిన వాడు
బహుకావ్య నాటక పఠనచణుడు' [78]

ఇందులో మొదటి పాదం సీస పద్యం యొక్క పూర్వార్థం, రెండవ పాదం ఆటవెలది పద్యం యొక్క సరిపాదం, మూడవ పాదం ఆటవెలది పద్యం యొక్క బేసిపాదం, నాల్గవ పాదం సీసపద్యం యొక్క ఉత్తరార్థం. దీనిలో ఆయా పద్యపాదాలకు తగినట్లు యతి పాటించబడింది.

'నేటి విద్యాస్థాయి' అనే ఖండికలో

''నేటి గురువులు – ఎండిపోయిన తరువులు
మండి మాడి నడిబజారులో బూడిద కుప్పల్లా కూరిన పరువులు''

–(రమ్య – పుట: 18)

---

[77]సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు ప్రయోగాలు. పుట : 616

[78]ఈ పద్యం అసంపూర్ణంగా లభ్యమైనదని ప్రచురణ కర్తలైన తిరువరంగం పద్మాలయ, బొలుగాని రాములు గారు తెలియ చేశారు. 'సుధాకర్ గారు మానమామలై లక్ష్మణాచార్యులపై ఒక సీస పద్యం చెప్పి ఉండవచ్చు. అందులోని పాదాలనే ఇవి కావచ్చు'నని వారు భావించారు.

అనే పాదాలు గమనించదగినవి. ఇందులో 'నేటి గురువులు – ఎండిపోయిన తరువులు' అనేది తేటగీతి పాదం. 'మండి మాడి నడిబజారులో బూడిద' అనేది ఆటవెలది బేసి పాదం.

'దీపావళి వచ్చింది' అనే గేయ ఖండికలోని

''గురువులార! జ్ఞానకల్ప తరువులార

భారతాంబ పరువులార! మీ మెదళ్ళు

జాతి భూరూహపు మొదళ్ళు జ్ఞాననేత్ర

మును తెరచి దేశమాత నాదుకోండి'' (రమ్య – పుట 33)

కూడా అంతే. దీనిలో మొదటి మూడు పాదాలు తేటగీతి పాదాలు. అంతే గాకుండా ఇదే ఖండికలోని 'తీయని తలపయ్యెదనని తేనెమనసు తానె తాగె' అనేది మధ్యాక్కర పాదం.

అదే విధంగా 'పాల్కురికి సోమన' గేయ ఖండికలోని 'నన్నయ్యకు తెలుగు కైత కన్నయ్యకు కవులకెల్ల' అనేది మధ్యాక్కర పాదం.

'రైలెక్కాను' అనే గేయ ఖండికలోని

''నిదురించ దొరికింది నీటైనసీటు

నిదురలో దొరికింది నిక్కమౌ స్వీటు'' (రమ్య – పుట 13)

అనేది ద్విపద.

''ఈ రైలు నాపాలి పూల ఉయ్యాల

స్త్రీల మాటలె నాకు పాడె జోజోల'' (రమ్య – పుట 13)

అనేది మంజరిద్విపద. అయితే ఇందులో యతి పాటించబడలేదు.

'రామప్ప శిల్పాలు' అనే గేయ ఖండికలోని

''రామప్ప చెరువుండ రాబోదుకరువు

బీదసాదల పాలి కది కల్ప తరువు'' (రమ్య – పుట 10)

అనేది మంజరి ద్విపద. మొదటి పాదంలో యతి, రెండవపాదంలో ప్రాసయతి ప్రయోగాలు ఉన్నాయి. కాని ఉపజాతికి చెందిన ద్విపద, మంజరి ద్విపదలకు ప్రాసయతి నిషేధము. 'మంజరి ద్విపదకు ప్రాసయతి వాడవచ్చునని' కవి అభిప్రాయమని కేవలం ఈ ఒక్క పద్యం

వల్ల చెప్పలేము. ఎందుకంటే 'రామప్ప శిల్పాలు' కొంత ఖండగతిలోను, కొంత మిశ్రగతిలోను సాగింది. పై పద్యం తర్వాత పాదాలు.

''తలమీది గంగమ్మ నిలదింపె నా శివుడు
హిమశైల నందినీ వృతుడు మాధవుడు''. (రమ్య – పుట 10)

దీనిలో కూడా మొదటిపాదంలో ప్రాసయతి ప్రయోగం ఉంది. 'ద్విపద నడకలు గల జానపద గీతాల్లో ప్రాసయతి విరివిగా ప్రయోగించబడింది. పాల్కురికి సోమన బసవపురాణంలో ద్విపదలో ప్రాసయతి ప్రయోగించినట్లు సంగన భట్ల నరసయ్య గారు ప్రయోగాలు చూపించారు.'[79] ఉదాహరణకు

నిక్కమెట్టన వినుమొక్క విన్నపము
ముక్కంటి నీకు నే దక్కిన బంట (బసవపురాణం)

5.2 అలంకారాలు:

'అలం' – అనే శబ్దానికి 'కృ' అనే ధాతువు చేరగా అలంకారమనే రూపం సిద్ధిస్తుంది. 'అలం' అన్నా, 'అలంకార' – మన్నా భూషణమనే అర్థం. 'అలంకారోతీత్యలంకారః' అని నిర్వచనం. 'అలం' – శబ్ద భూషణం, సామర్థ్యం, పూర్ణం, చాలు అనే అర్థాలలో ప్రయోగించబడింది. ఇక్కడ అలంకారమంటే శోభను కలిగించేది, పూర్ణత నాపాదించేది, నైపుణీ ప్రకాశమైందీ, కావ్యంలో సౌందర్యాన్ని పెంపొందించేదీ అని అర్థం. దీని ప్రయోజనం సౌందర్యాన్ని ఆపాదించడం, అనుభూతి గాఢత్వాన్ని పెంచి, ఆనందాన్ని కలిగించడం, చెప్పే భావానికి గాఢత్వాన్నీ, తీవ్రతను, స్పష్టతను కలిగించడం కోసం అలంకార సహితమైన భాష అవసరమవుతుంది. ప్రతీ భాషా వ్యవహర్త తెలియకుండానే అలంకారాల్ని ప్రయోగిస్తుంటాడు.[80]

సుధాకర కవితా జ్యోత్స్నలో శబ్దాలంకారాలు, అర్థాలంకారాలున్నాయి.

5.2.1 శబ్దాలంకారాలు:

శబ్దాలంకారాలను కూర్చడంలో కవికి భావనా బలం కన్నా 'అక్షరాల కూర్పులో' ఎక్కువ పనితనం కావాలి. అంటే పైపై మెరుగులు దిద్దే నగిషీ అన్నమాట. వచ్చిన

---

[79] సంగన భట్ల నరసయ్య, తెలుగులో దేశిచ్ఛందస్సు – ప్రాదుర్భావ వికాసాలు. పుట - 209

[80] బూదాటి వెంకటేశ్వర్లు, 'అలంకారాలు' తెలుగు కరదీపిక. పుట - 245

అక్షరాలనే మరల, మరల ప్రయోగిస్తూనో, రెండేసి మూడేసి అక్షరాలున్న పదాలను జంటలుగా స్వీకరించో, అర్ధ భేదాన్ని ఆశిస్తూనో, తాత్పర్య భేదాన్ని కోరుకుంటూనో ఈ శబ్దాలంకార ప్రక్రియ సాగుతుంది.[81]

వృత్త్యానుప్రాసాలంకారం: ఒక వర్ణం గానీ, రెండు మూడు వర్ణాలు గాని పునరుక్తి అయితే దానిని వృత్త్యనుప్రాస అంటారు.

సాయిశతకంలో వృత్త్యానుప్రాసాలంకారాలు విరివిగా ప్రయోగించబడ్డాయి. ఉదాహరణకు

జడివాన గుటియ వడవడ

వడకుచు వడివడి మసీదు వచ్చిరి పౌరుల్

బెడిదముగా గర్జించితి

జడిసెను జడివాన నీదు సడివిని సాయీ! (సా.శ – 46)

ఇందులో 'డ' కారం పలుమార్లు ఆవృతమైంది. కాబట్టి ఇది వృత్త్యనుప్రాస.

''రమ్య భావ తరంగాలు''నుండి ఒక ఉదాహరణ

మల్లెలు కమ్మని తావుల

ముల్లెలుగా నుల్లనెల్లి మొల్లల తోడన్

ఉల్లమునెల్లను మెల్లను

కొల్లగొనగ జల్లుమనవె గుండెల్ గండల్ (రమ్య – పుట 10)

ఇందులో 'ల'కారం పలుమార్లు ఆవృతమైంది.

ఛేకాను ప్రాసాలంకారం:

రెండుగానీ అంతకంటే ఎక్కువగానీ ఉన్న హల్లుల జంటలు అర్థబేధం కలిగి వెను వెంటనే (అవ్యవధానంగా) ప్రయోగించబడితే అది ఛేకానుప్రాసాలంకారం అవుతుంది.

ఉదాహరణ

కారణ జన్ముడవయ్యా!

వారణ ముఖముఖ సురాళి వరరూప! యసా

---

[81]మల్లాది కృష్ణప్రసాద్, తెలుగు వ్యాకరణము. పుట - 430

ధారణ ధారణ! సుజనో

ద్ధారణ! నత భక్త జాల తారణ! సాయీ! (సా.శ – 38)

ఇందులో ముఖ ముఖ, ధారణ ధారణ అనే రెండేసి హల్లుల జంటలు వెంటవెంటనే అర్థభేదంతో ప్రయోగింపబడ్డాయి.

లాటాను ప్రాసాలంకారం:

అర్థభేదం, శబ్దభేదం లేకుండా అవే పదాలు తాత్పర్య బేధం కలిగి తిరిగి అవ్యవధానంగా (ఎడం లేకుండా) ప్రయోగించటాన్ని లాటాను ప్రాసాలంకారం అంటారు. ఉదాహరణ.

విద్యగోరునట్టి విద్యార్థి విద్యార్థి

వినయ భాసియైన విద్య విద్య

పంతి బోలునట్టి పంతులు పంతులు

వినుర భావిపొర వీనులార (రమ్య – పుట 37)

ఇందులో ''విద్యార్థి, విద్యార్థి'', 'విద్య, విద్య', 'పంతులు, పంతులు' అన్నప్పుడు శబ్దంలోగాని, అర్థంలోగాని భేదం లేదు. తాత్పర్యంలో భేదం వుంది.

'విద్యను భుక్తి కోసం కాకుండా భక్తితో కోరుకునే విద్యార్థి మాత్రమే విద్యార్థి, వినయంతో భాసించే విద్యే అసలైన విద్య, ప్రమిదలాగా వెలుగిచ్చే పంతులు మాత్రమే పంతులు' అని ఇందులోని తాత్పర్యం.

యమకాలంకారం:

రెండు లేక అంతకంటే ఎక్కువ అక్షరాలు ఉన్న పదాలు తిరిగి తిరిగి వస్తూ అర్థభేదం కలిగి ఉంటే అది యమకాలంకారం.

దినమున కొక సారయినను

నిను దలపక యుండమయ్య! నీరజనాభా!

కనికరమున నీ దీనుని

గని, కరమున శిరము నిమిరి గావుము సాయీ! (సా.శ – 113)

పై పద్యంలో 'కనికరమున' అంటే జాలితో అనే అర్థంలో, ''కని, కరమున'' అని విడదీసి 'కని' శబ్దానికి 'చూచి' అని, కరమున అనే శబ్దానికి 'చేతితో అనే అర్థంలో ప్రయోగించబడింది.

మరొక ఉదాహరణ.

కన్నయ్యవు, లోకాలం

గన్నయ్యవు, జనుల కరుణ గన్నయ్యవు మా

కన్నయ్యవు, నను దయతో

గన్నయ్యవు, నీకు సాటి గలరే? సాయీ! (సా.శ – 62)

పై పద్యంలో కన్నయ్య వంటే – కృష్ణుడివి, లోకాలను కన్నయ్యవు – జగములకు తండ్రివి, జనుల కరుణ కన్నయ్యవు– భక్తుల భక్తిని చూచిన వాడివి మాకు+అన్నయ్యవు – మా అందరికంటే అగ్రజుడువు అనగా మొదట పుట్టినవాడవు, దయతో కన్నయ్యవు అంటే నన్ను అనుగ్రహించినవాడవు కావాలని తాత్పర్య భేదం కలిగిన పద్యమిది.

అంత్యాను ప్రాసాలంకారం:

మొదటిపాదం చివరి భాగంలో ఏ అక్షరంతో (అక్షరాలతో) ముగుస్తుందో రెండోపాదం కూడా అదే అక్షరంతో (అక్షరాలతో) ముగిసినట్లైతే దాన్ని అంత్యానుప్రాసాలంకారం అంటారు.

కలకలలాడునీ మొగము కమ్మని తావుల గుమ్మరింపగా

మిలమిలలాడు నీ కనుల మీల్మెల మెల్లగ తల్కులీనగా

తలతలలాడ చెక్కిళుల తాకిడి హాయిని గల్గజేయగా

చలమతిగాక పద్మజుడు చప్పున నా తలవ్రాత మార్చగా

దలచిన నేను ధన్యుడను ధాతృసతీ! సుదతీ! సరస్వతీ! (సర – 35)

పై ఉదాహరణలో ''గా'' అనే అక్షరం మొదటి నాలుగు పాదాల చివర ఉంది.

5.2.2 అర్థాలంకారాలు:

''అర్థమే'' ప్రధానంగా గల అలంకారాలను అర్థాలంకారాలు అంటారు.

ఉపమాలంకారం:

ఉపమానోపమేయములకు చక్కని పోలిక చెప్పినచో అది ఉపమాలంకారం.

ఉదాహరణ:

బాలకులలోన నీవొక
బాలుడవై యాడుకొనుచు బలుమోదమునన్
దేలుచునుందువు, భక్తుల
నేలుచు గోపాల బాలునిన్వలె సాయీ! (సా.శ – 12)

పై పద్యంలో సాయి ఉపమేయం, గోపాల బాలుడు (కృష్ణుడు) ఉపమానం, ఆడుకోవడం – సమాన ధర్మం వలె ఉపమావాచకం. ఇందులో సాయి కృష్ణుడితో పోల్చబడ్డాడు. కాబట్టి ఇది ఉపమాలంకారం.

శ్లేషాలంకారం:

అనేకార్థాలను ఆశ్రయించుకొని ఉండినట్లైతే అది శ్లేషాలంకారం.

కనలేని వారినైనను
కనగల్గెడు భాగ్యమిచ్చి గాచెదవెటులన్
మనలేని వారినైనను
మనగా జేసెదవు దివ్య మహిమను సాయీ! (సా.శ – 57)

పై ఉదాహరణలో కను అంటే చూచు, సంతానాన్ని కను అనే రెండు అర్థాలున్నాయి. పై పద్యం పూర్వార్థంలో 'చూపులేని వారికి చూపునిస్తావు' అని ఒక అర్థం, 'సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదిస్తావు' అని ఒక అర్థం చెప్పుకోవచ్చు.

ముద్రాలంకారం:

ముద్రాలంకారాన్ని తొలిసారిగా తెలుగులో వాడినవాడు నన్నెచోడుడు[82]'సూచ్యార్థ సూచనం ముద్రా ప్రకృతార్థ పరైః పదైః' అని దీని నిర్వచనం ప్రస్తుతార్థాన్ని పదాలతో సూచ్యార్థ సూచన చేయటం ముద్రాలంకార లక్షణం.

కందమ్ముల కెందమ్ముల
నందమ్ముగ మాలలల్లి యాంధ్రసుకవితన్
డెందమ్ములరగ జేసెడి
చందమ్మున నిన్నుతింతు, సన్నుత సాయీ! (సా.శ – 93)

[82] డా.సి. నారాయణ రెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు ప్రయోగాలు. పుట – 108.

ఇది కంద పద్యం. ఇందులో కందమనే పదం సూచ్యమైంది కాబట్టి ఇది ముద్రాలంకారం. మరొక ఉదాహరణ:

చంపకమాల పద్యమును జాలియునుత్పల మాల సేయగన్
సొంపుగ నుండదంచు మనసొప్పక జంపకమాలనల్లి తిన్
సంపెగ సొంపెరింగియును సన్నిధి జేరని షట్పదంబు, దా
నింపుగ పంకజంబు పయినెక్కును తీయని తేనెలానగన్ (రమ్య – పుట 29)

''చంపకమాల పాదాదిలోని రెండు లఘువులు ఒక గురువుగా మారితే ఉత్పలమాల ఏర్పడుతుంది. అందుకని అవి జంట పద్యాలు.''[83] ఇదే విషయాన్ని రమ్య భావ తరంగాలలో 'చంపకోత్పలమాల పరివర్తనము' అను ఖండికలో తెలిపాడు సుధాకర్.

పై పద్యం ఉత్పలమాల. ఇందులో ఉత్పలమాలలోని 'గణాల' ఆధారంగా 'ఉత్పలమాల' అనే పదం సూచ్యమైంది. కావున ఇది ముద్రాలంకారం.

కావ్యలింగాలంకారం:

సమర్థనీయమయిన అర్థానికి సమర్థనం కావ్యలింగం.

ఉదాహరణ:

లోకములనెల్ల నుదరమ్ములోననుంచి
గాచువాడను ప్రఖ్యాతిగాంచినావు
నేను నీ బిడ్డడను గానొ? నీరజాక్ష! (తోగు – 7)

లోకాలన్నీ పరమాత్మ కడుపులో ఉన్నపుడు తానుకూడా కడుపులో ఉన్నట్లే కదా! కాబట్టి ఇక్కడ ''నేను నీ బిడ్డడను కానొ?'' అనేది సమర్థనీయం.

5.3 విమర్శక దృష్టి:

సుధాకర కవితా జ్యోత్స్నలోని కొన్ని పద్యాలలో సుధాకర్ కున్న విమర్శక దృష్టి గోచరమవుతుంది.

తెలుగులో సోమనాథుని స్థానాన్ని సి. నారాయణ రెడ్డి ఈ విధంగా అంచనా వేశాడు. ''నన్నయ యేర్పరిచిన మార్గ కవితా ఘంటాపథమును కాదని దేశికవితా కంటక పథానకాలూని దాన్ని పూలబాటగా మలుచుకున్న అపూర్వ ప్రతిభాసముపేతుడు పాల్కురికి

---

[83] కోవెల సంపత్కుమారాచార్య, తెలుగు ఛందస్సులో వెలుగులు. పుట-170.

సోమనాథుడు. నన్నెచోడ కవిలో మొలకెత్తిన దేశ్యభిమానము పాలకురికిలో రెమ్మలు వేసి, కొమ్మలు సాచి, పూచి, కాచి ఫలించినది. పూర్వాంధ్ర సాహిత్యమున దేశికవితకు పునాది వేసినవాడితడే. గోపురమును పెట్టిన వాడును ఇతడే. వీరశైవ మతమును కావ్యరూపమున సుస్థిరము చేయుటలోనేమి, కవితారంగమున, క్రొంగొత్త దారులు త్రొక్కుటయందేమి ఇతనికితడే సాటి. మతాభిమానము, దేశ్యభిమానము సంగమించిన ప్రజ్ఞాశాలి యీతడు. సంస్కృత భాషా పరిష్వంగమునుండి తెలుగు పలుకును విడిపించుటకు ప్రయత్నించిన వాడీతడు.[84] అటువంటి పాల్కురికి సోమనాథుని గురించిన రాసిన కవితలో సుధాకర్ విమర్శనా దృష్టిని అంచనా వేయవచ్చును.

'జాను తెనుగులోనున్న మజాను తెలుప జన్మమెత్తి', 'వసివాడని కవితాలత వాసిగాంచు'నట్లు చేసిన పాల్కురికి సోమనాథుని గురించి

'గాన యోగ్యముగ కైత, జగాన వెలుగజేయనెంచి
ద్విపద ఛందమున కవి ద్విప! దనిపితివయ్య మమ్ము
సంప్రదాయ బద్దమైన చక్కని కవితకు ధీటుగ
చక్కని జాను తెనుంగును చక్కనిదిగ గూర్చినావు
పన్నెండవ శతాబ్దమును పండించిన వాడవీవు
పండిత పామర జనశ్రుతి మండన మాకైతసేత'' (రమ్య – పుట 40)

అని అనడంలో సుధాకర్ విమర్శక దృష్టి గోచరమవుతుంది.

'ఆహిరీ భూపాలు నాస్థాన బుధకవి
అల్లసాని వానియంతవాడు
నాల్గు బాసలందు నారితేరినవాడు
బ్రహు కావ్యనాటక పఠన చణుడు'.

పై పద్యం వానమామలై లక్ష్మణాచార్యుల గారి నుద్దేశించి చెప్పబడింది. లక్ష్మణాచార్యులు గారు 'తిక్కన చరిత్ర' అనే కావ్యాన్ని రచించారని వారి వారసులు చెప్పారు కాని అది అలభ్యం.

[84]డా.సి. నారాయణ రెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు ప్రయోగాలు. పుట – 111.

చిక్కని శైలి పాఠకుని చిత్తములో జొరబారునట్లుగా
చక్కని కైతలల్లితిరి సంతసమందె మదంతరంగమున్
చిక్కని శబ్దవైభవము చిక్కిన దెట్లగు నుద్యమింప పెం
పెక్కును పెక్కు భావములు భేషకవిశ్వర చండికేశ్వరా! (రమ్య – పుట 38)

పై పద్యంలో వెలగడప చండికేశ్వరశర్మగారి కవిత్వంను పరిశీలించి అతని శైలిని ప్రశంసించారు సుధాకర్. శర్మగారు 'శ్రీరాజేశ్వర విలాస యశోభూషణం' అనే పద్య కావ్యాన్ని రచించారు. వీరు రచించిన కొన్ని సీస పద్యాలకు ఎత్తుగీతి ప్రయోగం లేదు. ఇటీవలే వీరు పరమపదించారు.

తెలుగు వాల్మీకి కోకిల యెలుగు వెలుగు
నీ కవిత్వమ్ము మధురసాన్వీతమయ్యె!
గౌడ రాజన్న! రాజన్నగౌడ! నేడు
మఱల పోతన్న జన్మించె మంత్రపురిని (రమ్య – పుట 35)

పై పద్యంలో 'రామచంద్ర శతకము' రచించిన తాటికొండ రాజాగౌడ్ ను ప్రశంసించాడు సుధాకర్.

5.4 సూక్తులు:

సూక్తి అంటే మంచిమాట అని అర్థం. సుధాకర కవితా జ్యోత్స్న లో అక్కడక్కడ కొన్ని సూక్తులున్నాయి.

మది అనునది కోరికలకు
గది, యది చెదలంటజేయు మెదడున కెపుడున్
గద, గదలని యెదగల్గిన
ముద మొదవును, దాన సౌఖ్య మొదవును సాయీ! (సా.శ – 111)

మనస్సనేది కోరికలకు గది (కోరికల పుట్ట అంటుంటాం) అని దాన్ని అదుపులో పెట్టుకోవాలని ఇందులో సూచితం.

చిత్తము చపలము, దానికి
విత్తము తోబుట్టువయ్య విశ్వమునేలన్ (సా.శ – 125)

ఇది కూడా పై విషయాన్నే తెలియచేస్తుంది.

కపటపు చిత్తము గలిగిన

యపకారుల వలన గల్గునాపద లెల్లన్ (సా.శ – 130)

స్వార్థపూరితమైన ఆలోచనలు గలవారివల్ల ఆపదలు వస్తాయని ఇందులో చెప్పబడింది

శరణన్న వారిగాచుట

కరుణాపరులైన వారి కర్తవ్యంబౌ (సా.శ – 59)

దయాగుణం గలవారే తనను సాయం అడిగిన వారికి సాయం చేయగలరు. అంటే ఎవరినైనా ఏదైనా సహాయం అడిగేటప్పుడు అతడు సాయపడగలడా లేదా అనే విషయాన్ని ముందే వివేచించుకొని అడగాలి.

ఆశలేనట్టి మానవుడసలె లేడు

పాశముల గట్టు వడనట్టి ప్రాణిలేడు (తోగు– 37)

ఆశలేని మనిషంటూ ఉండడు. 'ఎటువంటి వారికైనా మరణం తథ్యం' అనే జీవిత సత్యం ఇందులో ఉంది.

మనమున నున్న చింతలను మాపిననేగద దైవ చింత లీ

మనుజుల లోపలం బెరుగు మంటికి మింటిని దింతురెట్టులన్

ఘనమగు విద్యముందు గొఱగానివి, సంపద లెన్నియేని, పా

వన మనమున్న నింక వనవాసతపంబు వృథా! సరస్వతీ! (సర – 22)

'ఎంత సంపద ఉన్నా విద్యముందు దిగదుడుపే, మంచి మనసుంటే చాలు అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేయాల్సిన అవసరం లేదు' అనే విషయాన్ని ఇందులో తెలియజేశాడు సుధాకర్.

''నిక్కపు మానసంబు గణనీయత కున్మ హనీయ హేతువౌ''

– (రమ్య – పుట 39)

ఇది కూడా పై విషయాన్నే తెలియచేస్తుంది ఇటువంటి విషయాన్ని చేగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆటవెలదిలో 'సూక్తి సుధాలహరి శతకం'లో

'అందమున్నయంత వందనీయుడు గాడు

బలము గలిగియున్నంత ప్రభువుగాడు

మనసుమంచిదైన మాన్యత పొందురా
చేగిరెడ్డి మాట సిరులమూట'

అని తెలియచేశారు.[85]

నీవు నీవటంచు నీల్గు వారలకన్న
పిక్కబీకు వెఱ్ఱి కుక్క మేలు
పరిహసింపబూను పందుల కన్ననే
పనియు లేని యూరపంది మేలు (రమ్య – పుట 41)

'ఎవరితోను అమర్యాదగా మాట్లాడరాదని, ఎవరినీ అనవసరంగా అపహాస్యం చేయరాదని' పై పద్యం ద్వారా తెలియ చేశాడు సుధాకర్.

5.5 సామెతలు:

ఒకానొక అర్థం విశేషంగా ప్రకటింపబడటం లోకంలో సామెతల రూపంలో కనపడుతుంది. అవి సందర్భశుద్ధిని కలిగి ఉంటాయి. అలాగే కవులు కూడా సామెతలను ప్రయోగించి ప్రతిపాదింపదలచిన అర్థాన్ని పరిపూర్ణం చేస్తారు. లోకవ్యవహారం తెలిసిన కవులకిది కరతలామలకం.[86]

సుధాకర్ లోకవ్యవహారాలు తెలిసిన కవి. కాబట్టి సామెతలను ప్రయోగించి పద్యానికి వన్నె తెచ్చాడు. సామెతలను అలంకారిక పరిభాషలో లోకోక్తి అలంకారం అనడం పరిపాటి. ఇటువంటి సామెతలను గూర్చి రాసిన పద్యాలు సుధాకర కవితా జ్యోత్స్న లో కొన్ని ఉన్నాయి.

1. నారువోసినవాడె తానీరు వోయి (తోగు – 10)
2. మంటికైనను గావలె నింటివాడు (తోగు – 18)
3. ఎవ్వరికి నంతుబట్టని దీశ్వరేచ్ఛ (తోగు – 77)
4. సాల గ్రామములోనన్ పుత్తడివలెన్ జన్మించి (రమ్య – పుట 20)
5. కష్టసుఖము లరయ కావడి కుండలు (రమ్య – పుట 28)
6. నలుగురితో నారాయణ లోకంతో లొటలొట (రమ్య – పుట 40)

[85]డా. కె.వి. రమణాచారి, పద్యకవిత్వం: వస్తు వైవిధ్యం, పుట - 230

[86]డా. శ్రిష్టి చంద్రమౌళి శర్మ, నన్నయ నానా రచిరార్థ సూక్తి నిధిత్వము. పుట - 87

మొదలగు సామెతల ప్రయోగాలు 'సుధాకర కవితా జ్యోత్స్న' లో ఉన్నాయి.

5.6 భాషా విశేషాలు:

'సుధాకర కవితా జ్యోత్స్న' లో నుడికారాలు, అన్యదేశ్యాలు, ధ్వన్యనుకరణ పదాలను విరివిగా ప్రయోగించాడు సుధాకర్.

5.6.1 నుడికారాలు:

భాషల వన్నె చిన్నెల జిలుగు వెలుగులకు బాసటయై నిలిచేది నుడికారము. రచనలో గడితేరిన వ్యక్తియే నుడికారపు సొగసులను చిందింపగలడు. కవి చెప్పదలచిన అర్థము మొత్తము నుడికారపు గుళికలో నిండివుంటుంది.[87]

కొంగు బంగారం	(తోగు – 19)
కాకి బంగారం	(సారాయి, రమ్య – పుట 14)
మాయలమారి	(తోగు – 57)
మఙ్గాకు పడక	(తోగు – 70)
దొంగనిద్దుర	(తోగు – 4)
దాగుడు మూతలు	(సర – 32)
దండుగ కూడు ('కూడును దండగ'గా ప్రయోగం)	(సర – 10)
పంగనామాలు	(ఉగాది, రమ్య – పుట 15)
కరిమ్రింగిన వెలగపండు	(ఉగాది, రమ్య – పుట 16)

మొదలైన నుడికారాలు సుధాకర కవితా జ్యోత్స్నలో ఉన్నాయి.

5.6.2 అన్యదేశ్యాలు:

ఏ భాషలోనైనా పదాలు దేశ్యాలు, అన్యదేశ్యాలు అని రెండు రకాలుగా ఉంటాయి. మూల భాష నుంచి సంక్రమించినవి దేశ్యాలు. తదితరాలు అన్యదేశ్యాలు.

లయన్స్క్లబ్బు	(రమ్య, పుట – 12)
బస్టాపు	(రమ్య, పుట – 13)
రైలు	(రైలెక్కాను, రమ్య, పుట – 13)
లేడీస్ కంపార్టుమెంటు	(రైలెక్కాను, రమ్య, పుట – 13)

[87]డా. శ్రిష్టి చంద్రమౌళి శర్మ, నన్నయ నానా రచిరార్థ సూక్తి నిధిత్వము. పుట - 90

నీటైన సీటు	(రైలెక్కాను, రమ్య, పుట – 13)
స్వీటు	(రైలెక్కాను, రమ్య, పుట – 13)
స్టేషను	(రైలెక్కాను, రమ్య, పుట – 13)
బారు	(సారాయి, రమ్య, పుట – 14)
బీరు	(సారాయి, రమ్య, పుట – 14)
సెకండరీ పరీక్షలు	(ఉగాది, రమ్య – పుట 15)
సీట్లు	(ఉగాది, రమ్య – పుట 15)
ఎ – క్లాసు చెరసాలలు	(నేటి విద్యాస్థాయి, రమ్య – పుట 18)
సర్టిఫికెట్లు	(నేటి విద్యాస్థాయి, రమ్య – పుట 18)
లాటరీ టిక్కట్లు	(నేటి విద్యాస్థాయి, రమ్య – పుట 18)
మై డియర్ బ్రదర్	(ఆలోచించు, రమ్య – పుట 18)

మొదలైన ఆంగ్ల పదాల ప్రయోగం సుధాకర కవితా జ్యోత్స్నలో ఉన్నాయి.

5.6.3 ధ్వన్యనుకరణ పదాలు:

ధ్వన్యను కరణ పదాల ఉచ్చారణకూ, అది నిర్దేశించే అభిదార్థాన్ని నిర్దేశించడం కష్టం. అనుకరణ పదాలన్నీ కూడా లక్షణార్థాన్నే కలిగి ఉంటాయి. వీటిలో కొన్ని సంకేతాలుగా ఉంటే మరికొన్ని సూచనప్రాయంగా ఉంటాయే తప్ప వాటికంటూ ఒక నైసర్గికార్థం కలిగి ఉండవు. అంటే ఇవన్నీ కూడా ఒకానొక ఉద్దిష్టానికి వాక్యగత అనుబంధంలో 'గాఢత్వాన్ని' అనుసంధింపచేస్తాయి.

సుధాకర కవితా జ్యోత్స్నలో ధ్వన్యనుకరణ పదాలను విరివిగా ప్రయోగించాడు సుధాకర్. అవి.

1. **కిలకిల:** నవ్వుట మొదలగువాని యందు అగు ధ్వనికనుకరణం[88] (ఇది 'కిల'కు ఆమ్రేడితరూపం)

   ''దరిసెనమగు నీరూపము
   చిఱుతల కిలకిలలలోను'' (సా.శ – 75)

   అని సాయిశతకంలో ప్రయోగం ఉంది.

[88] సూర్యరాయాంధ్ర నిఘంటువు, 2వ సంపుటం, పుట 261

ఇతర కవుల ప్రయోగాలకు ఉదాహరణలు.

i. ''కలువలు కిలకిల నవ్వెన్'' (సారంగ – 2.162)

ii. ''చెలగుచుఁ గిలకిలల్ గులుకు కోవెలలకు'' (యయా – 4.15)

2. **కటకట:** సంతాపమును తెల్పుతుంది.[89]

''కుటిల మనస్కుల చేతలు
కటకట! వివరింపలేను'' (సా.శ – 131)

అని సాయి శతకంలో ప్రయోగం ఉంది.

'....గటకట పూర్వజన్మమునఁ గర్మము లెట్టివి చేసినాడనో' (భాగ 1.373) అని భాగవతములో ప్రయోగం ఉంది.

3. **కొరకొర:** కోపము, ద్వేషము, విరోధము అనే అర్థాలున్నాయి.[90]

'కొరకొర లేక కోరికల కూరిమి దీర్చగదే' (సర – 15)

అని సరస్వతీ శతకంలో ప్రయోగం ఉంది.

'గొఱకొఱ యీలేని గొనము' (నీలా. 1.44)

అని నీలా సుందరి పరిణయంలో ప్రయోగం ఉంది.

4. **జలజల:** రాలుట తొలగుట లోనగు వానియందగు ధ్వనికనుకరణం.[91]

'జలజల జారు బాష్ప కణజాలము నేలబడంగ' (సర – 8)

అని సరస్వతీ శతకంలో ప్రయోగం ఉంది.

'ముడిచిన పువ్వులు జల్లల రాలగ' (కవిరా – 5. 245) అను ప్రయోగం కవిరాజ మనోరంజనంలో ఉంది.

5. **తలతల:** మెఱయుట యందగు ధ్వనికరణం.[92]

'తలతలలాడు నీ మొగము దామరలన్ ముకులింపజేయగా' (సర – 14)

అని సరస్వతీ శతకంలో ప్రయోగం ఉంది.

---

[89]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 2వ సంపుటం, పుట 27

[90]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 2వ సంపుటం, పుట 441

[91]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 3వ సంపుటం, పుట 52

[92]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 3వ సంపుటం, పుట 331

'దలతల ముంచుమించు సుమనవ్యరజంబులఁ దాల్చి' (చంద్రి – 4.80)

అను ప్రయోగం చంద్రికాపరిణయంలో ఉంది.

6. **పకపక:** నవ్వుట యందగు ధ్వనికనుకరణం.[93] ఉదాహరణకు

'పకపక నవ్వరె లోకులు' (రమ్య – పుట 31)

అనే ప్రయోగం రమ్యభావ తరంగాలలో ఉంది.

'చకచకన్ బకపక నవ్వు వజ్రభేది యలుంగు' (మను – 4.115)

అనే ప్రయోగం మనుచరిత్రలోనిది.

7. **బిరబిర:** త్వరగా, శీఘ్రముగా అనే అర్థాలున్నాయి.[94]

ఉదాహరణలు

i. 'బిరబిర వచ్చి మరి బిగ్గరగాను గవుంగిలింపవే' (సర – 15)

ii. 'పెండ్లి కొడుకు నిల్పి బిఱబిఱఁ గన్నెకు, సొగసుదిద్ది వేడ్క లిగురు లొత్త' (నీలా. 3.91)

iii. బిఱబిఱ విభుకడ కరుగక, కొఱకొఱ లాడెద వదేమి' (రసిక – 5.163)

8. **వడవడ:** వడకుట యందగుననుకరణం.[95]

ఉదాహరణలు.

i. వడవడ వడకుచు మసీదు వచ్చిరి పౌరుల్ (సా.శ – 46)

ii. వడవడ వడకుచు క్రమ్మర (భోజ. 3.87)

9. **విలవిల:** తన్నుకొనుటయందగు ధ్వనికనుకరణం.[96]

ఉదాహరణలు.

i. విలవిలలాడు నన్నొక కవీంద్రునిగా (సర – 8)

ii. విలవిల దన్నుక విడిచె ప్రాణములు (ద్వి. నల. 4)

10. **సరసర:** శీఘ్రము, గమనాదులందగు ధ్వనికనుకరణం.[97]

---

[93]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 5వ సంపుటం, పుట 36

[94]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 5వ సంపుటం, పుట 1014

[95]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 7వ సంపుటం, పుట 41

[96]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 7వ సంపుటం, పుట 270

[97]సూర్యరాయాంధ్ర నిఘంటువు, 8వ సంపుటం, పుట 231

ఉదాహరణలు

i. సరసర నాదు నాలుకను శాలను దూకుచు (సర – 15)

ii. సరసర గీత బందరు కవిలియలు

నరయుఁడు శోధింపు డవ్వనములు (పండితా. దీక్షా. 80)

పైన పేర్కొన్న ధ్వన్యను కరణ పదాలే కాక, ఇంకా మిలమిల, వడివడి, కలకల, చకచక, భగభగ మొదలైన ధ్వన్యనుకరణ పదాల ప్రయోగాలు సుధాకర కవితా జ్యోత్స్నలో ఉన్నాయి.

5.6.4 మాండలిక పదాలు:

ఒక ప్రదేశానికి లేక ప్రాంతానికి సంబంధించిన ప్రజలు వ్యవహరించే భాషా విశేషాన్ని గానీ, లేక భాషకు చెందిన ప్రజానీకంలో వృత్తిని బట్టిగానీ, కులాన్ని బట్టిగానీ ఏర్పడ్డ ఒక వర్గం ప్రజలు వ్యవహరించే ఒక భాషా భేదాన్ని గాని మాండలికమని వ్యవహరించవచ్చు.

సుధాకర కవితా జ్యోత్స్నలో

బోలెడు	=	చాలా	(సర – 33)
మచ్చుకు	=	కొద్ది పరిమాణంలో, ఉదాహరణకు	(సర – 28)
తతిమ్మ	=	మిగతా, మిగిలిన	(రమ్య – పుట. 24)
బండారం	=	రహస్యం, లోగుట్టు	(తోగు – 61)
బజ్జుకొంటి	=	నిద్రపోవడం (చిన్నపిల్లలకు వాడే భాష)	(తోగు – 70)

మొదలైన మాండలిక పదాల ప్రయోగాలున్నాయి.

★ ★ ★

ముగింపు

వర్ణనా నిపుణుడు కవి. కవి తాను ఎంచుకున్న వస్తువును కవిత్వీకరించడానికి ఎంతో పాటుపడతాడు. ప్రతి కవి తన కవిత్వంలో తనదైన ముద్రవేసుకుంటాడు. అలాగే సుధాకర్ కూడా. 'పలుకు బడి, ధారాశుద్ధి ఈ కవికి సహజమైనట్టి సంపత్తి' అని కోవెల సుప్రసన్నాచార్యగారు అనడంలో ఎంత మాత్రమూ అతిశయోక్తి లేదు.

'సుధాకర కవితా జ్యోత్స్న'లో నేటి సమాజాన్ని ప్రతిబింబించే సామాజికాంశాలున్నాయి. భగవంతుని గుణలీలావర్ణనలు, గీతోక్తులకు ఛాయోక్తులనదగిన పద్యాలున్నాయి. అదేవిధంగా యతి స్థానంలో మకుట ప్రయోగం ఉన్న పద్యాలున్నాయి. రగడలను పోలిన గేయాలున్నాయి. వీటిని పరిశీలించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కవితా సంపుటిని నా పరిశోధనాంశంగా ఎంచుకున్నాను.

నా ఈ పరిశోధనను ఐదు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో ''కవి జీవిత రేఖలు'' అనే అంశం కింద సుధాకర్ జీవితంలోని విశేషాలను, సుధాకర్ రచనలను, సుధాకర్ వ్యక్తిత్వాన్ని ప్రస్తావించాను. వీటితోపాటు సుధాకర కవితా జ్యోత్స్నను సంగ్రహంగా పరిచయం చేశాను. సుధాకర్ వ్యాసాలను, 'పరిశోధకుడిగా సుధాకర్' కృషిని తెలియచేశాను.

రెండవ అధ్యాయంలో ''సుధాకర కవితా జ్యోత్స్న – ఆధ్యాత్మికాంశాలు'' అనే అంశం కింద నవవిధ భక్తి విధానాలు – సమన్వయం, యోగశాస్త్ర విషయాలు, అధిక్షేపం, గీతోక్తులు – ఛాయోక్తులు అనే అంశాలను పొందుపర్చాను.

మూడవ అధ్యాయంలో సుధాకర కవితా జ్యోత్స్నలోని'సామాజికాంశాలను' చర్చించాను.

నాల్గవ అధ్యాయంలో సుధాకర కవితా జ్యోత్స్నలోని'కవితా శిల్పాన్ని' విశ్లేషించాను. సుధాకర్ రచించిన గేయాలలో ఎక్కువ శాతం రగడల ఛాయలున్నాయని తెలియచేశాను.

ఐదవ అధ్యాయంలో సుధాకర కవితా జ్యోత్స్నలోని భాషా సాహిత్య విశేషాలను చర్చించాను. ఇందులో ఛందస్సు, అలంకారాలు, సామెతలు, సూక్తులు, అన్యదేశ్యాలు, ధ్వన్యనుకరణ పదాలు, మాండలిక పదాలు మొదలైన అంశాలుగా చేసుకొని వివరించాను. నా ఈ పరిశోధన బుధజన సమ్మతము కావాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

★ ★ ★

ఉపయుక్త గ్రంథసూచి

1. అనంతామాత్యుడు. 2006. 'ఛందోదర్పణము' (వ్యాఖ్యాత చిర్రావూరి శ్రీరామ శర్మ) రాజమండ్రి: రోహిణి పబ్లికేషన్స్.
2. కవితా ప్రసాద్, రాళ్ళబండి. 2006. 'అవధాన విద్య – ఆరంభ వికాసాలు' వరంగల్లు: సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ.
3. కృష్ణ ప్రసాద్, మల్లాది. 2013. 'తెలుగు వ్యాకరణము'. సీతారాంపురం, విజయవాడ : విక్టరీ పబ్లికేషన్స్.
4. గిరిజా మనోహర్ బాబు, జి. (సం.). 2009. 'శతక సాహిత్యం – నైతిక సామాజిక విలువలు'. హన్మకొండ, వరంగల్ : దీప్తి ప్రింటర్స్.
5. గిరిజా మనోహర్ బాబు, జి. 2013. ' తెలుగు శతకాలు' (మోనోగ్రాఫ్) హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
6. గోపన్న, కంచర్ల. 1992. 'దాశరథి శతకం' గాంధీ నగర్, విజయవాడ : శ్రీ శైలజ పబ్లికేషన్స్.
7. చంద్రమౌళి శర్మ, శ్రిష్టి. 2010. 'నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వము'. ఒంగోలు : జనతా ప్రింటర్స్.
8. జమదగ్ని శర్మ, చెఱుకుపల్లి. వృషమాఘ పూర్ణిమ. 'త్రిశతి'. (శ్రీకాళహస్తీశ్వర స్వామి స్తోత్రము). రాజమండ్రి : ఆనందవల్లీ గ్రంథమాల.
9. తిమ్మకవి, లింగమకుంట. 2007. 'సులక్షణ సారము'. (వ్యాఖ్యాత జొన్నలగడ్డ మృత్యుంజయరావు) రాజమండ్రి–1 : రోహిణి పబ్లికేషన్స్.
10. తిలక్, బాలగంగాధర. 2011. 'అమృతం కురిసిన రాత్రి'. హైదరాబాద్ : విశాలాంధ్ర బుక్ హౌజ్.
11. ధూర్జటి. 2001. 'శ్రీకాళహస్తీశ్వర శతకము'. విజయవాడ–2 : వెంకట సత్యప్రింటర్స్.
12. నరసయ్య, సంగనభట్ల. 2009. 'తెలుగులో దేశి చ్ఛందస్సు – ప్రారంభ వికాస దశలు'.విద్యానగర్, హైదరాబాద్ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.

13. నారాయణ రెడ్డి, సింగిరెడ్డి. 2011. 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగాలు'. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్.
14. ప్రతాపరెడ్డి, సురవరం. 2013. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్.
15. పెద్దన, అల్లసాని. 2006. 'మనుచరిత్ర'. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
16. రఘురామ్, మద్దాళి (సం.) 2009. 'తెలుగు భాషా వైభవం'. సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాద్ : కిన్నెర పబ్లికేషన్స్.
17. రమణయ్య, కడప (సం.). 2011. 'తెలుగు కరదీపిక'. కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం.
18. రమణాచారి, కె.వి. 2009. 'పద్య కవిత్వం – వస్తు వైవిధ్యం'. హైదరాబాద్ : ఎమ్మెస్కో.
19. రామబ్రహ్మం, బేతవోలు (సం.) 2014. 'వర్ణన రత్నాకరం'. హైదరాబాద్ : ఎమ్మెస్కో.
20. రామరాజ భూషణుడు. 2010. 'కావ్యాలంకార సంగ్రహము' (వ్యాఖ్యాత : పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ). కోటగుమ్మం, రాజమండ్రి – 1 : రోహిణి పబ్లికేషన్స్.
21. లక్ష్మీనరసింహారావు, వుయ్యూరు. 1988. 'కువలయాశ్వ చరిత్రము – ఒక పరామర్శనము'. సెలపాడు, గుంటూరు, ఇందుమౌళి గ్రంథమాల.
22. వీరాస్వామి, గొల్లపూడి (వ్యాఖ్య). 2006. 'భగవద్గీత'. రాజమండ్రి : మహేశ్వరి ఆఫ్ సెట్ ప్రింటర్స్.
23. వెంకటరెడ్డి, కసిరెడ్డి. 1994. 'శ్రీకర్మణ్ ఘాట్ ఆంజనేయస్వామి శతకం'. నారాయణగూడ, హైదరాబాద్ : జాతీయ సాహిత్య పరిషత్.
24. శివసుబ్బరాయ గుప్త, మట్టుపల్లి (శివయోగి). 2002. 'బ్రహ్మవిద్య'. గుంటూరు–1 : స్వీయ ప్రచురణ.

25. శ్రీలత, గోలి. 2007. 'శేషప్ప త్రిశతి – ఒక పరిశీలన'. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖకు సమర్పించిన వ్యాసం (అముద్రితం).
26. శ్రీశ్రీ. 2008. 'సిప్రాలి'. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్.
27. సంపత్కుమారాచార్య, కోవెల. 2011. 'తెలుగు ఛందస్సులో వెలుగులు'. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
28. సుధాకర్, తిరువరంగం. 2002. 'సుధాకర కవితా జ్యోత్స్న'. సుధాకర సుషమ, మడికొండ : స్వీయ ప్రచురణ.
29. సుధాకర్, తిరువరంగం. 2003. 'సంపత్ విశ్వనాథ విజయ కావ్యానుశీలన'. సుధాకర సుషమ, మడికొండ : స్వీయ ప్రచురణ.
30. సుబ్బన్న శతావధాని, సి.వి. 2012. 'అవధాన విద్య'. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

నిఘంటువులు:

1. ఉషాదేవి, ఎ. 2001. 'ధ్వన్యనుకరణ పదకోశం'. హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
2. సంపత్కుమారాచార్య, కోవెల. 2012. 'తెలుగు ఛందః పదకోశము'. హైదరాబాద్ : తెలుగు అకాడమీ.
3. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2012. 'శ్రీ శబ్దరత్నాకరము'. విజయవాడ : శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో.
4. శ్రీ సూర్య రాయాంధ్ర నిఘంటువులు. 1979. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

★ ★ ★

అనుబంధం 1

డా. తిరువరంగం సుధాకర్ M.A, Ph.D గారి
''విశ్వనాథ విజయము – కావ్యానుశీలనము''
''సుధాకర కవితా జ్యోత్స్న''
పుస్తకావిష్కరణ సభాసందర్భమున – అందజేయు

మనసులోని మాటలు

శ్రీయుత సాహితీహితుడు చిన్మయ భావపరంపరాకృతిన్
శ్రేయముఁ గూర్చు సాహసుడు చింతల చిక్కుల లెక్కసేయకన్
మాయతలేని చెల్మిగల మాన్య సుధాకర తిర్వరంగవం
శీయుడు తెల్గు బోధక సుశీలుడు నేర్పరి సంస్కృతంబునన్

భారత భావిపౌరులను బాధ్యత గల్గునుదాత్త పౌరులై
భారతి కంఠహారమణి భాస్కరులై వెలుగొంద జేయగన్
ధీరమతీ సుధాకర సుధీయుత తెల్గునబోధజేసియ
వ్వారుల తీక్ష్ణబుద్ధికల వారలజేయు కృషీవలుండిలన్

ఐదారుపొడవైన యాకారదార్ఢ్యత। మేనిఛాయ పసిడి మెరయుచుండు।
సువిశాల ఫాలము సుందరనగుమోము। మాటకారి తనము మహిమ గలది।
ఒత్తైన నల్లని యుంగరాలగు జుట్టు, సుందరాంగుల స్వప్న సుందరుండు।
నడకలోపల ఠీవి నడతలోపల మైత్రి। ఆడంబరములేని యాత్మసొబుగు॥

వీణ హార్మణులను వీనులవిందుగ। వాయించగల్గిన వాద్యగాడు,
సంగీత సాహిత్య సమరసానుభవాల, నానందడెందాన నాలకించు।
నవ్వుచు మాటాడు నవ్వించునెప్పుడు। కరుణ గల్గినవాడు, కపటికాడు।
అరటి పండ్లనొలిచి యర చేతనిడినట్లు, అతని యాశు కవితలందు తీపి।

ఉత్తమోపాధ్యాయ వృత్తిని చేపట్టి। న్యాయము చేకూర్చె నియతి తోడ।
సంస్కృతాంధ్రాంగ్లముల్ చదివి సాధించిన। అపరభగీరథుండనగవచ్చు
గద్యపద్య రచనల్ గావించి ఘనుడయ్యు। గర్వంబులేనట్టి గౌరవుండు।
ధన్యులీతని తల్లిదండ్రి కళత్రముల్। హితబంధుయుత దేశమాత ధన్య।

ధన్య సౌజన్యమూర్తికీ యెన్నరాని
శ్రీశుఁడాత్మకిచ్చు తశాంతి శాశ్వతముగ
ఆత్మబంధువులందరి కందజేయు
ఆయురారోగ్య భాగ్యాల నధికతృప్తి।

రచన – సమర్పణ
హిత సుధాకర సాహితీ హితుడు
వి. చండికేశ్వర శర్మ
వరంగల్ – 2

తేది: 27-01-2003

★ ★ ★

అనుబంధం 2

యతి స్థానంలో మకుట ప్రయోగం ఉన్న శతక పద్యాలు.

శా. రాజుల్ మత్తులు వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షీ చతురంత యాన తురగీ భూషాదులాత్మ వ్యథా
బీజంబుల్, తదపేక్ష చాలు, బరితృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీ జాగ్రత్ పరిణామ మిమ్ము దయతో శ్రీకాళ హస్తీశ్వరా! 1

– (శ్రీకాళహస్తీశ్వర శతకం, ధూర్జటి)

ఉ. బొంకని వాడె యోగ్యుడరి బృందము లెత్తిన చోట, జివ్వకున్
జంకని వాడె జోదు, రభసంబున నర్థికరంబు సాచినన్
గొంకనివాడె దాత, మిముగొల్చి భజించిన వాడె పో, నిరా
తంక మనస్కుడెన్నగను దాశరథీ కరుణా పయోనిధీ! 2

– (దాశరథి శతకం, కంచర్ల గోపన్న)

కం. ఖగరాట్ కృషి ఫలితంగా
పొగాకు భూలోకమందు పుట్టెనుగానీ
పొగచుట్ట లెన్నియైనను
సిగరెట్టుకు సాటిరావు సిరిసిరి మువ్వా! 3

– (సిరిసిరి మువ్వ శతకం, శ్రీశ్రీ)

ఉ. మంత్రికి నేను మిత్రుడను, మంత్రి వరేణ్యుని వెంటవచ్చినన్
మంత్రిని నేను తేగలను, మంత్రికె నేటి సభాపతిత్వమన్
మంత్రుల చేతి జంత్రముల మాదిరి మ్రోగెడు నట్టి వట్టి దు
స్తంత్రుల నేమి జేయవలె దాశరథీ కరుణా పయోనిధీ! 4

– (అభినవ దాశరథి శతకం, దాశరథి)

మధ్యాక్కర. మంచి కూయుము మంచి వ్రాయుము మంచి చేయుము ధాత్రిలో
మంచియే మన మానవాళిని మార్చునంచని ఎంచుడీ!
మంచి ముంచెడు స్వార్థశక్తుల మాయజాలము పెర్గితే
పంచకమ్మగు సంచితార్థము ప్రాపుగోరితి మారుతీ! 5
– (శ్రీ కర్మణ్ ఘాట్ ఆంజనేయస్వామి శతకం, కసిరెడ్డి వెంకట్ రెడ్డి)

శా. ఊహల్ పందిరికెక్కు పాదులయి దిగ్వ్యూహంబులన్ నిండ తా
నోహో జీవుఁడు మోహమందు చకటా యూహింపగా లేదు స
న్నాహంబై వెనువెంట మృత్యువొకఁడున్న ట్లెంచగాఁ జాలుచో
స్నేహ స్వాదువు నిన్ భజించి శివుడౌ శ్రీకాళహస్తీశ్వరా! 6
– (త్రిశతి, చెఱుకుపల్లి జమదగ్ని శర్మ)

శా. వాట్సైడూ సరుమై డివైను ట్రెడిషన్? ఫాలింగిటీజ్ డేటుడే
ఫేటల్ లింక్స్, డెవిల్ డిజైర్స్, లవులెస్, వెట్లెస్, స్ప్లిట్టింగ్ ఫ్యామిలీస్,
టోటల్లీ ఇటు హోజ్ కొలాప్సు, హియరాల్, డూగుడ్ ఫరిట్ వన్సెగైన్
గ్రేటాల్మైటి కమాన్, ఉయారు వెయిటింగ్ శ్రీరామ లింగేశ్వరా! 7
– (రామలింగేశ్వర శతకం, జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు)

★ ★ ★

అనుబంధం 3

సారాయి (మిశ్రగతి)

సారయను కాసార ముంటే సార యేరై పారుతుంటే
సారసంద్రమై యెల్ల విచారముల కిక తావులేదని
పారలౌకిక సారమని మనసార సారకు దాసులైతే
ఆరుగాలము బడ్డ శ్రమ నిక బారు లోపల బీరు కమ్ముచు
జారులో బజారులో దిగ జారుచును తామారుచుండుట
మారుచుందురు ''రోగులు'' గనే మేరలనన్నిటి మీరుచుందురు
ఆలుబిడ్డల నాదుకొను నీ యాస్తి యంతయు ''నాస్తి'' యంటే
దొప్ప దోగెడు బ్రతుకు కాస్తా కుప్పకూలుట తప్పదన్నా
అప్పులకునై చెప్పులరగగ నరుగు చుందురు పరుగు పరుగున
ముప్పు తప్పక ముళ్ళబాటల తిరుగుచుందు రిదేమి తిప్పలు
సారతో సంసారమంతా సారహీనము సేయుటేలా
సార – హీనము, సారహీనము దార సుతుల దహించు పానము
మధురతర హాలాహలమ్మిది కమ్మనైనా కాలకూటము
నరనరాలకు పారిమెదడును నష్టపరచెడి దుష్టభూతము
తరతరాలుగ జాతి కూల్చగ నవతరించిన యశనిపాతము
ఘాటు ఘాటుగ కాటువేసెడి నాటుసారా కాలసర్పము
మత్తులో గమ్మత్తు జూపుతు చిత్తుజేయును తొత్తు జేయును
డబ్బులాగును జబ్బురేగును దెబ్బతీయును బొబ్బరేపును
రణమునకునది కారణమ్మగు పణములకు నిది మాపణమ్మగు
యువత మనుగడ కిదొక శాపము నవత పాలిటి నరక కూపము
నవ్య నాగరకతా రూపక హవ్య వాహన దగ్ధజీవన
జనగణముల భ్రమింప జేసెడు కాకి బంగారము సుమ్మా!

★ ★ ★

అనుబంధం 4

ప్రకృతి – వికృతి (ఖండగతి)

ఒక్క చి/న్నది నన్ను	–	సక్కంగ / దరిజేర	
పక్కను/న్నా కుక్క	–	పైపైకి/లేచింది	
మాలతీ/లతిక కుసు	–	మాల వా/సనలీన	
నాగుబా/ములు దాని	–	నానుకో/నున్నాయి	
ప్రేమపా/శము వేసి	–	ప్రీతిలో/లాగంగ	
కాలపా/శము వేసి	–	కాల్దువ్వ/నున్నాయి	॥ ఒక్క సిన్నది ॥
రత్నమని/యెంచి నే	–	రక్తితో/ దరిజేర	
రాళ్ళ సో/పతి జేసి	–	రాయిగా/మారింది	
బంగారమని నేను	–	భ్రమసితే/అది కాకి	
బంగార/మై నన్ను	–	బాధింప/సాగింది	
నేతి బీ/రనుకొని	–	నేనాస/పడిపింద	
నేయి కా/దది వట్టి	–	నీరయ్యి/కారింది	
పెదవి తే/నియలూర	–	ఎదలోన/విసమూర	
విసము తే/నియతో	–	వియ్యమును/బొందింది	
తేనియను/ఆసతో	–	దానిదరి/నే జేర	
వికృతియై/ ఆ ప్రకృతి	–	విసము చిం/దించింది	
ఏనాడు/నా హృదయ	–	మెరుగ దిం/తటి బాధ	
దాని యం/దానికే	–	దాసుణ్ణి/చేసింది	॥ ఒక్క సిన్నది ॥

★ ★ ★

అనుబంధం 5

గజముఖుడు (షణ్మాత్రా గతి)

ఈశుని జడ/ముడి లోపల	–	యిరుక్కున్న గంగను గని
పక్కనున్న/ పార్వతమ్మ	–	ఫక్కున న/వ్వించేమో
గజస్నాన/మాచరింప	–	గజముఖునకు/వీలుగాక
ఎలుక వాహ/నంబు నెక్కి	–	ఏ కోనల/ కేగకున్న
భూతి స్నాన/ముతోనే	–	భూత పతికి/తృప్తి గలుగ
పూత చరిత/పార్వతి తన	–	బిడ్డను కని/మురిసిపోయె

★ ★ ★

అనుబంధం 6

కాళోజీ నారాయణరావుతో రచయిత డా. తిరువరంగం సుధాకర్